
# ఛేన్స్ ఫర్ డెత్



మధుబాబు

# టేస్ట్ ఫర్ డెత్

చెవులు చిల్లులుపడే శబ్దంతో పెసోటా ఎయిర్‌పోర్ట్‌లో లాండ్ అయింది స్పానిష్ ఎయిర్‌వేస్‌కి చెందిన వైకౌంట్ విమానం.

ప్రయాణీకులందరికంటె ముందుగా దిగాడు షాడో. నిలువుచారలున్న నీలిరంగు ఎయిర్‌బేగ్‌ని భుజానికి తగిలించుకొని కస్టమ్స్ కౌంటర్ దగ్గిరికి పోయాడు.

"ఎనీ థింగ్ టు డిక్లేర్ సర్?" వెంటనే అడిగాడు అక్కడ డ్యూటీ చేస్తున్న అధికారి.

ఎయిర్ బేగ్‌ని ఓపెన్ చేసి అతని ముందుకు నెట్టాడు షాడో. పాంటు జేబులో నుంచి పాస్‌పోర్ట్‌ని తీసి కౌంటర్ మీద పెట్టాడు.

ఇతర దేశాలలోని కస్టమ్స్ ఆఫీసర్స్ మాదిరి అనవసరమైన ప్రశ్నలు వేసి అతన్ని ఇబ్బంది పెట్టలేదా అధికారి.

"మా సిటీని చూడటానికి వచ్చే టూరిస్టులంటే మాకు ఎంతో అభిమానం సర్... మమ్మల్ని చికాకు పెట్టే వస్తువుల్ని మీ వెంట తీసుకురారని మా ప్రగాఢవిశ్వాసం... యూ కెన్ మూవ్ ఆన్..."

చిరునవ్వుతో చేయిపూపుతూ, మర్యాదనిండిన కంఠంతో అన్నాడు.

మూవ్ ఆన్ అయ్యాడు షాడో... పాస్‌పోర్ట్‌ని తిరిగి పాంటు జేబులో పెట్టుకుని, ఎయిర్‌బేగ్‌ని భుజానికి తగిలించుకొంటూ ఎయిర్‌పోర్ట్ ముందుభాగంలోకి వెళ్ళాడు. అక్కడికి రెండువందల మీటర్ల దూరంలో వున్న టాక్సీస్టాండ్ వైపు చూస్తుండగా ఎదురయింది ఆ అందాల భరిణె.

"కంపెనీ కావాలా మిస్టర్? పెసోటా అందాల్ని చూడటానికి తోడుగా రావాలా??" ఎదురుగా నిలబడి చనువుగా చేయిపట్టుకొంటూ అడిగింది.

అదే మరెప్పుడయినా అటువంటి బొమ్మ ఎదురయి వుంటే తప్పకుండా తలవూపి వుండేవాడతను. అటువంటి పనులు చేసే పరిస్థితుల్లో లేదు అతని మూడ్ ఇప్పుడు.

పది గంటలు దాటక ముందే పెసోటా సిటీ సెంట్రల్ స్క్వేర్ దగ్గిరికి వెళ్ళవలసిందిగా ఆర్డర్స్ ఇవ్వబడ్డాయి అతనికి. అక్కడ వెయిట్ చేస్తూ వుండే స్పానిష్ ఏజెన్సీ ఏజెంట్‌ని కలుసుకోమని క్లియర్‌కట్ ఇన్‌స్ట్రక్షన్స్ జారీ చేయబడ్డాయి.

వచ్చిన పనిని వదిలేసి ముద్దుగుమ్మలతో కబుర్లు చెప్పుతూ కూర్చుంటే ఎలా??

"డబ్బు ఖర్చు అవుతుందని భయపడాల్సిన అవసరం లేదు మిస్టర్... కారు చౌక..." అతని ఆలోచనల్ని మరో విధంగా అర్థం

చేసుకొన్నది కాబోలు, మరింత మత్తుగా, మరింత మధురంగా అన్నది ఆ పంచదార చిలుక.

అపాలజిటిక్‌గా నవ్వి తల అడ్డం తిప్పాడు షాడో... ఆమె చేతిలో బంధింపబడిన తన చేతిని వదిలించుకుని ప్రక్కకు తిరిగాడు.

పట్టిన పట్టు వదలకుండా వెంట వచ్చేయాలామె - అతని అంచనా ప్రకారం. ఏదో ఒక విధంగా అతనిని బుట్టలో వేసుకోవటానికే ప్రయత్నించాలి.

పది అడుగులు వేసిన తర్వాత కూడా ఆమె అటువంటి పనులు ఏమీ చేయకపోవటంతో అనుమానం వచ్చి, వెనక్కి చూశాడు భుజం మీదినించి.

పరుగులాంటి నడకతో పార్కింగ్ లాట్ దగ్గిరికి పోతున్నదామె. అతను చూస్తూవుండగానే అక్కడ వున్న ఎరుపు రంగు టొయోటాలో కూర్చున్నది.

వేపాకులు నమిలిన సెన్సేషన్ వెంటనే ఆవరించుకొన్నది షాడోని.

అందాల్ని ప్రదర్శించి పొట్టపోసుకొనే ఆర్డినరీ స్ట్రీట్ వాకర్స్ మెయింటైన్ చేయగల వెహికిల్ కాదు ఆ టొయోటా!

మల్టీ మిలియనీర్స్ మాత్రమే ఎఫోర్డ్ చేయగల కాస్ట్లీ వాహనం!!

భుజానికి తగిలించుకొన్న ఎయిర్ బేగ్‌ని చేతుల్లోకి తీసుకొంటూ, వింటినించి వెలువడిన బాణంలా టాక్సీస్టాండ్ దగ్గిరికి పరుగు తీశాడు షాడో.

"కమాన్ మై ఫ్రండ్... లెటజ్ మూవ్ ఫ్రమ్ దిస్ ప్లేస్..." అని ఒక డ్రయివర్‌ని హెచ్చరిస్తూ, టాక్సీ బాక్ డోర్‌ని ఓపెన్ చెయ్యబోతుండగా -

చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం... సూదుల మాదిరి లేచి నిలబడ్డాయి మెడ మీది వెంట్రుకలు.

టాక్సీలో కూర్చునే ఆలోచనను అర్జంటుగా విరమించేసుకొని వెనక్కి దూకాడతను. టాక్సీస్టాండ్‌కి కొంచెం అవతలగా వున్న కొన్ని పూపొదల్ని క్రాస్ చేసి, మెయిన్ రోడ్డుమీదికి పరుగుతీయాలనే వుద్దేశ్యంతో అటుకేసి కదలబోతుండగా - ఎట్ట ఎదుట ప్రత్యక్షం అయ్యారు ఇద్దరు ఆగంతకులు.

మూడు అంగుళాల మందం వున్న ఐరన్ పైప్ నొకదాన్ని పట్టుకొని వున్నాడు మొదటి వ్యక్తి. కుబుసం విడిచిన త్రాచులా తళతళలాడి పోతున్న చురకత్తిని బయటికి తీస్తున్నాడు రెండో పెద్దమనిషి.

కంపెనీ ఇస్తానంటూ వచ్చిన పంచదార చిలుక కాస్ట్లియస్ వాహనమైన టొయోటాలో కూర్చున్నప్పుడే అటువంటి ట్రబుల్‌ని ఎక్స్‌పెక్ట్ చేయటం వల్ల అతిగా ఆశ్చర్యపోలేదు షాడో.

"అన్యాయం ఇది... అక్రమం... రక్షించండి... నన్నెవరయినా వెంటనే రక్షించండి..." భయంతో వణికి పోతున్నట్లు ఫీలింగ్స్ ఇస్తూ, బిగ్గరగా అరిచాడు.

అటువంటి దృశ్యాలు చూడటానికి అలవాటు పడివున్నారో, లేక ఆ దృశ్యాన్ని చూడడానికి ముందుగానే ప్రిపేర్ చేయబడి వున్నారో గాని, ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు అక్కడవున్న టాక్సీడ్రయివర్లు. తమకేమీ పట్టనట్లు తలలు వంచుకున్నారు.

"ఇంకా కాస్త గట్టిగా అరుచ్... ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ గార్డుల్ని కూడా పిలుచుకో...'' అంటూ చేతిలోని పైప్‌తో షాడో తలమీద కొట్టాడు మొదటి ఆగంతకుడు.

ఆ దెబ్బను తప్పించుకోవటానికి ప్రక్కకు దూకితే, చురకత్తితో గుండెల్ని చీల్చివేయటానికి సిద్ధంగా పొజిషన్ తీసుకొన్నాడు రెండో ఆగంతకుడు.

అతను ఊహించినట్లు ప్రక్కకు దూకలేదు షాడో... సెక్యూరిటీ గార్డులను ఉద్దేశించి గొంతును కూడా చించుకోలేదు.

ఎడమ చేతిని చటుక్కున పైకెత్తి పక్కకు నెట్టేశాడు తన తల మీదికి వచ్చిన ఐరన్ పైప్‌ని. అదే సమయంలో స్పీడుగా విసిరాడు తన కుడిపాదాన్ని.

మెరుపుకంటె వేగంగా పోయి మొదటి వ్యక్తి ఎడమ మోకాలికి కనెక్ట్ అయిందది. ఫట్‌మని శబ్దం చేస్తూ పగిలిపోయింది అతని నీకేప్... శరీరపు బరువును భరించలేక మడతబడి పోయింది మోకాలు.

దారుణమైన బాధతో విలవిలలాడుతూ క్రిందికి జారిపోతున్న ఆ వ్యక్తి చేతుల్లోని ఐరన్ పైప్‌ని ఒడిసి పట్టుకొన్నాడు షాడో. అతని మీదినించి చిన్న జంప్ ఇచ్చి, రెండో ఆగంతకుడి ముందు నేలను తాకాడు.

తమను, తమ దగ్గిర వున్న ఆయుధాల్ని చూసిన వెంటనే కళ్ళుతిరిగి క్రిందపడిపోవాల్సిన మనిషి, ఆ విధంగా ఎదురు దెబ్బతీస్తాడని ఊహించలేదు కాబోలు, అదిరిపడి, వెనక్కి జరిగే ప్రయత్నం చేశాడు ఆ ఆగంతకుడు.

అప్పటికే అయిపోయింది ఆలస్యం.

గిరగిరా తిప్పాడు షాడో ఐరన్ పైప్‌ని. శరీరంలో వున్న శక్తినంతా చేతిలోకి రప్పించుకొంటూ మోదాడు అతని ముఖం మీద.

విరిగి పోయింది దవడ ఎముక... చీరుకు పోయింది నెమరు కణత... వెల్లువలా భుజంమీదికి జారడం మొదలు పెట్టింది ఎర్రటి రక్తం...

ఎయిర్ పోర్ట్ బిల్డింగ్‌లన్నీ దద్దరిల్లి పోయేటట్లు వెర్రిగా అరచి, తన చేతుల్లోవున్న చురకత్తిని వదిలేశాడతను... ముఖాన్ని చేతులతో కప్పుకొంటూ వెనక్కి పారిపోయేందుకు ట్రై చేశాడు.

అతనితో పాటు కదిలాడు షాడో... దయ దాక్షిణ్యం అనే మాటలకు అర్థం అసలు తనకు తెలియనట్లు మరోసారి ప్రయోగించాడు ఐరన్ పైప్‌ని.

నేలకేసి బాదబడిన బూడిద గుమ్మడి కాయ మాదిరి రెండుగా విచ్చింది ఆ ఆగంతకుడి శిరస్సు. ఆ చుట్టుపట్ల వున్న వారి చెవులు చిల్లులు పడిపోయేటట్లు ఆర్తనాదాలు చేస్తూ విరుచుకు పడిపోయాడతను.

ఆ అరుపుల్ని ఆలకించి ఎయిర్‌పోర్ట్ సిబ్బంది అటుగా పరిగెత్తుకు వస్తే, తన పొజిషన్ ఏవిధంగా మారిపోతుందో ఊహించుకొనే సరికి, షాడో నుదుటి మీద ప్రత్యక్షం అయ్యాయి రెండు స్వేద బిందువులు.

అలుపు ఆయాసం అనేవి ఎలా వుంటాయో తెలియనట్లు, అతి తేలికగా ఇద్దరు వ్యక్తుల్ని అవుటాఫ్ కండిషన్ చేయగలిగిన తనను ఊరికే వదిలి పెట్టరు వాళ్ళు. పట్టుకుపోయి పోలీసులకు అప్పగిస్తారు.

మట్టి బొమ్మ మాదిరి అక్కడే నిలబడి, చేజేతులారా ఆ పరిస్థితిని నెత్తిమీదికి తెచ్చుకోవటం దేనికిట??

స్థాణువుల్లా నిలబడివున్న టాక్సీ డ్రయివర్స్ కేసి ఒకసారి ఉరిమి చూసి, చేతిలోని ఐరన్ పైప్‌ని అవతలికి విసిరేశాడు షాడో.

"అరవటానికి గాని, నన్ను పట్టుకోవటానికి గాని ప్రయత్నాలు చేశారంటే మారి పోతాయి మీ షేపులు. ఖబడ్దార్..." వచ్చీరాని స్పానిష్ భాషలో వికృతంగా హెచ్చరిస్తూ పూపాదల నించి జంప్ చేసి మెయిన్ రోడ్డు మీదికి పరుగుతీశాడు.

ట్రాఫిక్‌ని కంట్రోల్ చేసే కానిస్టేబిల్స్ గమనించటం జరిగితే కథ మళ్ళీ మొదటికి వచ్చేస్తుందని తెలిసికూడా, ఎయిర్ హారన్స్ మ్రోతలతో హోరెత్తిపోతున్న హెవీ ట్రాఫిక్‌కి అడ్డం పడి, రోడ్డు ఆవలి ప్రక్కకు చేరుకున్నాడు.

పదిగజాల దూరం కూడా నడవకముందే కనిపించిందతనికి ఖాళీగా కదులుతున్న టాక్సీ ఒకటి.

"పోనీ బ్రదర్.... అర్జెంటుగా ముందుకు పోనీ..." ఒకే ఒక జర్క్‌తో వెనుక తలుపు తెరిచి సీటు మీదికి చేరుకుంటూ కమాండ్ చేశాడు.

కనుచివరలనుంచి అతని ముఖంలోకి ఒకసారి చూసి, టాక్సీని ముందుకు దూకించాడు డ్రయివర్.

వెనక్కి తిరిగి ఎయిర్ పోర్ట్ వైపు చూడాలనే కోరికను బలవంతంగా అణుచుకొంటూ సీటువెనక్కి వాలి కూర్చున్నాడు షాడో. కనులు మూసుకుని కాస్తంత రిలాక్స్ అవుదామని అనుకుంటూవుండగా - రియర్ వ్యూ మిర్రర్‌లో అతనికి అగుపించింది క్లోజ్‌గా ఫాలో అయి వస్తున్న ఎరుపురంగు టొయోటా.

రెండు నిముషాల పాటు ఓపిక పట్టాడు షాడో.... మూడో నిముషం ఎంటర్ అవుతుండగా అంతరించిపోయింది అతని సహనం...

టాక్సీని ఆపించి అటో ఇటో తేల్చుకోవటమే మంచిదన్న నిర్ణయం మనసులో రూపు దిద్దుకుంటుండగా, "స్టాప్ ది వెహికిల్... స్టాప్..." అని ఆర్డర్ ఇచ్చాడు.

అటువంటి అర్ధాంతరపు కస్టమర్స్‌ని గతంలో చాలాసార్లు చూసిచూసి తల పండిపోయినట్లు దీర్ఘంగా నిట్టూరుస్తూ టాక్సీని ప్రక్కకు తిప్పి స్లో చేశాడు డ్రయివర్.

పాంటు జేబులో వున్న వాలెట్‌ని తీసి సిద్ధమయినాడు షాడో... ఒక కరెన్సీ నోటును తీసి అతని మీదికి విసురుతూ, టాక్సీ పూర్తిగా ఆగక ముందే క్రిందికి దూకేశాడు. ఫుట్‌పాత్ మీద వున్న ఒక ఫైర్ హైడ్రయంట్ దగ్గిర నిలబడి టొయోటాకేసి తలతిప్పుతుండగా కనిపించింది అతనికి టొయోటా విండోలోనుంచి బయటికి తొంగి చూడబోతున్న మిషన్ గన్ బారెల్.

అటో ఇటో తేల్చుకోవాలని తను తీసుకున్న నిర్ణయాన్ని అర్జంటుగా వాయిదా వేసుకొని చాపచుట్టలా వెనక్కి పడిపోయాడతను. తలకు చేతుల్ని అడ్డం పెట్టుకొని ఫైర్ హైడ్రయంట్ చాటున ఒదిగిపోయాడు.

చెవులు చిల్లులు పడే శబ్దంతో గర్జించటం ప్రారంభించింది మిషన్ గన్...

గొల్లున అరిచి చట్రాతి మీద కొట్టిన చిల్లపెంకుల్లా చెల్లాచెదరు అయిపోయారు ఫుట్‌పాత్ మీద అడుగులు వేస్తున్న పౌరులు అనేకమంది.

తల ఎత్తి చూస్తే తన పని అక్కడికక్కడే ఖతమై పోతుందన్న అనుమానంతో మరింతగా ముడుచుకు పోయాడు షాడో.

ఎంత హఠాత్తుగా ప్రారంభం అయ్యాయో, అంతే హఠాత్తుగా అంతం అయిపోయాయి కాల్పులు.

మెల్లిగా తల ఎత్తి చూసిన షాడో కనులకు వెంటనే అగుపించింది రాకెట్ మాదిరి దూసుకు పోయి ట్రాఫిక్‌లో కలిసిపోతున్న టొయోటా.

దుస్తులకు అంటిన దుమ్మును దులుపుకుంటూ లేచి నిలబడబోయిన అతనికి చేతిని అందించి సహాయం చేశాడు ఒక పోలీస్ కానిస్టేబిల్.

"ఆర్ యూ ఆల్ రైట్? దెబ్బలు ఏమైనా తగిలాయా??" అంటూ పరామర్శించాడు.

మిషన్ గన్ కాల్పులు అర్ధాంతరంగా అంతం అయిపోవటానికి కారణం ఆ కానిస్టేబిల్ అక్కడ ప్రత్యక్షం అవటమేనని గ్రహించి, జీవం లేని నవ్వొకటి నవ్వాడు షాడో.

"అన్నెం పున్నెం ఎరుగని అమాయకుల మీద దౌర్జన్యాలు చేయటం, తమ దారిన తాము పోయే ఇన్నోసెంట్స్ మీద కాల్పులు జరపటం ఈ మధ్య చాలా ఎక్కువ అయిపోయింది. డూ యూ వాంట్ ఎనీ మెడికల్ ఎయిడ్?" అతన్ని వదిలి పెట్టటం తనకు ఇష్టం లేనట్లు మరోసారి అడిగాడు ఆ కానిస్టేబిల్.

అతనితో కబుర్లు చెపుతూ అక్కడే నిలబడితే, ఎయిర్‌పోర్ట్ దగ్గిర తన హీరోయిజాన్ని అబ్జర్వ్ చేసిన వారెవరయినా అటుగా

వస్తారేమోనన్న భయం మనసును పట్టి పీడించటం మొదలెట్టేసరికి, చిన్నగా నవ్వి తల అడ్డం తిప్పాడు షాడో. ఫైర్ హైడ్రయంట్‌కి నాలుగు అడుగుల దూరంలో పడిపోయిన ఎయిర్ బేగ్‌ని అందుకోవటం కోసం అటుకేసి తిరగబోతుండగా కనిపించాడతనికి పేవ్‌మెంట్ మీద పడి వున్న పది సంవత్సరాల కుర్రవాడు.

టొయోటాలోనుంచి దూసుకు వచ్చిన మిషన్ గన్ బుల్లెట్ ఒకటి గుండెల్ని గాయపరచటం వల్ల స్పృహ కోల్పోయి వున్నాడతను... నెత్తురు మడుగులో తేలుతున్నాడు.

"అతనికి ఆ దుస్థితి పట్టటానికి కారకుడివి నువ్వే... నువ్వు టాక్సీలోనుంచి దూకకుండా ఉన్నట్లయితే హాయిగానే వుండి ఉండేవాడతను..." ఉన్నట్లుండి వికృతకంఠంతో ఎత్తి పొడవటం ప్రారంభించిన అంతరాత్మ పలుకుల్ని వినిపించుకోనట్లు నటిస్తూ కానిస్టేబిల్ కేసి చూశాడు షాడో.

"ఎయిర్ పోర్ట్ దగ్గిర ఏదో గొడవ జరిగి, ఇద్దరు వ్యక్తులు చావు బ్రతుకుల్లో వున్నట్లు మెసేజి రావటం వల్ల, ఎవైలబుల్‌గా వున్న రెండు అంబ్యులెన్స్‌ల్నీ అక్కడికి పంపించారట, ఇక్కడికి దగ్గిర్లో వున్న హాస్పిటల్ అధికారులు... ఇంకో హాస్పిటల్ని కంటాక్ట్ చేయటానికి ప్రయత్నిస్తున్నారు..." ఎడమచేతిలో వున్న మినీ వైర్‌లెస్ సెట్‌ని చూపిస్తూ అస్పష్టంగా అన్నాడు కానిస్టేబిల్.

మెడికల్ ఎయిడ్ వెంటనే లభించకపోతే ఆ కుర్రవాడు బ్రతికి బట్టకట్టటం అసాధ్యం అని గ్రహించి, రెండో ఆలోచన లేకుండా అటుకేసి జంప్ చేశాడు షాడో.

కుర్రవాడి చుట్టూ గుమికూడుతున్న పౌరుల్ని ప్రక్కకు నెట్టి, అతన్ని చేతుల్లోకి ఎత్తుకున్నాడు.

"కమాన్... కమ్ విత్ మీ..." అని కానిస్టేబిల్ని హెచ్చరిస్తూ ముందుకు పరుగుతీశాడు.

ఫైర్ హైడ్రయంట్‌కి దూరంగా పడిపోయిన అతని ఎయిర్ బేగ్‌ని అందుకొని భుజానికి తగిలించుకున్నాడు కానిస్టేబిల్. పేవ్‌మెంట్ మీది పౌరులు షాడో దారికి అడ్డుపడకుండా తన బెల్టులోని లాటీని తీసి గాలిలో వూపుతూ దారి చూపించాడు.

వందగజాల దూరం పోయిన తరువాత కనిపించింది షాడోకి, ఖాళీగా పోతున్న టాక్సీ ఒకటి.

అతన్ని, అతని చేతుల్లోని ఆకారాన్ని చూసి తల అడ్డం తిప్పేశాడు డ్రయివర్. యాక్సిలేటర్‌ని అదమబోయాడు.

"నీ అంతు చూస్తాను.... ఈ సారి నువ్వు ఈ స్ట్రీట్‌లో కనిపించిన వెంటనే దొంగ కేసులు తొంభై తొమ్మిది బనాయించి నీ లైసెన్స్

ఊడిపోయేటట్లు చేస్తాను....” అతని ఉద్దేశాన్ని గమనించి వెంటనే అరిచాడు కానిస్టేబిల్.

బిక్కమొగంతో టాక్సీని ఆపాడు డ్రయివర్. నాలుగు నిముషాల్లో వారిని పదిమైళ్ళదూరంలో వున్న హాస్పిటల్‌కి తీసుకుపోయాడు.

లాటీని పట్టుకుని యమభటుడిలా వచ్చిన కానిస్టేబిల్‌ని గమనించి వెంటనే రంగంలోకి దిగిపోయారు హాస్పిటల్ అధికారులు. ఇంటెన్సివ్ కేర్ తీసుకొని ఆ కుర్రవాడికి ఎటువంటి ప్రమాదము లేదని అనౌన్స్ చేశారు రెండుగంటల తర్వాత.

వెయిటింగ్ రూమ్‌కి సమీపంలో వున్న టాయ్‌లెట్స్ లోకి పోయి, కుర్రవాడి రక్తంతో మలినమై వున్న తన దుస్తుల్ని మార్చుకున్నాడు షాడో.... ఎయిర్ బేగ్ అడుగుభాగంలో అతి జాగ్రత్తగా భద్రపరచబడివున్న ఆయుధాల్ని బెల్టుచాటున పెట్టుకుంటూ బయటికి వచ్చాడు.

"మా సిటీకి చెందినవాడివి కాకపోయినా, మా భాష నీకు పూర్తిగా అవగతం కాకపోయినా, ఒక పసిప్రాణాన్ని కాపాడటం కోసం నువ్వు పడిన తపన నిజంగా అభినందనీయం...” అతనికి ఎదురువచ్చి భుజం మీద చేయి వేస్తూ ఆర్ద్రంగా అన్నాడు కానిస్టేబిల్.

బెల్టుచాటున పెట్టుకున్న ఆయుధాల సంగతి అతనికి అర్థం అయితే కొంపలు అంటుకుంటాయన్న భయంతో, కాస్తంత వెనక్కి జరిగి చిరునవ్వు నవ్వాడు షాడో.

ఒక పసిప్రాణాన్ని కాపాడటం కోసం ఎంతగానో తపించిపోయిన తాను, అంతకు ముందు అరగంట క్రితం రెండు పెద్ద ప్రాణాలు మంచం పట్టే పరిస్థితిని కల్పించినట్లు తెలిస్తే, ఎటువంటి డైలాగులు అతని నోటినుంచి వస్తాయో ఊహించటానికి ప్రయత్నిస్తూ, తన దారిన తను పోవటానికి రెడీ అయినాడు.

"నువ్వు ఎక్కడికి పోవాలో చెప్పు బ్రదర్... నేను స్వయంగా వచ్చి దిగబెడతాను. మా స్టేషన్‌కి మెస్సేజి పంపించి మంచి వెహికిల్ నొకదాన్ని తెప్పిస్తాను" అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా, బెల్టుకు తగిలించుకున్న మినీ వైర్‌లెస్ సెట్‌ని చేతుల్లోకి తీసుకున్నాడు కానిస్టేబిల్.

పోలీస్ వెహికిల్‌లో కూర్చోవటమనే మాట చెవుల పడేసరికి చేదుగా తయారయింది షాడో నోరు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా షర్టు జేబును తడుముకున్నాడు. ఆందోళనగా ముఖం పెట్టి పాంటు పోకెట్స్‌ని కూడా వెతుక్కున్నాడు.

"వాటీజ్ ఇట్ మై ఫ్రండ్? వాట్ హేపెన్డ్??" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు కానిస్టేబిల్.

"వాలెట్ కనిపించటం లేదు. డ్రస్ ఛేంజి చేసుకునే సమయంలో ప్రక్కన పెట్టి మరిచిపోయినట్టున్నాను." పాంటు జేబులోనే ఉన్న వాలెట్‌ని అతను చూడకుండా ఇంకా కాస్త క్రిందికి అదుముకుంటూ అన్నాడు షాడో. పరుగులాంటి నడకతో టాయిలెట్స్ వైపు బయలుదేరాడు.

తనతో పాటు కానిస్టేబిల్ కూడా కదిలితే, అతన్ని అక్కడే నిలబెట్టే మార్గం కోసం ఆలోచించటం మొదలు పెట్టకముందే - చిరునవ్వు నవ్వింది అంతవరకూ ముఖం చాటుచేసుకున్న అతని అదృష్ట దేవత.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోనుంచి బయటికి వచ్చి కానిస్టేబిల్‌కి సైగచేసింది ఒక నర్స్.

"మీరు తీసుకొచ్చిన కుర్రవాడికి తెలివి వచ్చింది.... మిమ్మల్ని మా డాక్టర్స్ పిలుస్తున్నారు..." అంటూ అతన్ని వెంటబెట్టుకుపోయింది.

టాయిలెట్స్‌లోకి ఎంటర్ కాలేదు షాడో. ఎయిర్‌బేగ్‌ని భుజం మీద వేసుకుని, పది అడుగుల దూరంలో వున్న లిఫ్టులోకి జంప్‌చేసి గ్రౌండ్ ఫ్లోర్‌కి తీసుకుపోయే బటన్‌ని ప్రెస్ చేశాడు.

# 2

"\. . . . నా పేరు పియన్నా.... ఇంకో గంటలో నా డ్యూటీ అయిపోతుంది." అందమైన కనురెప్పల్ని అల్లల్లాడిస్తూ అన్నది పెసోటా సిటీ సెంట్రల్ స్క్వేర్ దగ్గిర ఐస్‌క్రీమ్ పార్లర్‌ని ఆపరేట్ చేసే స్పానిష్ సుందరి.

అప్పటికి నాలుగు కప్పుల ఐస్‌క్రీమ్స్‌ని ఆరగించాడు షాడో. ఐదోకప్పుకు ఆర్డర్ ఇవ్వబోతూ విరమించుకున్నాడు ఆ ప్రయత్నాన్ని.

తన అందాల్ని చూసి మైమరిచిపోతున్నాడని అనుకుంటోంది కాబోలు ఆ సుందరాంగి. తన కోసం బీటు వేస్తున్నాడని భావిస్తోంది కాబోలు!

బిల్లు చెల్లించి అప్పటికప్పుడు ఆ ప్రదేశాన్ని వెకెట్ చేయాలనే కోరికను బలవంతంగా అదుముకుంటూ, అంచనా వేసుకున్నాడతను తన పొజిషన్‌ని.

సెంట్రల్ స్క్వేర్ దగ్గిర వెనిల్లా ఐస్‌క్రీమ్స్‌ని సప్లయి చేయటంలో పేరుగడించిన ఆ పార్లర్‌లో కూర్చోమని అతనికి చెప్పారు ఇంటర్ పోల్ అధికారులు.

"ఒక్క అడుగు కూడా అవతలికి వేయకుండా ఐస్‌క్రీమ్‌ని ఆరగిస్తూ వెయిట్ చేయటం మాత్రమే నువ్వు చేయాల్సిన పని... యాన్ ఏజెంట్ ఫ్రమ్ ది స్పానిష్ సీక్రెట్ సొసైటీ విల్ కంటాక్ట్ యూ..." అంతకు

ముందే బుక్ చేసి వుంచిన ఫ్లయిట్ టికెట్‌ని, టూరిస్ట్‌గా నటించేందుకు అవసరమైన కాగితాల్ని చేతిలో పెడుతూ అన్నారు వాళ్ళు.

విమానం దిగిన వెంటనే రాలేకపోయాడు తను అక్కడికి. వెయిట్ చేసి చేసి వెళ్ళిపోవటం జరిగిందా ఆ స్పానిష్ ఏజెంట్?? ది గ్రేట్ సీక్రెట్ ఏజెంట్ మిస్టర్ షాడోకి పంక్చుయాలిటీ అనే మాటకు అర్థం తెలియదని ఇంటర్ పోల్ హెడ్‌క్వార్టర్స్‌కి రిపోర్ట్ చేయటం కూడా పూర్తి అయిపోయివుంటుందా??

"అందమైన ఆడపిల్ల కావాలని నీతో మాటలు కలుపుతుంటే తల ప్రక్కకు తిప్పుకుని ఎటో చూస్తావేమిటి మిస్టర్ షాడో? అదేపనిగా ఐస్‌క్రీమ్స్‌ని ఆరగించడంవల్ల అనీజీగా వున్నదా?" ఉన్నట్లుండి టేబిల్ మీదికి వంగుతూ, లోగొంతుకతో అడిగింది ఐస్‌క్రీమ్స్ సుందరాంగి.

అక్కడినుంచి అవతలికి వెళ్ళిపోవటమే మంచిదనే నిర్ణయానికి వచ్చి, ఎయిర్‌బేగ్‌ని అందుకోబోతూ, ఆమె తనును పేరు పెట్టి పిలిచిన సంగతి అర్థమై అదిరి పడ్డాడు షాడో.

"సూపర్ ఫాస్టుగా ఆలోచిస్తావనీ, పాదరసం కంటె చురుకుగా కదులుతావనీ విని, నీ గురించి ఎన్నెన్నో రకాలుగా ఊహించుకొన్నాను. నీ వంటి మందకొడి మనిషిని ఇంతవరకు నేను చూడలేదు." ఖాళీగా వున్న ఛైర్ నొకదాన్ని టేబిల్ దగ్గిరికి జరిపి, అందులో ఆశీనురాలవుతూ అన్నదా సుందరాంగి.

ఐస్‌క్రీమ్ పార్లర్‌లో కూర్చోమని చెప్పిన ఇంటర్ పోల్ అధికారులను నోటికి వచ్చిన స్పానిష్ పదాలన్నిటినీ కలిపి ఘాటుగా నిందించుకున్నాడు షాడో.

పార్లర్‌ని రన్ చేసే మనిషినే కంటాక్ట్ చేయమని చెపితే ఎంత బాగుండి వుండేది?

అతని ఆలోచనలు ఏమిటో తనకు అవగతమైనట్లు అందంగా నవ్వి, ఐస్‌క్రీమ్స్‌ని సర్వ్ చేయటంలో తనకు హెల్ప్ చేస్తున్న ఒక భారీ పర్సనాలిటీని దగ్గరికి పిలిచిందా సుందరీ మణి.

"దిసీజ్ రాబర్టో... ఈ ఎస్సైన్‌మెంట్‌లో నీకు, నాకు బాడీగార్డుగా పనిచేయటానికి నియమించబడ్డాడు..." తమ ఎస్సైన్‌మెంట్ ఏమిటో షాడోకి తెలియదని తెలిసికూడా, కూల్‌గా పరిచయం చేసింది.

ఆరు అడుగుల మీద మరో నాలుగు అంగుళాల ఎత్తు, యాభై అయిదు అంగుళాల పైన వుండే ఛాతీ - సి.ఐ.బి. సెక్యూరిటీ కాప్టన్ వాసును గుర్తుకు తెచ్చేటట్లున్న ఆ పెద్దమనిషి వంక ఎప్రిసియేటివ్‌గా చూస్తూ చేతిని ముందుకు జాచాడు షాడో. తళతళ మెరుస్తున్న దంతాలన్నీ కనిపించేటట్లు నవ్వుతూ ఆ చేతిని అందుకున్నాడు రాబర్టో.

హైడ్రాలిక్ ప్రెస్‌లో చేతిని పెట్టిన సెన్సేషన్ వెంటనే ఆవరించుకున్నది షాడోని. వెంటనే వెనక్కి లాక్కోకపోతే, ఎముకలు విరిగిపోయి, అవిటి బ్రతుకు బ్రతకాల్సి వస్తుందని కూడా అనిపించింది.

"నీ గురించి, నీ బలాన్ని గురించి మా రాబర్ట్‌కి కూడా కొన్ని కథలు తెలిశాయి. వాటిలో ఎంత వరకూ నిజం వున్నదో తెలుసుకోవాలని కుతూహల పడుతున్నాడు." షాడో నుదుటిమీద ప్రత్యక్షం అయిన స్వేద బిందువుల్ని గమనిస్తూ పరిస్థితిని ఎక్స్‌ప్లెయిన్ చేసింది ఫియన్నా.

తల విదిలించి శరీరంలో వున్న శక్తినంతా కుడి చేతిలోకి రప్పించుకున్నాడు షాడో.

చటుక్కున మాయమైపోయింది రాబర్ట్ ముఖం మీది నవ్వు.

రెండు క్షణాలు ఆగి, మరికాస్త ప్రెజర్‌ని అప్లయి చేశాడు షాడో.

పళ్ళు బిగపట్టేశాడు రాబర్ట్.... ఖాళీగా వున్న ఎడమ చేతిని టేబిల్ అంచుకేసి అదుముతూ, బాధను భరించే ప్రయత్నాలు ప్రారంభించాడు.

"ఈజ్ ఇట్ ఇనఫ్ బ్రదర్?" కామ్‌గా అడిగాడు షాడో మరో రెండు క్షణాల తరువాత.

తల ఊపాడు రాబర్ట్... చేతిని వెనక్కి లాక్కుని గుండెల కేసి అదుముకుంటూ కాష్ కౌంటర్ దగ్గిరికి వెళ్ళిపోయాడు.

"చిన్న పిల్లల మనస్తత్వం మా రాబర్ట్‌ది. స్వచ్ఛమైన మనస్సు" ఆప్యాయత నిండిన కంఠంతో కామెంట్ చేసింది ఫియన్నా.

చిమచిమ లాడిపోతున్న చేతిని టేబిల్ క్రిందికి పోనిచ్చి, తొడకేసి అదుముకుంటూ తల వూపాడు షాడో.

"ఒక అరగంట పాటు మమ్మల్ని ఎవరూ డిస్టర్బ్ చేయకుండా చూడు రాబర్ట్... " ఉన్నట్లుండి సీరియస్‌గా ముఖం పెడుతూ ఆర్డర్ ఇచ్చింది ఫియన్నా.

పార్లర్‌లోకి అడుగు పెట్టబోతున్న రెండు జంటల్ని రోడ్డు మీద వుండగానే అడ్డుకున్నాడు రాబర్ట్. ఆ రోజుకు అమ్మకాల్ని నిలిపివేసినట్లు సూచించే బోర్డు నొకదాన్ని తీసి షాపు ఎదుట పెట్టాడు.

"రెండు సంవత్సరాల క్రితం వరకు మా ఆర్మీలో పనిచేసి, అవినీతి ఆరోపణల మూలకంగా అరస్ట్ అయిన మేజర్ జనరల్ సర్‌గోసా గురించి నీకు ఏమైనా తెలుసా?" అనవసరమైన ఇంట్రడక్షన్స్‌తో

కాలహరణం చేయకుండా సూటిగా సబ్జక్ట్‌లోకి ఎంటర్ అవుతూ అడిగింది ఫియన్నా.

పాంటు జేబులో వున్న సిగరెట్ పాకెట్‌ని బయటికి తీస్తూ స్పెయిన్ దేశపు రాజకీయ పరిస్థితుల గురించి తనకు తెలిసిన విషయాల్ని గుర్తు చేసుకున్నాడు షాడో.

ఫియన్నా చెపుతున్నట్లు అవినీతి ఆరోపణల మూలకంగా అరెస్ట్ కాలేదు ఆ పెద్దమనిషి. స్పెయిన్ దేశపు డిఫెన్స్ లేబరేటరీలో నుంచి ఇంటర్ కాంటినెంటల్ బలాస్టిక్ మిస్సయిల్స్ నమూనాలను అపహరించటానికి ప్రయత్నించి అదుపులోకి తీసుకోబడ్డాడు.

దేశద్రోహం నేరం మోపి అరవై సంవత్సరాల కారాగార శిక్షను విధించాయి స్పానిష్ మిలటరీ కోర్టులు. జైల్లో వున్నంతకాలం అతను ఎవర్ని కలుసుకోకూడదనీ, కనీసం జైలు గార్డులు కూడా అతనితో మాట్లాడకూడదనీ కండిషన్స్ విధించబడ్డాయి.

పెసోటా సిటీ నుంచి స్పెయిన్ దేశపు రాజధానీ నగరమైన మాడ్రిడ్ సిటిలోని సెంట్రల్ జైలుకు తరలించబడుతున్న సమయంలో, తనకు కాపలా కాయటానికి నియమించబడిన సెక్యూరిటీ సిబ్బందినంతా పాయిజన్ గాస్ సహాయంతో పరలోకానికి పంపించి అంతర్ధానమైపోయాడు సర్‌గోసా.

స్పానిష్ మిలటరీలోను పోలీస్ డిపార్ట్‌మెంట్స్‌లోను అతని అనుయాయులు అనేకమంది వున్నారని, వారందరి సహాయ సహకారాలతోనే అతను తప్పించుకోగలిగాడని వెల్లడి అయింది - స్పానిష్ సీక్రెట్ సొసైటీ జరిపిన ఇన్వెస్టిగేషన్స్‌లో.

ఎప్పుడో రెండు సంవత్సరాల క్రితం జరిగిపోయిన ఆ సంఘటన గురించి ఇప్పుడు మాట్లాడుకోవల్సిన అవసరం ఏమొచ్చింది?

కనులు చిట్లించి షాడో ముఖంలోకే చూస్తున్నది ఫియన్నా. అతని ఆలోచనల్ని అర్థం చేసుకున్నట్లు అందంగా నవ్వి, తన దుస్తుల్లో నుంచి కొన్ని కాగితాల్ని బయటికి తీసింది.

"మా మిలటరీలో అత్యున్నతమైన పదవిలో వుండే సర్‌గోసా దేశద్రోహం చేసేందుకు ప్రయత్నించాడని చెప్పుకునేందుకు సిగ్గుపడి, అవినీతి ఆరోపణల మూలకంగా అరస్ట్ అయ్యాడని అంటూ వుంటాము. అసలు విషయం ప్రపంచానికంతటికీ తెలిసిపోయిందని తెలిసికూడా, తెలియనట్లే నటిస్తూ వుంటాము. మా మూర్ఖపు ప్రవర్తనను అసహ్యించుకోకుండా, కొద్దిపాటి సానుభూతిని చూపితే సంతోషిస్తాము." అంటూ టేబిల్‌మీద పెట్టింది ఆ కాగితాల్ని.

ఖరీదయిన ఆ కాగితాల మీద, మెటాలిక్ ఇంక్‌తో అందంగా, అతిస్పష్టంగా వ్రాయబడి వున్న అక్షరాల వంక చూశాడు షాడో.

మొదటి కాగితాన్ని చదవటం పూర్తి అయ్యేసరికి దాహం వేస్తున్నట్లు ఎండుకు పోయింది అతని గొంతు. రెండో కాగితంలోని మెస్సేజిని పూర్తిగా ఫాలో కాకముందే ముఖం మీద ప్రత్యక్షం అయ్యాయి స్వేదబిందువులు.

పది బిలియన్ డాలర్స్ విలువ చేసే బంగారాన్ని తనకు ఇవ్వమని డిమాండ్ చేస్తూ స్పానిష్ గవర్నమెంట్‌కి మేజర్ జనరల్ సర్గోసా వ్రాసిన బ్లాక్‌మెయిలింగ్ లెటర్స్ అవి.

బంగారంతో పాటు మధ్యధరా సముద్రంలో స్పెయిన్ దేశానికి చెందిన టూరిస్ట్ కేంద్రాలు టిమీనా ద్వీపాన్ని, కారెన్సీ ఐలండ్‌ని కూడా తనకి అప్పగించమని హెచ్చరించాడతను.

తన డిమాండ్స్‌ని ఖాతరు చేయకపోతే జరుగబోయేది ఏమిటో చాలా క్లియర్‌గా వ్రాశాడు.

ఆటమిక్ వార్ హెడ్స్ అమర్చిన బలాస్టిక్ మిస్సయిల్స్‌ని ప్రయోగించి, మధ్యధరా సముద్రాన్ని ఆనుకుని వుండే స్పానిష్ తీరప్రాంతాన్నంతా సర్వనాశనం చేసేస్తానని ఖచ్చితమైన హెచ్చరికను అందజేశాడు.

పెదవుల మధ్య వెలుగుతున్న సిగరెట్, అసహ్యకరమైన వాసనలు వెదజల్లుతున్నట్లు అనిపించి, అవతలికి విసిరేశాడు షాడో.

ఎంత దూరంలో వున్న టార్గెట్ నయినా గురితప్పకుండా నాశనం చేయగల బలాస్టిక్ మిస్సయిల్స్ నమూనాలను అపహరించటానికి ప్రయత్నించటం వల్లనే పట్టుబడి పోయాడు సర్గోసా....

నమూనాల రూపాన్ని దాటి పూర్తిస్థాయి శక్తిని సంతరించుకున్న ఆ మిస్సయిల్స్ ఆటమిక్ వార్‌హెడ్స్‌తో సహా అతనికి ఎలా లభించాయి ఇప్పుడు?

మరో ఫ్రెష్ సిగరెట్‌ని బయటికి తీస్తూ తనకేసి చూసిన షాడో ముఖంలోని ప్రశ్నార్థకాన్ని గమనించి గాఢంగా నిట్టూర్చింది ఫియన్నా. దుస్తుల్లో జాగ్రత్త చేసి వుంచిన మరో కాగితాన్ని తీసి అతనికి అందించింది.

డిఫెన్స్ లేబరేటరీల్లో వున్న మిస్సయిల్స్ నమూనాలను అపహరించే ప్రయత్నాన్ని అడ్డుకోగలిగారు కాని, అసలు సర్గోసా ఆ పని ఎందుకు చేయాలని అనుకున్నాడో తెలుసుకోలేక పోయారట స్పానిష్ మిలటరీ అధికారులు.

అతను అరస్ట్ కావటంతో ఆపద తప్పిపోయిందని సంతోషించారట.... అతను తప్పించుకున్న తరువాత కూడా తగిన జాగ్రత్తలు తీసుకోకుండా పరిశోధనల్ని కంటిన్యూ చేయించి పూర్తిస్థాయి మిస్సయిల్స్‌ని తయారు చేయించారట....

ఆఖరి సారిగా పరీక్ష చేసేందుకు ఆటమిక్ వార్ హెడ్స్‌ని అమర్చి మధ్యధరా సముద్రంలో వున్న ఒక మిలటరీ బేస్‌కి వాటిని తరలించారట.

వేగంగా ప్రయాణ చేసే మోటార్‌బోట్స్‌ని ఉపయోగించి, మిస్సయిల్స్‌ని తీసుకుపోతున్న యుద్ధనౌకను అడ్డుకున్నాడట సర్‌గోసా. మిస్సయిల్స్‌ని స్వాధీనం చేసుకుని మాయమై పోయాడట...

ఆ వార్త బయటికి పొక్కితే ప్రజల్లో భయోద్వేగాలు ప్రబలుతాయని అల్లర్లు ఆందోళనలు చెలరేగుతాయని గ్రహించి, పత్రికల నోళ్ళు నొక్కేసిందట ప్రభుత్వం. న్యూస్ ఏజెన్సీలకు కూడా ఖచ్చితమైన వార్నింగ్స్ ఇచ్చి, తమ సీక్రెట్ సొసైటీని రంగంలోకి దించిందిట!

"ఎస్సైన్‌మెంట్ అప్పగించబడిన నాలుగే నాలుగు గంటల్లో ప్రాణాలు కోల్పోయారు మా ఏజెంట్లు నలుగురు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి హాస్పిటల్స్‌లో పోయినారు మరో ముగ్గురు..." బాధ నిండిన కంఠంతో మెల్లిగా వెల్లడించింది ఫియన్నా.

మిలటరీలో, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మాత్రమే కాకుండా, స్పానిష్ సీక్రెట్ సొసైటీలో కూడా మేజర్ జనరల్ సర్‌గోసా అనుచరులు పాతుకుపోయి వున్నారన్న అనుమానం వెంటనే అడుగుపెట్టింది షాడో మనస్సులోకి.

"ప్రపంచ రాజకీయాలతో ఎటువంటి సంబంధమూ పెట్టుకోకుండా, మా దేశ పురోగతిని, మా ప్రజల శ్రేయస్సును మాత్రమే చూసుకుంటూ, పరిపాలన సాగిస్తున్న మా ప్రభుత్వాన్ని అపకీర్తి పాలు చేస్తున్న ఆ సర్గోసాని ప్రాణాలతో వదిలి పెట్టకూడదు. అతని బ్లాక్‌మెయిలింగ్‌ని మట్టుబెట్టి మట్టిలో కలిపేయాలి..." ఆపుకోలేని ఉద్వేగంతో ఏకబిగిన అన్నది ఫియన్నా.

"ఈ విషయంలో మీరు కొనసాగించిన ఇన్వెస్టిగేషన్స్ వివరాలు నాకు కావాలి.... మిలటరీలోను, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోను పనిచేస్తున్న సర్గోసా అనుచరులు ఎవరయినా పట్టుబడి వుంటే వారి వివరాలు కూడా కావాలి...." ఇంకో ఉపన్యాసం ప్రారంభించే అవకాశం ఇవ్వకుండా వెంటనే అడ్డుకున్నాడు షాడో.

చటుక్కున కనుల్ని దించుకుని, చూపుడు వేలితో టేబిల్ మీద గీతలు గీస్తూ వుండిపోయింది ఫియన్నా.

"కమాన్ బేబీ... కమ్ అవుట్ విత్ ఆల్ ది ఫాక్ట్స్... మీ దేశంలో పుట్టి మీ దేశంలో పెరిగి, మీ మధ్యలో మసిలిన ఆ సర్గోసాని మీరే పట్టుకోలేనప్పుడు, పరాయిదేశం నుంచి వచ్చిన ఏజెంట్ మూలకంగా ఆ పని సాధ్యపడుతుందని అనుకోవటం వట్టి తెలివితక్కువతనం అనిపించుకుంటుంది. పరిస్థితులన్నీ పూర్తిగా తెలియకుండా ఫీల్డ్‌లోకి అడుగు పెడితే ప్రాణాలు పోగొట్టుకోవడం తప్ప

మరెటువంటి ప్రయోజనము వుండదనే అనిపిస్తోంది..." దయాదాక్షిణ్యాలు లేని కసాయి పోలీసు ఆఫీసర్ మాదిరి కరుకుగా అడిగాడు షాడో.

రెండు నిముషాలపాటు మౌనంగా వుండి పోయింది ఫియన్నా.

ఆమె చెప్పబోయే సమాధానం ఎలా వుంటుందో అర్థమైంది షాడోకి... అంతకు ముందు ఆరగించిన ఐస్‌క్రీమ్స్ అన్నీ బయటికి వచ్చేసేందుకు సిద్ధంగా వున్నట్లు ఒక విధమైన అనీజీనెస్ అతన్ని ఆవరించుకొన్నది -

"అతి వేగంగా నడిచే మోటార్ బోట్లలో అనేకమంది అనుచరుల్ని వెంటబెట్టుకు వచ్చి మిస్సయిల్స్‌ని అపహరించాడనే మాట తప్ప, అతనికి సంబంధించిన వివరాలు ఒక్కటి కూడా మా దగ్గిర లేవు... పరిశోధనలు ప్రారంభించక ముందే ఎదురు దెబ్బలు తగులుతున్నాయి మాకు..." మెల్లిగా తల ఎత్తి అతని ముఖంలోకి చూస్తూ చెప్పింది ఫియన్నా.

అది తను ఎక్స్‌పెక్ట్ చేసిన సమాధానమే అయినా చెంపమీద ఎవరో చాచి పెట్టి ఒకటి పుచ్చుకున్నట్లు కనులు చిట్లించకుండా వుండలేక పోయాడు షాడో.

ఎటువంటి జటిల సమ్యసనయినా చిటికెలో పరిష్కరించే సామర్థ్యం కలవారిగా పేరు పొందారు స్పానిష్ సీక్రెట్ సొసైటీ ఏజెంట్స్... వారెవరూ చేయలేని పనిని వారి భాషకూడా సర్గిగా రాని తను ఎలా పూర్తి చేయగలడు??

అతని ఆలోచనలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయకుండా, తన మానాన తను మాటల్ని కంటిన్యూ చేసింది ఫియన్నా.

"నువ్వు ఎవరివో, ఇక్కడికి ఎందుకు వచ్చావో, నాకు మా రాబర్ట్‌కి తప్ప మరెవ్వరికీ తెలియదు. మనం ఇన్వెస్టిగేషన్స్ కంటిన్యూ చేసే సమయంలో ఎపుడయినా, ఎక్కడయినా మా పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో గాని, మిలటరీకి చెందిన పర్సనల్‌తో గాని క్లాషెస్ వచ్చే పరిస్థితులు ఎదురయితే, మనంతట మనమే ఆ డిఫికల్టీస్‌లో నుంచి బయటపడాలి. పొరపాటున కూడా మా డిపార్ట్‌మెంట్ సహాయాన్ని ఆశించకూడదు. మనం చేస్తున్న పనులను గురించి సర్‌గోసాకి తెలియకుండా వుండాలంటే ఈ రిస్క్‌ని తీసుకోక తప్పదు."

అమోఘమైన ప్లాను వేసి సర్‌గోసా కనులు కప్పబోతున్నట్లు గొప్పగా చెబుతున్న ఆమె అమాయకత్వాన్ని చూసి గాఢంగా నిట్టూర్చాడు షాడో.

తను ఎయిర్ పోర్ట్‌లో అడుగుపెట్టిన క్షణం నుంచీ అక్కడికి వచ్చేటంత వరకు జరిగిన సంఘటనల గురించి ఆమెకు చెప్పవలసిన

సమయం దగ్గిరికి వచ్చేసిందని అనుకుంటూ, అందుకు రెడీ అవుతుండగా, నాలుగు అంగల్లో టేబిల్ దగ్గిరికి వచ్చాడు ముఖద్వారం దగ్గిర కాపలా నిలబడిన రాబర్ట్. షాడోకి అర్థం కాని సైగలు ఏవో చేశాడు.

ఫియన్నా ముఖంలో వెంటనే ప్రత్యక్షం అయింది విపరీతమైన ఆందోళన.

"సమ్‌థింగ్ ఈజ్ వెరీ రాంగ్ మిస్టర్ షాడో... నీలం రంగులో వున్న ఫాల్కన్ కారొకటి అదేపనిగా రౌండ్స్ కొడుతున్నదట ఈ రోడ్డు మీద..." తడబాటును కప్పి పెట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ లేచిందామె కుర్చీలోనుంచి.

కారణం లేకుండానే సూదులు మాదిరి లేచి నిలబడ్డాయి షాడో మెడమీది వెంట్రుకలు. చలిగాలి వీస్తున్నట్లు జలదరించటం మొదలు పెట్టింది శరీరం.

కంటికి కనిపించని ప్రమాదం ఏదో ముంచుకు వచ్చేస్తున్నట్లు హెచ్చరికలు పంపుతోంది అతని సిక్స్‌త్ సెన్స్... వాటిని నిర్లక్ష్యం చేస్తే జరిగేది ఏమిటో బాగా తెలుసు అతనికి.

"కమాన్ బేబీ... లెటజ్ వెకేట్ దిస్ ప్లేస్"... ఖంగుమంటున్న కంఠంతో కమాండ్ చేస్తూ కుర్చీ ప్రక్కన పెట్టిన ఎయిర్‌బేగ్ కోసం చేతిని జాచాడు.

అప్పటికే అయిపోయింది చాలా ఆలస్యం.

అంతకు ముందు క్షణం వరకూ రోడ్డు మీద చక్కర్లు కొట్టిన నీలం రంగు ఫాల్కన్ ఠక్కున పార్లర్ ముందు ఆగటం, అందులోనుంచి బయటికి తొంగిచూసిన ఆగంతకుడు ఒకతను నలుపురంగులో వున్న బంతిలాంటి వస్తువును పార్లర్‌లోకి విసరటం కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయాయి.

"గెటవుట్... గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్..." ఖంగారు నిండిన కంఠంతో ఫియన్నాని హెచ్చరించాడు షాడో. శిలా విగ్రహంలా నిలబడిపోయిన రాబర్టోని అవతలికి నెట్టి వెనుకభాగంలో వున్న ఒక ఎగ్జిట్ వైపు జంప్ చేశాడు.

పార్లర్ మధ్యలో నేలను తాకింది ఫాల్కన్ ఆగంతకుడు విసిరిన బంతిలాంటి వస్తువు. తాకుతూనే దారుణమైన శబ్దంతో బ్రద్దలైంది.

కంటికి కనిపించని రాక్షస హస్తం ఏదో తన భుజాల్ని పట్టుకుని పైకి లేపినట్లు గాలిలోకి లేచి, పార్లర్ వెనుక భాగంలో వున్న పెద్ద డ్రయినేజ్ కెనాల్ ముందు పడిపోయాడు షాడో.

నేలకు పొడుచుకుని పోటెత్తి పోతున్న కుడి భుజాన్ని ఎడమ చేత్తో అదుముకుంటూ లేచి నిలబడబోతుండగా, ఫుట్‌బాల్

మాదిరి గింగిరాలు తిరుగుతూ వచ్చి అతని తల మీద పడింది ప్రేలుడు అదటుకు పార్లర్ పైభాగంలోనుంచి గాలిలోకి లేచిన ఒక పెద్ద కొండరాయి.

కనుల ముందు రంగురంగుల రామ చిలుకలు ప్రత్యక్షం అవుతుండగా, తిరిగి నేలను కౌగలించుకున్నాడు షాడో.

విల్‌పవర్‌నంతా కూడగట్టుకుని పైకి లేచే ప్రయత్నం చేశాడతను మరోసారి. ఫియన్నా ఏమైందో, రాబర్ట్ ఏమైపోయాడో తెలుసుకోవాలని అనుకున్నాడు.

ఆ పనుల్లో ఒక్కటి కూడా చేయటం చేతకాలేదతనికి.... క్షణాల మీద తప్పిపోయింది తెలివి. తల ప్రక్కకు వ్రేలాడబడిపోయింది.

## 3

మంచుకంటె చల్లగా వున్న నీళ్ళు ముఖం మీద చిలకరించిన సెన్సేషన్ కలిగి చటుక్కున కనులు తెరిచాడు షాడో - రెండు గంటల తర్వాత.

రెండు క్షణాల పాటు తనెక్కడ వున్నాడో అర్థం కాలేదతనికి.

"కొట్టండి ఇంకో బక్కెట్‌తో నీళ్ళు తెచ్చి ముఖం మీద కొట్టండి" తుప్పుపట్టిన ఇనుప గొలుసులు ఒక దానితో ఒకటి రాసుకుంటున్నట్లు ఒక కంఠం వికృతంగా వినబడే సరికి, అటుకేసి తల తిప్పాడు.

రెండు మూరలు మాత్రమే పొడవు కలిగిన ఒక హేండ్ స్టిక్‌ని చేతుల్లో తిప్పుతూ కనిపించాడతనికి ఒక పోలీస్ ఇన్స్పెక్టర్....

తను పోలీస్ స్టేషన్‌లో వున్నట్లు అప్పుడు అర్థమైంది షాడోకి.

అంతలోనే మరో బక్కెట్ చల్లటి నీళ్ళు తీసుకువచ్చి అతని తల మీద కుమ్మరించారు ఇద్దరు కానిస్టేబిల్స్. బేస్‌బాల్ బేట్స్ వంటి లాటీలను పట్టుకొని అతనికి చెరొక ప్రక్క నిలబడ్డారు.

పలుగులతో పొడిచినట్లు పోటెత్తిపోతున్నది షాడో తల. పది పౌండ్ల ఐరన్ హేమర్‌తో బాదినట్లు సలపరం పెడుతున్నది కుడి భుజం.

చల్లటి నీరు తలకు తగిలేసరికి మరింత అధికం అయ్యాయి ఆ బాధలు.

"మీ సిటీని చూడటానికి పరాయి దేశం నుంచి పనికట్టుకు వచ్చిన టూరిస్ట్‌ని నేను. హాస్పిటల్‌కి తీసుకుపోయి ట్రీట్‌మెంట్ ఇప్పించకపోగా, నేరస్థుడిని కూర్చోపెట్టినట్లు ఇలా కుర్చీలో కూర్చోబెట్టి, నా చుట్టూ నిలబడటం ఏమీ బాగోలేదు" వచ్చీరాని వారి భాషలో తన అసంతృప్తిని వెల్లడించాడు.

"నువ్వు టూరిస్ట్‌వి కాదు. టూరిస్ట్ వేషంలో అల్లర్లు సృష్టించటానికి వచ్చిన టెర్రరిస్ట్‌వి..." హేండ్‌స్టిక్‌ని అటూ ఇటూ తిప్పటాన్ని ఆపి చటుక్కున అన్నాడు ఆ ఇన్స్‌పెక్టర్.

విపరీతమైన ఆశ్చర్యంతో మ్రాన్పడి పోతున్నట్లు నోటిని తెరిచాడు షాడో. కనుల్ని పెద్దవి చేశాడు.

"పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడి మమ్మల్ని ఏమార్చలేవు. నీలాంటి వాళ్ళని మేము ఎందరినో చూసివున్నాము. నువ్వు ఆర్డినరీ టూరిస్ట్‌వే అయితే, నీ దగ్గిర ఈ ఆయుధాలు ఎందుకు వున్నాయి?" హేండ్ స్టిక్‌ని ఆ గదిలోనే వున్న ఒక టేబిల్ కేసి చూస్తూ అన్నాడు ఇన్స్‌పెక్టర్.

అటుకేసి తల తిప్పిన షాడోకి అతను భయపడుతున్నట్లుగానే దర్శన మిచ్చాయి అతని బెల్టు వెనుక వుండవలసిన ఆయుధాలు.

ఎరుపు రంగు టొయోటాలో వచ్చిన సుందరీమణి మరోసారి ఎదురు పడితే అటో ఇటో తేల్చేసుకోవటమే మంచిదన్న ఉద్దేశ్యంతో ఎయిర్‌బేగ్‌లో నుంచి తీసి వాటిని బెల్టు వెనుక దాచుకున్నాడతను...

ఎరుపురంగు టొయోటాకి బదులు నీలం రంగు ఫాల్కన్ ప్రత్యక్షం అవుతుందనీ, మిషన్‌గన్‌తో కాల్పులు జరపకుండా, హేండ్ గ్రనేడ్స్ విసురుతారని ఊహించక పోవటం వల్ల వచ్చిన చిక్కు అది...

అనుమతి లేకుండా మారణాయుధాల్ని వెంటబెట్టుకు తిరిగేవాళ్ళని టెర్రరిస్ట్‌లుగానే ట్రీట్ చేస్తారు స్పెయిన్ దేశంలో... స్టేషన్‌లో కూర్చోబెట్టి చెమడలు ఎక్కదీస్తారు.

అతిగా మాట్లాడి వారి ఆగ్రహాన్ని రెట్టింపు చేస్తే ఎంక్వయిరీలను తీవ్రతరం చేసి, అంతకు ముందు ఎయిర్ పోర్ట్ దగ్గిర తను చూపిన హీరోయిజాన్ని గురించి కూడా తెలుసుకుంటారనే భయంతో బిక్కముగం పెట్టి తలను వంచుకున్నాడు షాడో.

"నీ అదృష్టం బాగుండబట్టి, నువ్వు జరిపిన బాంబు దాడిలో ఎవరూ గాయపడలేదు. ఖాళీగా వున్న ఆ ఐస్‌క్రీమ్ పార్లర్ మీద దాడి ఎందుకు జరపాల్సి వచ్చిందో మాకు చెప్పు..." హేండ్‌స్టిక్‌ని అతని తలకు ఆనిస్తూ సడన్‌గా అడిగాడు ఇన్స్‌పెక్టర్.

చాచిపెట్టి చెంపమీద కొట్టిన సెన్సేషన్ వెంటనే ఆవరించుకున్నది షాడోని...

ఐస్‌క్రీమ్ పార్లర్ ఖాళీగా వుండటం ఏమిటి?

ఏమైపోయారు తనతోపాటు పని చేయటానికి నియమించబడ్డ ఏజెంట్స్?? తీవ్రంగా గాయపడటం వల్ల వారికి సంబంధించిన సమాచారాన్ని బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నా రా??

షాడో మనసులోని ఆలోచన లేమిటో అర్థం చేసుకోలేక పళ్ళు పటపటలాడిస్తూ, హేండ్ స్టిక్‌ని ఎడాపెడా విసిరాడు ఇన్స్‌పెక్టర్. బూటు కాలిని పైకెత్తి బలంగా తన్నా డు అతని గుండెలమీద.

కుర్చీతో సహా వెనక్కి పడిపోయాడు షాడో... తల మరోసారి నేలకు పొడుచుకొనే సరికి బాధను భరించటం అసాధ్యమై గావుకేకలు పెట్టాడు.

"నువ్వు అరిచినా, గిలగిలా కొట్టుకున్నా వదిలి పెట్టేది లేదు... మా ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే నీ ఎముకల్ని చూర్ణం చేయటం ఖాయం..." షాడో భుజాలు పట్టుకొని పైకి లేవదీస్తూ ఖచ్చితమైన వార్నింగ్ ఒకటి ఇచ్చాడు ఎడమ చేతి వైపున నిలబడిన కానిస్టేబిల్.

ఇన్స్‌పెక్టర్ చేతిలో వున్న హేండ్‌స్టిక్ మరొక్కసారి వంటిమీద పడితే తట్టుకోవడం అసాధ్యమైపోతుందని గ్రహించి శరవేగంతో ఆలోచించాడు షాడో.

ఫియన్నా ఏమైందో, రాబర్ట్‌కి ఎటువంటి గతి పట్టిందో తెలుసుకోకుండా తనంతట తానుగా ఎటువంటి నిర్ణయము తీసుకోకూడదు. ఆ విషయాలు తెలుసుకోవాలంటే కాస్తంత వ్యవధి కావాలి... అందుకు ఒక్కటే మార్గం వున్నది...

షాడోతో పాటు తల్లక్రిందులైన కుర్చీని కూడా సరిచేశాడు ఆ కానిస్టేబిల్... అతన్ని తిరిగి అందులో కూర్చోబెట్టాడు.

"మర్యాదగా మాట్లాడితే నీ బుర్రకు ఎక్కటం లేదని నాకు అనిపిస్తోంది. మాకు ఆగ్రహం వచ్చిందంటే ఎలా వుంటుందో నీకింకా అర్థం కావటం లేదని కూడా అవగతమౌతోంది." హేండ్‌స్టిక్‌ని వదిలేసి, రెండో కానిస్టేబిల్ దగ్గిర వున్న లాటీకర్రను అందుకుంటూ అన్నాడు ఇన్స్‌పెక్టర్.

బేస్‌బాల్ బేట్‌వంటి ఆయుధం తన తలకు తాకితే ఏమౌతుందో ఊహించుకునే సరికి మరో బక్కెట్ చన్నీళ్ళు కుమ్మరించినట్లు చెమటలతో తడిసి పోయింది షాడో ముఖం.

"చెప్తాను... మీరడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేస్తాను... దయచేసి నన్నేమీ చేయకండి..." భయంతో వణికి పోతున్నట్లు ఫీలింగ్స్ ఇస్తూ కీచుగా అరిచాడు.

తన ముఖంలో ప్రతిఫలిస్తున్న కరుకుతనమే అతన్నలా భయ పెట్టిందని అపోహపడ్డాడు ఆ ఇన్స్‌పెక్టర్.

"త్వరగా చెప్పు. ఆలస్యం చేశావంటే అన్యాయం అయిపోతావ్." అని హెచ్చరించాడు అదో రకమైన గర్వంతో ఉప్పొంగిపోతూ.

ఆలస్యం ఎంత మాత్రము చేయలేదు షాడో. ఐస్‌క్రీమ్ పార్లర్‌లో పడిన గ్రనేడ్ కంటే వెయ్యిరెట్లు గందరగోళాన్ని సృష్టించే మాటను మెల్లిగా బయటపెట్టి కామ్‌గా కూర్చున్నాడు.

"సెంట్రల్ స్క్వేర్ దగ్గిర వుండే ఐస్‌క్రీమ్ పార్లర్‌లో సీక్రెట్ సొసైటీ ఏజెంట్లు కొందరు సమావేశమౌతున్నారని తెలిసి, వారందర్నీ హతమార్చటం కోసం ప్రత్యేకంగా నన్ను పంపించాడు మేజర్ జనరల్ సర్‌గోసా.

లాటీని వదిలేసి శిలా విగ్రహంలా బిగుసుకుపోయాడు ఇన్స్‌పెక్టర్.

అతని ఆజ్ఞలతో నిమిత్తం లేకుండానే రాకెట్ మాదిరి బయటికి పరుగుతీశాడు అక్కడ వున్న కానిస్టేబిల్స్‌లో ఒకతను. పదే పది క్షణాల్లో మరో నలుగురు పోలీస్ అధికారుల్ని వెంటబెట్టుకు వచ్చాడు.

# 4

వేడెక్కిన గాలి బయటికి పోవటానికి ఏర్పాటు చేయబడిన ఒక వెంటిలేటర్ తప్ప, మరే విధమైన ఓపెనింగ్‌లు లేని కాంక్రీట్ గదిలోకి ట్రాన్స్‌ఫర్ చేయబడ్డాడు షాడో.

పోలీసులతోగాని, మిలటరీ పర్సనల్‌తో గాని ఏవైనా క్లాషెస్ వచ్చేటట్లయితే తమంతట తాముగా ఆ చిక్కుల్లోనుంచి బయటపడాలే తప్ప, పొరపాటున కూడా సీక్రెట్ సొసైటీ సహాయాన్ని అర్థించకూడదని షరతును విధించింది ఫియన్నా. అందుకు భంగం వాటిల్లకుండా, ఎవరూ ఊహించని పద్ధతిలో ఆమె డిపార్ట్‌మెంట్‌ని బయటికి రప్పించే మార్గాన్ని ఆలోచించగలిగినందుకు తనను తాను అభినందించుకుంటూ, కాలు మీద కాలు వేసుకుని ఆ గదిలో వున్న బంక్ మీద కూర్చున్నాడు.

సర్‌గోసా గాంగ్‌కి చెందిన మనిషి పోలీసుల చేతికి చిక్కాడన్న వార్త అందిన మరుక్షణం రెక్కలు కట్టుకుని వచ్చేస్తారు వాళ్ళు.... తన ఐడెంటిటీని తెలుసుకొన్న మరుక్షణం తనకు కావాల్సిన ఇన్ఫర్మేషన్‌ని సప్లయిచేస్తారు... అక్కడినుంచి బయట పడేందుకు దారిని కూడా చూపించవచ్చు.

ముసిముసిగా నవ్వుకొంటున్న షాడోని చూసేసరికి అరికాలిమంట నెత్తికి ఎక్కింది కాబోలు, గది తలుపుల్ని తన రైఫిల్

బారెల్‌తో దడదడలాడించాడు అక్కడ కాపలాగా నియమించబడిన కానిస్టేబిల్.

"మా చేతుల్లో తన్నులు తినకుండా తప్పించుకోగలిగానని సంబరపడకు. సీక్రెట్ సొసైటీలో పనిచేసే వాళ్ళంటే రక్తం తాగే రాక్షసులని పెద్దపేరు. నీ ఎముకల్ని విరిచి చూర్ణం చేస్తారు. మెడకు తాడు కట్టి సముద్రంలో ముంచి తేలుస్తారు" కచ్చనిండిన కంఠంతో వివరించాడు.

మరికాస్త చిద్విలాసంగా నవ్వుతూ బంక్ మీది నుంచి లేచి, అతని సమీపంలోకి పోయాడు షాడో. ఒక సిగరెట్ వుంటే ఇవ్వమని రిక్వెస్ట్ చేశాడు.

పళ్ళు పట పటమని కొరుకుతూ రైఫిల్ బారెల్‌తో అతని గుండెల మీద పొడవబోయాడు ఆ కానిస్టేబిల్.

చటుక్కున వెనక్కి గెంతి ఆ పోటునుంచి తప్పించుకున్నాడు షాడో. అతని ఆగ్రహాన్ని మరింత ప్రజ్వరిల్లచేసే విధంగా పెద్దగా నవ్వుతూ బంక్ దగ్గరికి వచ్చేశాడు.

"సీక్రెట్ సొసైటీ వాళ్ళు నీకోసం వచ్చేటంతవరకూ నేను ఇక్కడే వుంటాను. వాళ్ళు కొట్టే దెబ్బలకు నువ్వు క్రింద పడి పొర్లిగింతలు పెడుతుంటే చూసి సంతోషిస్తాను... నీ గావుకేకల్ని విని ఆనందిస్తాను" రైఫిల్ బారెల్‌ని గాలిలో ఊపుతూ అతన్ని హెచ్చరించాడు కానిస్టేబిల్....

అతని దగ్గిర్నించి సమాధానం రాకపోవటంతో గది ప్రక్కనే వున్న కుర్చీవంటి రాతి దిమ్మమీద కూర్చుని సెంట్రీ డ్యూటీని కంటిన్యూ చేయటం మొదలు పెట్టాడు.

క్షణక్షణానికి పెరిగి పెద్దదవుతున్న సిగరెట్ తాగాలనే కోరికను బలవంతంగా అదుముకుంటూ కనులు మూసుకున్నాడు షాడో. తిరిగి కనులు తెరిచేసరికి చీకట్లు ముసురుకుని వున్నాయి గదినిండా. సొట్టలు పడిన సత్తు ప్లేటులో నాలుగు శాండ్ విచెస్, పగిలిపోవటానికి సిద్ధంగా వున్న పింగాణీ కప్పులో కొద్దిపాటి బ్లాక్‌కాఫీని తెచ్చి అతని ఎదుట నిలుచుని వున్నాడు ఇంకో కానిస్టేబిల్.

* * * * *

పదే పదిక్షణాల్లో శాండ్‌విచెస్ అంతు చూసేశాడు షాడో... రెండే రెండు గుక్కల్లో బ్లాక్ కాఫీని ఫినిష్ చేశాడు.

సత్తుప్లేటును, పింగాణీ కప్పును తీసుకుని వెంటనే వెనుతిరగాల్సిన ఆ కానిస్టేబిల్, అటువంటి పని ఏదీ చేయకుండా అలాగే నిలబడి వుండటం ఆశ్చర్యాన్ని కలిగించే సరికి కనులు ఎత్తి అతని ముఖంలోకి చూశాడు.

"నన్ను గుర్తు పట్టలేదా బ్రదర్?" గది బయట వున్న కానిస్టేబిల్‌కి వినిపించకుండా లోగొంతుకతో అడిగాడు ఆ పెద్దమనిషి.

గదినిండా అలుముకుని వున్న చీకటి మూలకంగా అతని ముఖాన్ని సరిగా పోల్చుకోలేకపోయినా, ఆ కంఠాన్ని గుర్తుపట్టి కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరి పడ్డాడు షాడో.

ఎరుపురంగు టొయోటాలోనుంచి దూసుకువచ్చిన బుల్లెట్లు తగిలి తల్లక్రిందులై పోయిన కుర్రాడిని కాపాడటం కోసం తనకంటె ఎక్కువగా తపించి పోయిన ట్రాఫిక్ కానిస్టేబిల్ అతను!

షాడో ముఖంలో ప్రతిఫలించిన భావాల్ని అంత చీకటిలోను అతి తేలికగా గమనించి చిన్నగా నవ్వాడు ఆ కానిస్టేబిల్.

"ముక్కు ముగం తెలియని ఒక చిన్నారి ప్రాణాలను కాపాడటం కోసం ఎంతగానో శ్రమించిన నువ్వు, బాంబులు విసిరి గందరగోళాన్ని సృష్టించే దుర్మార్గుడవని తెలిసినా నమ్మటం లేదు నేను. మా వాళ్ళు పెట్టే చిత్రహింసల్ని తప్పించుకోవటం కోసం మాట మార్చావని అనుకుంటున్నాను." సత్తు ప్లేటులో పింగాణీ కప్పును పెట్టి, వెనుతిరగబోతున్నట్లుగా నటిస్తూ, మృదు స్వరంతో అన్నాడు.

వెంటనే మాయమైపోయింది షాడో ముఖంలో ప్రతిఫలించిన ఆశ్చర్యం. దాని స్థానంలో చోటు చేసుకున్నది తీవ్రమైన ఆందోళన.

ఆ రోజు ఉదయం జరిగిన సంఘటనను గురించి అతను అందరికీ తెలియచేయటం మొదలుపెడితే, మట్టి కొట్టుకుపోతుంది అంతవరకు తను పడిన కష్టం. మళ్ళీ మొదటికి వచ్చేస్తుంది కథ...

"నా మూలకంగా నీకు కష్టాలు ఎదురవుతాయనే భయం నీకు అనవసరం. నువ్వు ఎవరివో, ఎందుకిలా ప్రవర్తిస్తున్నావో తెలుసుకోవాలన్న కోరిక నాకు లేదు. ఇక్కడి పరిస్థితులను గురించి సరైన అవగాహన లేకుండా బురదలో కాలుపెట్టావేమోనన్న అనుమానంతో నిన్ను హెచ్చరించటం కోసం ఎంతో ప్రయత్నం మీద నీకు ఆహారాన్ని తీసుకువచ్చే డ్యూటీ వేయించుకున్నాను." పింగాణీ కప్పును సత్తుప్లేటుకేసి రుద్దు వికృత శబ్దాల్ని సృష్టిస్తూ, లోగొంతుకతో అన్నాడా కానిస్టేబిల్.

"మా స్టేషన్‌లో పని చేస్తున్న ఇన్స్‌పెక్టర్ ఒకతను మేజర్ జనరల్ సర్‌గోసా మనిషి. సర్‌గోసా సానుభూతి పరులు చాలామంది మా డిపార్ట్‌మెంట్‌లో వుండటం వల్ల బయటికి రావటంలేదు ఈ రహస్యం. నువ్వు తమ గాంగ్‌కి చెందిన వాడివి కాదని అతను తెలుసుకోవడం జరిగితే, సీక్రెట్ సొసైటీ వాళ్ళు నీకోసం వచ్చేలోపుగా ఫినిష్ అయిపోతావ్. మా వాళ్ళు పెట్టే చిత్రహింసల్ని తప్పించుకోగలిగానని, సంతోషిస్తూ ఏమరిపాటుగా వున్నావంటే అంతే సంగతులై పోతుంది నీ బ్రతుకు" ఎదురు ప్రశ్నలు వేసే అవకాశం ఇవ్వకుండా గబగబా హెచ్చరించి

గిరుక్కున వెనుతిరిగాడు... రెండే రెండు అంగల్లో గది బయటికి వెళ్ళిపోయాడు.

ఒక్కటంటే ఒక్క సిగరెట్ కాల్చుకుంటే బాగుంటుందన్న కోరిక ఇంకోసారి తల ఎత్తేసరికి, గట్టిగా తల వెదిలించి బంక్‌మీద మేను వాల్చాడు షాడో.

ట్రాఫిక్ కానిస్టేబిల్ చెప్పిన ఇన్స్‌పెక్టర్ తన మీదికి వచ్చిపడకముందే సీక్రెట్ సొసైటీ వాళ్ళు అక్కడికి రావాలని మనసారా కోరుకుంటూ కనులు మూసుకోబోతుండగా, గది తలుపుల ముందు ప్రత్యక్షం అయింది ఒక ఆకారం.

చటుక్కున లేచి స్మార్ట్‌గా శాల్యూట్ చేశాడు అక్కడి కానిస్టేబిల్.

"ఏమంటున్నాడు బంధితుడు? ట్రబుల్ ఏదైనా క్రియేట్ చేస్తున్నాడా??" పోలీస్ ఠీవిని ప్రదర్శిస్తూ హుందాగా అడిగిందా ఆకారం.

అస్పష్టమైన కంఠంతో ఏదో చెప్పాడు ఆ కానిస్టేబుల్. తలుపుల దగ్గిరికి జరిగి ఆ ఆకారంతో పాటు లోపలికి తొంగి చూశాడు.

"వద్దు.... అలా తొంగి చూడవద్దు... వెనక్కి తిరుగు..." గది గోడలు కంపించేటట్లు అరిచి అతన్ని హెచ్చరించాలని అనుకున్నాడు అరమూసిన కనులతో అటుకేసే చూస్తున్న షాడో.

ఆ మాటలు అతని పెదవుల్ని దాటి బయటికి రాకముందే, కంటికి కనిపించనంత వేగంతో గాలిలోకి లేచింది ఆ ఆకారం యొక్క దక్షిణ హస్తం. బరువైన సమ్మెట మాదిరి కానిస్టేబిల్ మెడ మీద పడింది.

కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడి వెనక్కి తిరగబోయాడతను. మరింత స్పీడ్‌గా పైకి లేచింది ఆ ఆకారం యొక్క ఎడమ చేయి... మునుపటికంటె బలంగా అతని ముఖాన్ని తాకింది.

చేతుల్లో వున్న రైఫిల్‌ని వదిలేసి మొదలు నరికిన వృక్షంలా విరుచుకు పడిపోయాడా కానిస్టేబిల్.

చటుక్కున ముందుకు వంగి మధ్యలోనే అతన్ని వడిసి పట్టుకున్నది ఆ ఆకారం. క్రింద పడి శబ్దం చేయబోతున్న రైఫిల్‌ని కూడా తన బూటు కాలితో అడ్డుకుంటూ, కానిస్టేబిల్ బెల్టుకు వ్రేలాడుతున్న తాళం చెవితో గది తలుపుల్ని ఓపెన్ చేసింది.

మడిచి పెట్టిన వాచి స్ప్రింగ్స్ మాదిరి బిగుసుకున్నాయి బంక్ మీద వున్న షాడో కండరాలు...

తనను ఫినిష్ చేసే ప్రయత్నాలు జరగటానికి అవకాశాలు వున్నాయని హెచ్చరించాడేగాని, అంత త్వరగా ఆచరణలోకి వస్తాయని మాత్రం ఊహించలేకపోయాడు ట్రాఫిక్ కానిస్టేబిల్.

ఏం చెయ్యాలి ఇప్పుడు? అరిచి అందర్నీ పోగుచెయ్యాలా?? షాడో ఆలోచనలు పూర్తికాలేదు. చేతుల్లో కానిస్టేబుల్‌ని నెమ్మదిగా క్రిందకి వాల్చి, ఆకలిగొన్న పెద్దపులిలా అతని మీదికి లంఘించింది ఆ ఆకారం.

ట్రాఫిక్ కానిస్టేబిల్ భయపడినట్లు కునికిపాట్లు పడుతూ వున్నట్లయితే అక్కడికక్కడ అప్పటికప్పుడు ఖతమైపోయి వుండేవాడు షాడో.... ఉక్కు ముక్కల వంటి ఆ ఆకారపు హస్తాల్లో చిక్కుబడి గిలగిలలాడుతూ ప్రాణాలు వదిలేసి వుండేవాడు.

ఇప్పుడు మెడను వడిసి పట్టుకోబోయిన ఆ చేతుల్ని బలంగా ప్రక్కకు నెట్టి ఎడమ కాలిని స్పీడ్‌గా విసిరాడు.

బావురుమని అరవాల్సినంత దెబ్బ తగిలింది ఆ ఆకారానికి. అరిస్తే గుట్టు రట్టు అవుతుందన్న భయంతో కాబోలు, ఒక చేత్తో గుండెల్ని, రెండవ చేత్తో నోటిని గట్టిగా అదుముకుంటూ వెనక్కి జంప్ చేసింది.

ఛెంగున బంక్‌మీదినించి లేచి గుడ్డిగా ముందుకు దూకాడు షాడో. తలను వంచి ఆ ఆకారపు పొత్తికడుపు మీద పొడిచాడు.

నోటిని ఎంతగా అదుముకున్నా, బాధను భరించటం అసాధ్యమైనందువల్ల అస్పష్టమైన శబ్దాలు చేసింది ఆ ఆకారం... షాడో పొడిచిన పోటుకు మరింతగా వెనక్కి తూలి ఒక గోడకు గుద్దుకున్నది.

తలను వెంటనే వెనక్కి తీసుకొని మరోపోటు పొడవటానికి సిద్ధం అయ్యాడు షాడో. ఆ ఆకారపు రియాక్షన్‌ని అంచనా వేయటంలో కాస్తంత పొరపాటు పడ్డాడు.

మెరుపు కంటే వేగంగా పైకి లేచి షాడో ముఖానికి కనెక్ట్ అయింది ఆ ఆకారపు కుడిమోకాలు.

ముక్కు ముఖానికి అతుక్కుపోయిన సెన్సేషన్ వెంటనే కలిగింది షాడోకి. కనుల ముందు రంగు రంగుల సీతాకోక చిలుకలు ప్రత్యక్షం అవుతుండగా వెనక్కి జంప్ చేయబోయాడు.

తన బాధలనన్నిటినీ పళ్ళబిగువున భరిస్తూ అతనితోపాటు కదిలింది ఆ ఆకారం. అతని జుట్టు పట్టుకుని బలంగా ముందుకు లాగింది. కాలుకు కాలు అడ్డం పెట్టి క్రిందికి నెట్టింది. గొంతు మీద బూటు కాలిని వేసి శక్తినంతా ఉపయోగించి అదిమింది.

ఊపిరి తీసుకోవటం అసాధ్యమయ్యేసరికి గిలగిలలాడి పోయాడు షాడో. పిడికిళ్ళతో ఆ ఆకారపు మోకాళ్లమీద పొడవటానికి ప్రయత్నించాడు గాని ఉపయోగం లేకుండా పోయింది.

"మేజర్ జనరల్ సర్గోసా పేరు చెప్పుకుని పోలీసుల బారినుంచి బయట పడదామని అనుకున్నావా? నీ వంటి డండర్ హెడ్స్‌ని గమనించుకోవటం కోసమే నేను ఈ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాను. నీ కోసం సీక్రెట్ ఏజెన్సీ వాళ్ళు వచ్చేసరికి ప్రాణం లేని నీ శరీరం ఇక్కడ ప్రత్యక్షం అవుతుంది." ఎగసుకు వస్తున్న ఆయాసాన్ని అణుచుకోవటానికి ప్రయత్నమైనా చేయకుండా కరుకు కంఠంతో ఎనౌన్స్ చేసింది ఆ ఆకారం. షాడో కంఠం కింది ప్రెషర్‌ని మరింత అధికం చేసింది.

కంటికి కనిపించని హస్తం ఏదో పదునైన కత్తిని తీసుకుని ఊపిరితిత్తుల్ని ఛిన్నాభిన్నం చేస్తున్న అనుభూతి షాడోని ఆవరించుకున్నది. కలగాపులగం అవసాగాయి అతని ఆలోచనలు. కనుల ముందు ఎరుపు రంగు పరదాలు ప్రత్యక్షం కాసాగాయి.

ఏదో ఒకటి చేసి వెంటనే ఆ ఆకారపు కాలు క్రిందినించి బయట పడకపోతే తన ఛాప్టర్ క్లోజ్ అయిపోవటం తప్పని సరి అని అర్థమయ్యేసరికి, చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం...

బయట పడాలి... కాంక్రీట్ స్తంభం వంటి ఆ బూటుకాలి క్రింది నుంచి వెంటనే బయటపడాలి.

పళ్ళు బిగించి శరీరంలోని శక్తినంతా కుడి చేతిలోకి రప్పించుకున్నాడు. క్రింద వున్న గచ్చుకేసి రెండు సార్లు తాటించి, బలంగా కొట్టాడు ఆ ఆకారపు ఎడమ మోకాలి వెనుక భాగం మీద.

కాలి క్రింద వున్న శత్రువు పని ఆఖరి క్షణాల్లోకి వచ్చేసిందని అనుకుంటూ, లాస్ట్ అండ్ ఫైనల్‌గా మరింత ఒత్తిడి కలిగించటం కోసం ఎడమకాలి మీద తన బరువును బాలెన్స్ చేసుకుంటున్నది ఆ ఆకారం.

అనుకోని విధంగా మోకాలి వెనుక భాగంలో దెబ్బ పడేసరికి, చటుక్కున మడత బడిపోయింది కాలు. బాలెన్స్ నిలుపుకోవటం చేతకాక వెనక్కి దొర్లింది.

గాలికోసం ముఖం వాచిన వాడిలా నోటిని తెరిచి గుండెల నిండా గాలిని పీల్చుకుంటూ పైకి లేచాడు షాడో.

ఆలస్యం చేస్తే కొంపలు అంటుకుంటాయని అతనికి తెలుసు... అదే ఊపులో ముందుకు దూకి, వెనక్కి పడిన ఆ ఆకారపు షర్టును రెండు చేతులతో బిగించి పట్టుకున్నాడు. కుడికాలిని వెన్నుక్రిందికి పోనిచ్చి బలంగా పైకి లేపాడు... తన ఎడమ చేతిని నడుముకేసి బలంగా నొక్కుతూ ప్రయోగించాడు జూడోలో అత్యంత ప్రమాదకరమైన ఒక టెక్నిక్‌ని.

రెజిస్ట్ చేయటానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నించింది ఆ ఆకారం. చేతుల్ని జాచి అతని మెడను గట్టిగా వాటేసుకోవటానికి ట్రై చేసింది.

కుడిమోకాలిని స్లయిట్‌గా మడిచి నేలకు వంగాడు షాడో... ఆ ప్రయత్నాలు ఫలించకుండా అడ్డుకున్నాడు.

తల్లక్రిందులుగా గాలిలోకి లేచి అతని తల మీదినుంచి దూసుకుపోయింది ఆ ఆకారం. నాలుగు అడుగుల దూరంలో వున్న గోడకు గుద్దుకొని దబ్‌మని శబ్దం వస్తుండగా క్రింద పడింది.

ఆక్సీజన్ కొరత మూలకంగా ఆరుమంటలు పెడుతున్న గుండెల్ని అదుముకోవాలని, పది క్షణాల పాటు విశ్రాంతి తీసుకోవాలని కోరికలు కోరటం ప్రారంభించిన అంతరంగపు నోటిని బలవంతంగా అదిమేస్తూ, మరోసారి జంప్ చేశాడు షాడో ఆ ఆకారం దగ్గిరికి.

వంటిమీద చేతులు వేయకముందే వచ్చింది అనుమానం అతనికి. గుండెల మీద చెవి ఆనించి వినేసరికి యదార్థం అయింది ఆ విషయం.

గోడను గుద్దుకోవడంతో ఆ అదటును తట్టుకోవడం అసాధ్యం అయింది కాబోలు సడన్‌గా పనిచేయడం మానుకున్నది ఆ ఆకారపు గుండె... నేలను తాకుతూ వుండగానే అనంతవిశ్వంలో కలిసిపోయాయి అతని ప్రాణవాయువులు.

ముఖం మీదినించి జారి కనులలో పడబోతున్న స్వేద బిందువుల్ని షర్టు భుజానికి అద్దుకుంటూ గది ఎంట్రన్స్ దగ్గిర పడివున్న కానిస్టేబిల్ దగ్గిరికి పోయాడు షాడో.

స్పృహ వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి అతనిలో... ఏ క్షణంలోనైనా లేచి కూర్చోగలడు... గొంతు చినిగిపోయేలా అరిచి అందర్నీ ఎలర్ట్ చేసేయగలడు.

అతని జేబుల్లో చేతులు పెట్టి, సీల్ తీయని సిగరెట్ పాకెట్‌ని స్వాధీన పరుచుకున్నాడు షాడో... అతని దగ్గిర వున్న లైటర్‌తోనే సిగరెట్‌ని వెలిగించుకుని, అక్కడే మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

గాలి సర్గిగా రాని ఆ గదిలో సుడులు తిరుగుతున్న సిగరెట్ పొగ మాదిరిగానే పరిభ్రమించటం మొదలుపెట్టాయి అతని ఆలోచనలు.

తమ మనిషిని ఖతమ్ చేసినందుకు కక్ష కడతారు ఆ స్టేషన్‌లో వున్న పోలీస్ అధికారులు. చనిపోయిన మనిషి మేజర్ జనరల్ సర్‌గోసా గాంగ్‌కి చెందిన వాడని ప్రూఫ్ చేయటం తనకు చేతకాదు... అసలు ప్రూఫ్ చేసే అవకాశం కూడా తనకు లభించనీయరు... సీక్రెట్ సొసైటీ అధికారులు అక్కడికి వచ్చేలోగా తనను స్టేషన్‌లోనుంచి మాయం చేసి, ఏ రైల్వేట్రాక్ మీదో పడవేస్తే??

ఆ పరిస్థితి ఎదురయ్యే వరకు అక్కడ వెయిట్ చేయటం దేనికి? అయాచితంగా లభించిన అవకాశాన్ని ఉపయోగించుకుని జండాపై కపిరాజు పద్యాన్ని పఠించటం వల్ల వచ్చే నష్టం ఏముంది??

రెండే రెండు పీల్పుల్లో సిగరెట్‌ని ఫినిష్ చేసి, మరో ఫ్రష్ సిగరెట్‌ని వెలిగించుకున్నాడు షాడో. అడ్డదిడ్డంగా పడివున్న ఆకారం దగ్గిరికి పోయి షర్టును ఊడదీశాడుల. కుస్తీపట్లు పట్టినప్పుడు జారిపోయిన అతని కేప్‌ని కూడా వెతికి తీసుకున్నాడు.

సిగరెట్‌ని పెదవుల చివర చేర్చి, పాంటు జేబులో చేతులు పెట్టుకొని పోలీసు ఠీవి ప్రస్ఫుటమయ్యేలా అడుగులు వేస్తూ గదిలోనుంచి బయటికి వచ్చాడు.

పాతిక గజాల దూరం కూడా పోకముందే కనిపించింది స్టేషన్ వెనుక భాగంలో వున్న ఒక గార్డెన్‌లోకి తీసుకుపోయే మార్గం. బరువైన రైఫిల్‌ని పట్టుకొని రాతి బొమ్మలా నిలబడిన ఒక కానిస్టేబిల్ కూడా అగుపించాడు.

"ఎలర్ట్‌గా వుండాలి బ్రదర్... కునికి పాట్లు పడకూడదు" తన స్పానిష్ భాషా ప్రావీణ్యమంతా ప్రదర్శిస్తూ హెచ్చరించాడు అతన్ని.

నిజంగానే కునికి పాట్లు పడుతున్నాడు కాబోలు, అదిరిపడి అటెంక్షన్‌లోకి వచ్చాడు ఆ కానిస్టేబిల్. తప్పు చేస్తుండగా దొరికిపోవటం వల్ల, తల దించుకుని నేల చూపులు చూస్తూ నిలుచున్నాడు.

నిజమైన ఇన్స్‌పెక్టర్స్ ఆ సమయాల్లో ఎలా ప్రవర్తిస్తారో, అంతకంటె నాలుగు రెట్లు అధికమైన ఠీవిని ప్రదర్శిస్తూ ముందుకుపోయాడు షాడో. డ్యూటీ సమయంలో అశ్రద్ధను ప్రదర్శించే వారిని ఎన్ని రకాలుగా ఉరితీయవచ్చో ఆ కానిస్టేబిల్‌కి వినబడేలా వర్ణిస్తూ పది అంగల్లో పెద్ద టిట్రస్ పొదను చేరుకున్నాడు.

అక్కడి నుంచి అతి వేగంగా పరుగుతీయటం కోసం రెడీ అవబోతుండగా అతని నాశికారంధ్రాలకు సోకింది అందమైన సెంటువాసన.

అంతకు ముందు ఎప్పుడో ఆ స్మెల్‌ని ఆస్వాదించటం జరిగిందని అనుకుంటూ, గిరుక్కున పక్కకు తిరిగాడతను. పాదాల దగ్గిర అగుపించిన ఒక పలుగురాయిని అందుకుని ఆ వాసన వస్తున్న దిశలోకి విసరాలని ఆలోచిస్తుండగా, టిట్రస్ పొదకు మరో నాలుగు అడుగుల దూరంలో వున్న ఇంకో పొదచాటునుంచి ఇవతలికి వచ్చింది ఒక అందాల సుందరి.

తను కలకంటున్నాడేమో అనుకున్నాడు షాడో... లాకప్ గదిలో పడిన బాధల వల్ల మతి మందగించి అటువంటి భ్రమలు కలుగుతున్నాయేమోనని కూడా భావించాడు.

"పని పూర్తి అయిపోయిందా?" మరో రెండు అడుగులు ముందుకు వేసి అతని ముఖంలోకి చూస్తూ అడిగిందా సుందరాంగి...

తల మీద స్టయిల్‌గా పెట్టుకున్న కాప్‌ని తీసి, ముఖం మీదికి వాలుతున్న వెంట్రుకల్ని వెనక్కి నెట్టుకున్నాడు షాడో.

ఆకాశంలోని నక్షత్రాల వెలుగులో అతని అవతారాన్ని క్లియర్‌గా గమనించి, ముఖం మీద ఎవరో లాగిపెట్టి కొట్టినట్లు, అదిరిపడిందా వన్నెలాడి.

"నువ్వు... నువ్వు ఇన్స్‌పెక్టర్ లాజరస్‌వి కావు..." ఆందోళన నిండిన కంఠంతో అంటూ ఎగిరి దూకింది వెనక్కి.

తనను ఖతమ్ చేయటానికి వచ్చిన ఆకారపు పేరును అతి జాగ్రత్తగా మనసులో భద్రపరుచుకుంటూ ఆమెతో పాటు తనుకూడా కదిలాడు షాడో.

"ఎయిర్‌పోర్ట్ దగ్గిర కంపెనీ ఇస్తానని చెప్పి కనిపించకుండా మాయమై పోయావ్... ఇప్పుడు నిన్ను వదిలి పెడతానని భ్రమపడకు డియర్..." అంటూ చేతులు జాచి ఆమె స్కర్ట్‌ని పట్టుకోవటానికి ప్రయత్నించాడు.

అందినట్లే అంది, అంతలోనే జారిపోయిందా పడుచు... విపరీతమైన భయం ఆమె పాదాలకు ఎనలేని శక్తిని ప్రసాదించినట్లు, వేగంగా పరిగెత్తి, గార్డెన్ చివరి భాగంలో వున్న ప్రహరీని అధిగమించింది.

ఆరు నూరయినా సరే ఆమెను వదిలిపెట్టకూడదని నిర్ణయించుకుంటూ తను కూడా ప్రహరీ గోడ మీదికి జంప్ చేశాడు షాడో.

చెత్త చెదారాలతో నిండి వుంది ఆవలి ప్రక్కన వున్న చిన్న సందు. భరించరాని దుర్వాసనతో దద్దరిల్లిపోతోంది అక్కడి వాతావరణం.

క్షణ క్షణానికి దూరమైపోతున్న ఆ ముద్దుగుమ్మ మీదినించి దృష్టిని మరలించకుండా ఎగిరి అవతలివైపుకు దూకాడు.

అతదారుణంగా తప్పిపోయింది అతని అంచనా... తన బరువును తట్టుకోగల ఉపరితలం మీద పడవలసిన పాదాలు కాస్తా, ఏదో హోటల్ నుంచి అంతకు ముందే తీసుకువచ్చి పడవేసిన వ్యర్థ పదార్థాల మీద పడ్డాయి.

జారుడు బల్లమీదినించి జారినట్లు నాలుగు అడుగుల దూరం వెళ్ళి పోయాడు. చెత్తలో కూరుకుపోయివున్న ఒక చెత్తకుండీకి గుద్దుకొనే సరికి మరోసారి కనులముందు ప్రత్యక్షం అయ్యాయి రంగురంగుల నక్షత్రాలు.

తగిలిన దెబ్బను గురించి తలుచుకుంటూ అలాగే కూర్చుంటే, కంటి ముందున్న ఆ సుందరి మంత్రం వేసినట్లు మాయం అయిపోతుందన్న భయంతో హడావుడిగా పైకి లేచాడు. అన్‌స్టడీగా

అడుగులు వేస్తూ పాతిక గజాల దూరం పరిగెత్తే సరికి, ఆ సందును వదిలి మరో చీకటి వీధిలోకి మరలుతూ అగుపించింది టొయోటా సుందరి.

'మేజర్ జనరల్ సర్గోసా గురించి పరిశోధనలు చేస్తున్న సీక్రెట్ సొసైటీకి ఇంతవరకూ లభించని ఆధారం అదృష్టవశాత్తూ నీకు లభించింది. దెబ్బలు తగిలి వేగం మందగించిందన్న సాకుతో వదిలి పెట్టేస్తావా ఈ అవకాశాన్ని?' అడ్డు వచ్చిన చెత్త కుప్పల్ని తప్పించుకోవటానికి ఆచితూచి అడుగులు వేస్తున్న షాడోని అడిగింది అంతవరకూ మౌనంగా వున్న అంతరాత్మ.

టొయోటా సుందరిని వదిలిపెట్టే ఆలోచన తనకు లేదని సమాధానం ఇచ్చుకోలేదు షాడో. అసలు ఆ మాటలు తనకు వినబడనట్లు నటిస్తూ కాస్తంత వేగం పెంచాడు.

చీకటి వీధిని దాటిన తరువాత పెద్ద పెద్ద నియాన్ లైట్లతో పట్టపగలుగా మారివున్న ఒక మెయిన్ రోడ్డును క్రాస్ చేసింది ఆ వన్నెలాడి.... వంటికి అంటుకున్న చెత్తను చెదారాన్ని వదిలించుకోవటానికి విఫల పయత్నాలు చేస్తూ షాడో అక్కడికి చేరుకునే సమయానికి అదృశ్యం అవనే అయింది.

లాకప్ గదిలోనుంచి తను మాయమైపోయిన సంగతి తెలిస్తే స్టేషన్లో వున్న పోలీస్ బృందాలన్నీ మెయిన్ రోడ్ల మీదికి వచ్చే ప్రమాదం

వున్నదని తెలుస్తూనే వున్నా వెనుకంజ వేయలేదు షాడో. వెతుకులాటను విరమించుకోలేదు.

"ఎవరు కావాలి బ్రదర్? ఎవరి కోసం గాలిస్తున్నావ్?" బ్రైట్‌గా వెలుగుతున్న ఒక స్ట్రీట్ లైట్ క్రింద కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్న కొంతమంది వ్యక్తుల్లో ఒకతను అడిగాడు అతని అవస్థను గమనించి.

సమాధానం ఇవ్వటంలో ఏమాత్రం ఆలస్యం అయినా, కలిసికట్టుగా పైకిలేచి తన దారికి అడ్డు వచ్చేస్తారని అర్థమై ఇబ్బందికరంగా ముఖం పెట్టాడు షాడో.

"నీ మనసులోని మాటను మాతో చెప్పుకోవటానికి ముఖమాట పడాల్సిన అవసరం లేదు బ్రదర్" అతని తటపటాయింపును గమనించి ప్రాంప్ట్ చేశాడు గుంపులో వున్న మరోవ్యక్తి.

"వద్దు వద్దన్న కొద్దీ గుర్రప్పందాలకు వెళ్ళానని అలిగింది నా భార్య. రైలు కింద పడి ప్రాణాలు తీసుకుంటానని బెదిరించి ఇటుగా పరిగెత్తుకు వచ్చింది. అర్జంటుగా వెతికి పట్టుకోకపోతే అన్నంతపనీ చేస్తుందేమోనని భయంగా వుంది" టొయోటా సుందరి ఆకారాన్ని వర్ణిస్తూ తన గోడును వెళ్లబోసుకున్నాడు షాడో.

తనకు వచ్చిన కష్టాన్ని విని జాలి చూపులు చూస్తారని, అపారమైన సానుభూతిని కురిపిస్తారనీ అనుకున్నాడు.

అతిదారుణంగా తప్పిపోయింది అతని అంచనా.

ఫక్కున నవ్వి భుజం విరిగిపోయేటట్లు ఒక దెబ్బ వేశాడు అతన్ని ప్రాంప్ట్ చేసిన వ్యక్తి.

"రైలు క్రింద పడి ప్రాణాలు తీసుకోవటానికి రైలు పట్టాలు వుండే ఏరియా కాదు ఇది. ఎగసిపడే అలలతో అతి భయంకరంగా కనిపించే సముద్రతీరం. నీ భార్య నిన్ను ఏడిపించి వీధుల వెంట పరుగులు తీయించటానికి ఇటుగా వచ్చినట్లు అనిపిస్తోంది" అంటూ ఆ వీధి చివరికి చేయి చూపించాడు.

అప్పుడు - భుజం విరిగిపోయినంత బాధ మెదడును ఆవరించుకున్నప్పుడు తెలిసివచ్చింది షాడోకి - తెరలు తెరలుగా వీస్తున్న గాలిలోని సముద్రపు వాసన. ఆ విషయాన్ని ముందుగానే గమనించలేక పోయినందుకు తనను తనే నిందించుకుంటూ, వారందరికీ కృతజ్ఞతలు తెలియచేసుకుని ముందుకు కదిలాడు. పది నిముషాల తరువాత సముద్ర తీరాన్ని చేరుకుని చుట్టూ చూశాడు.

పిల్లా పాపల్ని వెంట పెట్టుకుని చల్లగాలిని ఆస్వాదించటం కోసం అందరూ వచ్చే బీచ్ వంటి ప్రదేశం కాదది.

చేపలు పట్టటానికి ఉపయోగించే మరపడవలతోను, చిన్న చిన్న ప్రయాణాలు చేసేందుకు ఉపయోగపడే ప్రయివేట్ క్రూయిజర్స్‌తోను కిటకిటలాడిపోతున్న హార్బర్ వంటి రేవు.

మెయిన్ రోడ్డును వదిలి పెట్టిన తరువాత టొయోటా సుందరి అక్కడికే వచ్చి వుంటుందన్న నిర్ణయం క్షణక్షణానికి బలపడి పోతుండగా, లాకప్‌గదిలో కానిస్టేబిల్ దగ్గిర్నుంచి ఎప్రాప్రియేట్ చేసిన సిగరెట్ పాకెట్‌లోనుంచి సిగరెట్‌ని తీసి వెలిగించుకుంటూ మరి కాస్త ముందుకు పోయాడు షాడో.

ఎగసి పడుతున్న అలల మూలకంగా అటూ ఇటూ కదులుతున్న మరపడవల మీదినించి జంప్ చేస్తూ, దూరంలో వున్న ప్రయివేట్ క్రూయిజర్స్‌ని సమీపిస్తుండగా, తన కరుణారసకటాక్ష వీక్షణాల్ని మరోసారి అతని మీదికి ప్రసరింపచేసింది అతని అదృష్ట దేవత.

గాలివలన గుప్పుమంటూ అతని నాశికారంధ్రాలకు సోకింది టొయోటా సుందరి ఉపయోగిస్తున్న పెర్‌ఫ్యూమ్ వాసన.

చేతిలోని సిగరెట్‌ని చటుక్కున నీటిలోకి వదిలి సూటిగా పోయాడు షాడో అటుకేసి. నాలుగు నిముషాల తరువాత లంగరు తాళ్ళను పట్టుకొని ఒక మీడియమ్ సైజు క్రూయిజర్ మీదికి ఎగబ్రాకాడు.

క్రూయిజర్ మధ్యభాగంలో నిర్మించబడిన కాబిన్ వంటి కట్టడం ముందు అతనికి కనిపించింది టొయోటా సుందరి. సిగరెట్ నొకదాన్ని వెలిగించుకుని మగవాళ్ళ మాదిరి గుప్పుగుప్పున పొగను వదులుతోంది.

కొరడా పట్టుకున్న వారెవరో తమ వెనుక నిలబడి ఖంగు ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞలు ఇస్తున్నట్లు వేగంగా పనులు చేస్తున్నారు క్రూయిజర్ మీద వున్న కళాసీలు.

అక్కడికి వచ్చిన మరుక్షణం క్రూయిజర్‌ని కదిలించమని టొయోటా సుందరి ఆజ్ఞలు జారీ చేసి వుంటుందని గ్రహించటానికి ఎంతో సమయం అవసరం లేకపోయింది షాడోకి.

అతను చూస్తుండగానే లంగరును పైకి లాగే మెషీన్‌ని ఆన్ చేశారు ఇద్దరు కళాసీలు.

ఆలస్యం చేస్తే తన ఉనికి బట్టబయలైపోతుందని గ్రహించి ఎంత వేగంగా పైకి పాకాడో, అంతే వేగంతో క్రిందికి వచ్చేశాడు షాడో.

టొయోటా సుందరి ఎక్కడికి పోతున్నదో తెలుసుకోవాలంటే క్రూయిజర్‌ని అనుసరించటం తప్ప మరో మార్గం లేదని అర్థమై చుట్టూ చూశాడు డిస్పరేట్‌గా.

రేవుకు దూరంగా లంగరు వేయవలసిన అవసరం ఎదురైనప్పుడు, వడ్డును చేరుకోవటం కోసం, డింగీ వంటి చిన్న పడవ ఒకటి ఎటాచ్ చేయబడి వున్నది క్రూయిజర్ వెనుక భాగంలో.

దుస్తులు తడిస్తే సముద్రం మీదినుంచి వచ్చే చలిగాలిని తట్టుకోవడం అసాధ్యమైపోతుందని తెలిసికూడా, నిశబ్దంగా నీటిలోకి జారాడు షాడో. బలంగా బారలు వేస్తూ, డింగీని సమీపించి లోపలికి దొర్లాడు.

అదేసమయంలో గంభీరమైన శబ్దాలు చేస్తూ కదిలింది క్రూయిజర్. ఒక దాని వెనుక ఒకటిగా వస్తున్న అలల మీద ఉయ్యాలలు ఊగుతూ సముద్రంలోకి బయలుదేరింది.

తడిసి పోయిన దుస్తుల్ని పిండుకోవటానికి ప్రయత్నిస్తే క్రూయిజర్ మీది కళాసీలు తనను గమనించే ప్రమాదం వున్నదని ఆ పని చేయలేదు షాడో. డింగీలో ఒక ప్రక్కగా పడవేసి వున్న కొన్ని అట్టపెట్టెల్ని గమనించి వాటి మధ్యకు చేరుకున్నాడు.

గాజు వస్తువుల వంటి సున్నితమైన సరుకును ట్రాన్స్‌పోర్ట్ చేయటానికి ఉపయోగించే పెట్టెలు కాబోలు అవి - ఎండుగడ్డి వంటి కాగితపు తుక్కుతో నిండివున్నాయి.

రివ్వు రివ్వుమంటూ బయలుదేరిన సముద్రపు గాలినించి షాడోని సేవ్ చేసిందా తుక్కు - చలితో బిగుసుకుపోకుండా వెచ్చదనాన్ని ప్రసాదించింది.

అర్ధరాత్రి దాటిన మరో అరగంట వరకూ మెలుకువగా వుండగలిగాడు షాడో. కాగితపు తుక్కు కలుగచేస్తున్న వెచ్చదనానికి, డింగీ ఊపుళ్ళు తోడయ్యేసరికి తనకు తెలియకుండానే జారిపోయాడు నిద్రలోకి.

తిరిగి కనులు తెరిచే సరికి రెండు బారల ఎత్తున అగుపించాడు సూర్యుడు. బండరాళ్ళతో నిండివున్న ఒక తీరానికి రెండు ఫర్లాంగుల దూరంలో స్థిరంగా నిలుచుని వున్నది క్రూయిజర్. కిరకిరమని శబ్దాలు చేస్తూ నీటిలోకి దిగుతోంది లంగరు.

"సిద్ధం చేయండి, డింగీని సిద్ధం చేయండి... కమాన్... క్విక్..."

రాత్రంతా నిద్రలేక పోవటం వల్ల కాబోలు ఎర్రగా తయారయిన కనుల్ని అరచేతులతో అద్దుకుంటూ బిగ్గిరిగా ఆర్డర్స్ పాస్ చేస్తోంది టొయోటా సుందరి.

# 5

తనకు మెలకువరావటంలో మరొక్క నిముషం ఆలస్యం అయివుంటే ఏం జరిగివుండేదో తలుచుకునే సరికి చలిగాలి వీచినట్లు ఝల్లుమన్నది షాడో శరీరం.

"ఇప్పటి కయినా మించి పోయింది ఏముంది మిస్టర్ షాడో? నోరు తెరుచుకుని అలాగే చూస్తూ కూర్చో... కాళ్ళు చేతులు విరగదీసి షార్క్ చేపలకు ఆహారంగా వేస్తారు ఆ కళాసీలు..." ఉన్నట్లుండి తన అంతరాత్మ మెత్తగా ఎత్తి పొడవటంతో అదిరిపడి అట్టపెట్టెల చాటునుంచి లేచాడతను. కన్నుమూసి కన్నుతెరిచేటంతలో నీటిలోకి దొర్లి ఆరడుగుల లోతుకు వెళ్ళిపోయాడు.

పది నిముషాల తరువాత ఒక తాటినిచ్చెన సాయంతో డింగీలోకి దిగింది టొయోటా సుందరి.

క్రూయిజర్‌లో నుంచి తీసుకు వచ్చిన పొడుగాటి చెక్కముక్కల్ని తెడ్లమాదిరిగా ఉపయోగిస్తూ డింగీని వడ్డుకేసి నడిపించారు నలుగురు కళాసీలు.

వడ్డు ఇంకో పాతిక అడుగుల దూరం వున్నదనగా మోకాలిలోతున్న నీటిలోకి దూకేసింది టొయోటా సుందరి. పరుగులాంటి నడకతో వడ్డుమీది బండల్ని దాటి, పెద్ద చెట్లతోపులోకి పోయింది.

ఒంటె చర్మాలతో, తెలుపురంగు కాన్వాస్‌తో తయారుచేసిన గుడారాల వంటి గుడిశెలు పాతిక దాకా వున్నాయి. ఆ ప్రదేశంలో... ఆడామగా చిన్నపెద్దా అందరూ కలిపి ఒక అరవైమంది దాకా జనాలు కూడా వున్నారు.

టొయోటా సుందరిని చూడగానే గబగబా ఎదురు వచ్చాడు వారందరికీ నాయకుడి మాదిరిగా అగుపిస్తున్న వృద్ధుడు ఒకతను.

"అర్జంటుగా బయలుదేరాలి నేను... ఆలస్యం చేయటానికి ఎంత మాత్రము వీలు లేదు..." దుస్తుల్లోనుంచి సిగరెట్ బాక్స్‌ని తీసి సిగరెట్ వెలిగించుకుంటూ అతనితో అన్నది టొయోటా సుందరి.

తమ గుడారాల వెనుక భాగంలోకి పరుగు తీశాడు ఆ వృద్ధుడు. కాళ్ళు దిగబడిపోయే ఇసుకలో సైతం వేగంగా ప్రయాణం చేయగల జీప్ నొకదాన్ని తీసుకువచ్చి ఆమె ముందు నిలబెట్టాడు.

అతనికి కృతజ్ఞతలు కూడా చెప్పుకోకుండా ఛెంగున ఎగిరి స్టీరింగ్ ముందు కూర్చున్నది టొయోటా సుందరి... టకటకా గేర్లు మార్చి వేగంగా పరుగులు తీయించింది జీప్‌ని....

మూరెడు పొడుగున్న తెల్లటి గడ్డాన్ని దువ్వుకుంటూ, జీప్ వేగానికి దుస్తులనిండా పడిన దుమ్ము ధూళిని ఎడమ చేత్తో

విదిలించుకుంటూ, తన గుడారం వైపు కదలబోయి, చటుక్కున ఆగిపోయాడు వృద్ధుడు.

"ఎవరది? ఎవరా చెట్టుచాటున?? ఎవరు???" ఖంగుమంటున్న కంఠంతో ప్రశ్నిస్తూ రెండు అడుగులు ముందుకు వేశాడు.

టొయోటా సుందరి అనుసరిస్తున్న మార్గాన్ని పరీక్షగా చూసేటందుకు తనకు తెలియకుండానే ప్రక్కకు జరిగి, అతని దృష్టిలో పడినందుకు తనను తానే నిందించుకుంటూ, గిరుక్కున వెనుతిరగబోయాడు ఒక చెట్టు చాటున వున్న షాడో.

"ఆగరా బద్మాష్... ఆగు... అడుగు ముందుకు వేశావంటే హతమారి పోతావ్... ఆగు..." మరింత కఠినంగా కమాండ్ చేస్తూ ఇంకో రెండు అడుగులు ముందుకు వేశాడు వృద్ధుడు.

ఆగకుండా అలాగే ప్రొసీడ్ అయితే, గుడారాల ముందున్న జనం అందరూ పరిగెత్తుకు వచ్చేస్తారని అర్థమై పిక్కబలం చూపించే ఆలోచనను అర్జంటుగా విరమించేసుకున్నాడు షాడో.

ప్రపంచంలో వుండే దీనత్వాన్ని మొత్తం తన ముఖంలోకి రప్పించుకుంటూ వృద్ధుడికేసి తిరిగాడు... తలను వంచి సలాం మీద సలాం చేశాడు.

"ఎవరివి బే నువ్వు? ఏం చేస్తున్నావ్ బే ఇక్కడ??" పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అతని ముందుకు వచ్చి క్రూరంగా ప్రశ్నించాడు వృద్ధుడు.

"తిండి తిని నాలుగు రోజులు అయింది... ఆకలితో కళ్ళు గిర్రున తిరిగి పోతున్నాయి.... కాస్తంత కడుపు నింపుకొనే ఏర్పాటు చేయండి సాబ్... మీ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు తరువాత చెపుతాను" ఆకలి బాధను తట్టుకోలేక పోతున్నట్లు నీరసం నిండిన కంఠంతో వేడుకున్నాడు షాడో.

క్రూయిజర్ పైన వున్న కళాసీల కంట పడకుండా వుండేందుకు తీరం మీది బండరాళ్ళ చాటున బోర్లా పడుకోవటం వల్ల, అక్కడ పేరుకుని వున్న పాకుడు అంటుకుని అపరిశుభ్రం అయిపోయాయి అతని దుస్తులు.

సముద్రంలోనుంచి బయటికి వచ్చిన తరువాత, మంచినీటితో శుభ్రం చేసుకోకపోవటం వల్ల ముఖం మీదా, చేతులమీదా ప్రత్యక్షం అవుతున్నాయి తెల్లటి ఉప్పుచారికలు.

నెంబర్ వన్ యాచక శిఖామణిలా అగుపిస్తున్న అతని అవతారాన్ని దగ్గర్లోనుంచి అసహ్యకరంగా ముఖం పెట్టాడు ఆ వృద్ధుడు. ఖాండ్రించి ఉమ్మేశాడు.

"నీలాంటి గధేకి బచ్చేని దగ్గిరికి రానిస్తే, దేవుడు మమ్మల్ని క్షమించడు. అవతలికి వెంటనే వెళ్ళకపోతే చిట్లిపోతుంది నీ వీపు... ముఖం పగిలిపోతుంది. చలేజావ్ యహా సే" కొట్టటానికి రెడీ అవుతున్నట్లు చేతిని గాలిలోకి ఎత్తుతూ క్రూరంగా హెచ్చరించాడు.

"నన్ను దగ్గిరికి రానీయక పోయినందువల్ల నాకు వచ్చే నష్టం ఏమీ వుండదు సాబ్... దయచేసి ఒక రొట్టెముక్కని నా ముఖాన పడేయించండి. మీ పేరు చెప్పుకొంటూ ఆరగిస్తాను" చేతులు జోడిస్తూ జాలిగొలిపే కంఠంతో బ్రతిమాలుకున్నాడు షాడో.

కొంచెం కూడా కరగలేదా వృద్ధుడి గుండె.

"ముందు ఇక్కడి నించి అవతాలికి పోతావా, పోవా?" చేతులతో అతన్ని హింసించటం ఇష్టం లేక సరయిన ఆయుధం కోసం వెతికే వాడిలా చుట్టూ చూస్తూ మరింత కర్కశంగా హెచ్చరించాడు.

"పోకపోతే ఏం చేస్తావ్? తలకొట్టి మొలేస్తావా?" ఇంకో రెండు అడుగులు వెనక్కి వేసి సడన్‌గా ఎదురు ప్రశ్న వేశాడు షాడో.

ఆశ్చర్యంతో మ్రాన్పడి పోయాడు వృద్ధుడు... తన చెవులు తనను ఏమారుస్తున్నాయేమోనన్నట్లు నోరు తెరుచుకు చూశాడు.

"నిన్నే అడుగుతున్నాను బే ముసలినక్కా.... అవతలికి పోకపోతే ఏం చేయగలవు బే నన్ను ?" నడుము మీద చేతులు వేసుకుని నిదారుగా నిలబడుతూ మరోసారి అడిగాడు షాడో.

అంతర్ధానమై పోయింది వృద్ధుడి ఆశ్చర్యం. దాని స్థానంలో అడుగు పెట్టింది దారుణమైన ఆగ్రహం.

"నన్ను... నన్ను ముసలి నక్క అంటావా? నీ ఎముకలు విరిచి, నీ నడుములు విరగదీసి సముద్రపు వడ్డున పాతి పెట్టకపోతే పేరు మార్చుకుంటాను నేను.... నీ అంతు చూడకపోతే తిండి తిప్పలు వదిలేసి ఆత్మాహుతి కావించుకుంటాను." ఏం మాట్లాడుతున్నాడో తనకే అర్థం కానంత ఆవేశంలో మునిగిపోతూ, పది అడుగుల దూరంలో వున్న ఒక చెట్టు దగ్గిరికి పరిగెత్తి, పట్టెడు లావున్న పొడుగాటి కొమ్మ నొకదాన్ని పుటుక్కున విరిచాడు. బాణాకర్రలా బిగించి పట్టుకుని కొదమ సింహంలా షాడో మీదికి లంఘించాడు.

అప్పుడు తిరిగాడు షాడో వెనక్కి... వృద్ధుడి చేతిలోని చెట్టుకొమ్మ తన తల మీద పడకుండా జాగ్రత్త పడుతూ పరుగు ప్రారంభించాడు.

పట్టరాని కోపం శరీరంలోని ప్రతి అణువుకు పాకిపోవటం వల్ల వెనుకా ముందు చూసుకోకుండా అతన్ని వెంబడించాడు వృద్ధుడు.

"ఆగుబే... ఆగు... ఒక్క క్షణం ఆగి నా ముఖంలోకి చూడుబే బద్మాష్...'' అంటూ తరుముకుంటూ వచ్చాడు.

చెట్లు తోపులో వున్న అతని పరిజనం తన చర్యల్ని గమనించలేరని నిశ్చయం అయ్యేటంత వరకూ పరుగులు తీశాడు షాడో.

నిట్టనిలువుగా గాలిలోకి లేచిన ఒక పెద్ద కొండరాయి ఎట్టఎదుట ప్రత్యక్షం అవగానే ఒక్కసారిగా పరుగును ఆపి వెనక్కి చూశాడు.

విపరీతమైన ఆయాసంతో వణికి పోతూ వచ్చి, అతని భుజాలు విరిగిపోయేటట్లు చెట్టుకొమ్మను విసిరాడు వృద్ధుడు.

"చావుబే... చావు... చేతులు విరిగి గిలగిలా కొట్టుకో..." అంటూ పడుచువాడి మాదిరిగా గాలిలోకి ఎగిరి గుండెల మీద తన్నబోయాడు.

రెండే రెండు అంగుళాలు ప్రక్కకు జరిగి భుజాల మీదికి వచ్చిన చెట్టుకొమ్మనించి తప్పించుకున్నాడు షాడో.... గుండెల మీదికి వచ్చిన వృద్ధుడి పాదాన్ని చటుక్కున పట్టుకొని విసురుగా ముందుకు లాగాడు.

అతనలా ఎదురు తిరగగలడని ఊహించకపోవటంవల్ల బాలెన్స్ నిలబెట్టుకోలేక దబ్బున క్రింద పడిపోయాడు వృద్ధుడు.

నడుములు జారిపోయేటంత దెబ్బ తగిలేసరికి బావురుమని కేకపెట్టాడు.

ముందుకు వంగి అతని చేతిలోని చెట్టుకొమ్మని అవతలికి విసిరేశాడు షాడో. పిడికిలి బిగించి డెలివర్ చేశాడు బలమైన ఒక పంచ్‌ని.

ముక్కులు అదిరి ఎర్రటి రక్తం ధారలు ధారలుగా వెలువడటం మొదలుపెట్టేసరికి మరింత బిగ్గరగా అరిచాడు వృద్ధుడు.

"రండి బే... త్వరగా రండి.. వచ్చి ఈ బద్మాష్ అంతు చూడండి..." అంటూ చెట్లతోపులో వున్న తన పరివారాన్ని ఉద్దేశించి కేకలు పెట్టాడు.

కేకలు అతని పెదవుల్ని దాటి పూర్తిగా బయటికి రాకముందే జాగ్రత్త పడ్డాడు షాడో. ఎడమ చేత్తో నోటిని అదిమి, కుడిచేతి చూపుడు వేలితో అతని చెవి క్రింది భాగంలో బలంగా అదిమాడు.

మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల మీద ప్రెషర్ అధికం అవటం వల్ల బ్లడ్ సర్క్యులేషన్‌కి ఆటంకం ఏర్పడి, క్షణాల మీద స్పృహ కోల్పోయాడు వృద్ధుడు.

గడ్డితో వేసిన దిష్టిబొమ్మను ఎత్తినట్లు తేలికగా ఎత్తి భుజాలమీద వేసుకున్నాడు షాడో అతన్ని. కొండరాయి చాటునుంచి రెండు

ఫర్లాంగుల దూరం ముందుకు పోయి ఎత్తయిన ఒక ఇసుక దిబ్బ చాటున అతన్ని క్రిందికి దించాడు.

నాలుగే నాలుగు నిముషాల్లో వచ్చేసింది స్పృహ వృద్ధుడికి. నోటికి వచ్చిన తిట్లన్నిటినీ తిడుతూ లేచి కూర్చోబోతుండగా మరోసారి తన పిడికిలిని ప్రయోగించాడు షాడో.

గుండెలమీద పరుచుకొని వున్న తెల్లటి గడ్డం కాస్తా, రక్తపు ధారలతో మలినపడి ఎరుపు రంగుకు మారటం మొదలు పెట్టేసరికి మూత బడిపోయింది అతని నోరు.

"ఎవరు నువ్వు? ఎందుకిలా నన్ను హింసిస్తున్నావ్?" అని అడిగాడు బెదురు చూపులు చూస్తూ.

"ముక్కుకి సూటిగా పోయే మనస్తత్వం మనది. అనవసరమైన మాటలతో కాలక్షేపం చేయటం మనకి నచ్చదు." వెనుకా ముందు చూసుకోకుండా ఇష్టం వచ్చినట్లు సముద్రంలో దూకటం వల్ల తడిసిపోయిన సిగరెట్ పాకెట్‌ని బయటికి తీసి ఇసుకలో పెడుతూ అన్నాడు షాడో.

అతని అవతారాన్ని చూసి తేలిక మాటలు మాట్లాడటం తన ఆరోగ్యానికి ఏమంత మంచిది కాదని అర్థమయినందువల్ల, వినయాతి వినయంగా తల వూపాడు వృద్ధుడు.

"ఇందాక నీదగ్గిరికి వచ్చిన పంచదార చిలక ఎక్కడికి పోయిందో నువ్వు మనకి చెప్పాలి..." చివికి పోయినట్లుగా తయారయిన సిగరెట్లను జాగ్రత్తగా తీసి ఎండబెట్టుకొనే ప్రయత్నాలు ప్రారంభిస్తూ అన్నాడు షాడో.

పంచదార చిలుక ప్రసక్తి వచ్చేసరికి మారిపోయాయి వృద్ధుడి ముఖంలోని రంగులు. కంటికి కనిపించని దేవదూత ఎవరో అక్కడికి వచ్చి అపూర్వమైన బలం తనకి ప్రసాదించినట్లు ఛెంగున లేచాడతను.

కూర్చున్న చోటినించి ప్రక్కకు దొర్లి మెరుపులా అతని కుడికాలిని పట్టుకున్నాడు షాడో.

ముందుకు తూలాడు వృద్ధుడు.... మెత్తటి ఇసుకలో బోర్లా పడిపోయాడు.

"నీ మీద వ్యక్తిగతమైన పగ ఏదీ నాకు లేదు. నిన్ను హింసించాలనే కోరిక కూడా నాకు లేదు. నా ప్రశ్నకు సమాధానం చెప్పిన మరుక్షణం వదిలేస్తాను నిన్ను." అతన్ని వెల్లికిలా తిప్పి అంతకు ముందు పడుకోబెట్టిన ప్రదేశంలోకి లాగుతూ మృదువుగా అన్నాడు షాడో.

"నువ్వు నన్ను గిచ్చినా, రక్కినా, కొరికినా ఆఖరికి చంపి సముద్రంలోకి విసిరేసినా ప్రయోజనం ఏదీ వుండదు. నువ్వు అడుగుతున్న చిలక ఎవరో నాకు తెలియదు." నిర్మోహమాటంగా

సమాధానం చెప్పి తలను ప్రక్కకు తిప్పుకున్నాడు వృద్ధుడు. కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

ఇసుకలో ఆరబెట్టిన సిగరెట్లలోనుంచి కాస్తంత తడి ఆరిన దాన్ని తీసి వెలిగించుకున్నాడు షాడో. అదోరకమైన దుర్వాసనతో నోరంతా చెడిపోయినా సరే అవతలికి విసిరేయకుండా అలాగే పట్టుకుంటూ ఆలోచనలో పడ్డాడు.

అల్లాటప్పా బెదరింపులకు అదిరిపోయి నోరు విప్పే రకం మాదిరిగా అగుపించటం లేదు ఆ పెద్దమనిషి... ఒకటి రెండు గంటల వ్యవధి అవసరం అయ్యేటట్లు కనిపిస్తోంది అతన్ని లొంగతీసుకోవటానికి.

అంతవరకూ ఆగుతారా చెట్లతోపులోవున్న అతని అనుయాయులు? కర్రలు, కత్తులు పట్టుకొని కేకలు పెట్టుకుంటూ బయలుదేరరూ అతని కోసం??

తీవ్రమైన ఆలోచనలతో మెదడంతా కందిరీగల తుట్టె మాదిరిగా తయారు కావటంతో అలవాటు ప్రకారం సగం కూడా కాలకముందే అవతలికి విసిరేశాడు షాడో చేతిలోని సిగరెట్‌ని.

గింగిరాలు తిరుగుతూ పోయి పది అడుగుల దూరంలో వున్న ఒక చిన్న బొరియ దగ్గిర పడిందది... అందులో నుంచి బయటికి రాబోతున్న ఎండ్రకాయను అదరగొట్టి లోపలికి తరిమేసింది.

చటుక్కున ఫ్లాష్ అయింది ఆ దృశ్యాన్ని చూసిన షాడో మనస్సులో ఒక ఆలోచన.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా ముందుకు జరిగి వృద్ధుడు ధరించిన అంగీ అంచును పట్టుకున్నాడు.

కనురెప్పల చాటునుంచి అతన్నే గమనిస్తున్నాడు కాబోలు అదిరిపడి అతని చేతిని అవతలికి విదిలించే ప్రయత్నం చేశాడు వృద్ధుడు.

"ఏమిటిది? ఏం చేస్తున్నావ్ నువ్వు??" అంటూ లేచి కూర్చోవటానికి ప్రయత్నించాడు.

మోకాలితో అతని గుండెల మీద పొడిచి వెనక్కి నెట్టాడు షాడో. చేతికి దొరికిన అంగీని సర్రున చింపి, ఆ చీలికలతో పొడుగాటి తాడును తయారు చేశాడు. దానితో అతని కరచరణాలను గట్టిగా బంధించి, అరిచి కేకలు పెట్టకుండా మరికొన్ని పీలికల్ని నోటిలో కుక్కాడు.

"పంచదార చిలుక ఎవరో తెలియదు పొమ్మనందుకు తగిన శిక్షను అనుభవించబోతున్నావు నువ్వు. గిచ్చకుండా, రక్కకుండా, మీదపడి కొరకకుండా నీ చేతనే సమాధానం చెప్పిస్తాను. చూస్తూ వుండు..." అని అతన్ని హెచ్చరిస్తూ ఇసుక దిబ్బచాటునుంచి సముద్రం దగ్గిరికి పరుగు తీశాడు.

ఎంతో సేపు గాలించాల్సిన అవసరం లేకుండానే రెండు బండరాళ్ళ మధ్య లుక లుక లాడుతూ అతనికి కనిపించాయి ఏడెనిమిది అంగుళాల పొడవుండే డెక్కల్ని వూపుకుంటూ తిరుగుతున్న ఎర్రటి ఎండ్రకాయలు.

తన షర్టు అడుగుభాగాన్ని గట్టిగా ముడివేసి సంచీ మాదిరిగా తయారు చేశాడు షాడో. శబ్దం చేయకుండా ముందుకు పోయి వేట కార్యక్రమాన్ని ప్రారంభించాడు.

పదే పది నిముషాల్లో నిండిపోయింది షర్టు. పైన వున్న ఓపెనింగ్స్‌లోనుంచి బయటికి దూకి పారిపోవటానికి ట్రై చేయసాగాయి ఆ సముద్రజీవులు.

వాటి డెక్కెలకు తన చేతి వేళ్ళు అందకుండా జాగ్రత్తపడుతూ, షర్టును బిగించి పట్టుకుని ఇసుక గుట్ట దగ్గిరికి బయలుదేరాడతను.

గిలగిలా కొట్టుకుంటున్నాడు వృద్ధుడు. కరచరణాల్ని పట్టివుంచిన గుడ్డపీలికల్ని వదిలించుకోవటానికి, నోటిలోని అంగీ ముక్కల్ని బయటికి నెట్టేయటానికి విపరీతంగా శ్రమపడుతున్నాడు.

ఒక చేత్తో షర్టును పట్టుకొని, రెండవచేత్తో మూడు మూరల లోతుండే గోతిని తవ్వాడు షాడో. షర్టులో వున్న జీవాలన్నిటినీ ఆ గోతిలోకి పంపి, వృద్ధుడి నోటిలోని పీలికల్ని బయటికి లాగేశాడు.

"ఏం చేస్తున్నావ్ నువ్వు? ఏం చేయబోతున్నావ్??" గోతి వంకా, అతని వంకా మార్చి మార్చి చూస్తూ అడిగాడు వృద్ధుడు.

చటుక్కున ముందుకు వంగి అతన్ని గోతి దగ్గిరికి దొర్లించాడు షాడో. మెడను గట్టిగా పట్టుకొని గోతిలోకి వంచాడు.

డెక్కల్ని జాచి తన గడ్డాన్ని పట్టుకోబోయిన సముద్రపు జీవులను చూసి విపరీతమైన భయంతో బావురు మని అరిచాడు వృద్ధుడు.

"అడిగిన ప్రశ్ననే మళ్ళీ మళ్ళీ అడగటం మన పద్ధతికి విరుద్ధం. నీ అంతట నువ్వు సమాధానం చెప్పక పోతే నీ ఖర్మ కాలిపోయినట్లే..." అతని గడ్డాన్ని పట్టుకోబోతున్న ఎండ్రకాయ నొకదాన్ని జాగ్రత్తగా షర్టుతో విదిలించి, అతని తలను వెనక్కి లాగుతూ హెచ్చరించాడు షాడో.

"నువ్వు అడిగిన చిలక ఎవరో నాకు తెలియదు... నాకు తెలిసిన వాళ్ళందరూ ముసలిపీనుగలే... చిలకలు ఎవరూ లేరు..." గోతిలోని జీవాల్ని చూస్తూ గబగబా అన్నాడు వృద్ధుడు.

వార్నింగ్ కూడా లేకుండా మళ్ళీ అతన్ని ముందుకు నెట్టాడు షాడో.

"రక్షించండి... ఈ సైతాన్ బారినుంచి ఎవరయినా నన్ను రక్షించండి..." గొంతు చించుకుని అరిచాడు వృద్ధుడు.

"ఎవరో వచ్చి నిన్ను ఆదుకుంటారని ఆశపడకు. పదిక్షణాల్లో పెదవులు విప్పకపోతే నీ తలను ఈ గోతిలో వుంచి చుట్టూ ఇసుక కప్పేస్తాను." పది క్షణాలు ముగిసిన మరుక్షణం అన్నంత పనీ చేయటానికి సిద్ధంగా కూర్చుంటూ బెదిరించాడు షాడో.

పిశాచాల వంటి ఎండ్రకాయలున్న గోతిలో తలను పెట్టి చుట్టూ ఇసుక కప్పించుకుంటే ఏం జరుగుతుందో ఊహించుకునే సరికి చలిజ్వరం వచ్చినంత పని అయింది వృద్ధుడికి. అప్పుడే సముద్రంలో మునిగివచ్చినట్లు చెమటలతో తడిసిపోయింది అతని శరీరం.

షాడో ఇచ్చిన వ్యవధి పూర్తి కాకముందే పెదవులు విప్పాడతను.

"ఇస్తాఫ్ నగరానికి పోయింది నువ్వు అడుగుతున్న పంచదార చిలక. ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసేటట్లయితే రేపు ఉదయం ఎనిమిది గంటల సమయంలో అక్కడికి చేరుకుంటుంది"

గోతి అంచుమీదికి ఎక్కి దూరంగా పారిపోవటానికి ప్రయత్నిస్తున్న ఎండ్రకాయలను గురించి పట్టించుకోకుండా అతన్ని ఇవతలికి లాగాడు షాడో.

చెట్లతోపులోకి అడుగు పెట్టిన క్షణం నుంచీ అతన్ని పట్టి పీడిస్తున్న ఒక సందేహం పూర్తిగా తొలగిపోయింది వృద్ధుడిచ్చిన సమాధానంతో.

సముద్ర తీరంలో గస్తీ తిరుగుతూవుంటే కోస్టల్ గార్డ్స్‌ని ఏమార్చి మధ్యధరా సముద్రానికి ఆవలిప్రక్కగా వుండే అల్జీరియా తీరాన్ని చేరుకున్నది టొయోటా సుందరి ఎక్కివచ్చిన క్రూయిజర్.

అల్జీరియా దేశంలో మాత్రమే వున్నది ఒక ఇస్తాఫ్ నగరం... స్పెయిన్‌లో లేదు.

"నీ ప్రశ్నకు సమాధానం చెపితే నన్ను వదిలేస్తానన్నావు గదా! వదిలేయ్!!" దీనంగా చూస్తూ వృద్ధుడు అడిగేసరికి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చేశాడు షాడో.

"ఇస్తాఫ్ నగరంలో ఎవరిని కలుసుకోవటానికి వెళ్ళింది ఆ పంచదార చిలుక?" వృద్ధుడి పాదాలకున్న గుడ్డపీలికల్ని వదులు చేస్తూ వెంటనే వేశాడు మరో క్వశ్చన్‌ని.

సమాధానం ఇవ్వటానికి ఇష్టం లేనట్లు ముఖం పెట్టి నాలుకతో పెదవుల్ని తడుపుకున్నాడు వృద్ధుడు.

"త్వరగా చెప్పు మై ఫ్రండ్... నువ్వు సమాధానం చెప్పిన మరుక్షణం విడుదల అయిపోతావ్... మరొక్కక్షణం కూడా ఇక్కడ వుండాల్సిన అవసరం లేదు..." పాదాలకున్న బంధనాలను సడలించేసి, చేతులవైపు తిరుగుతూ మృదువుగా అన్నాడు షాడో.

అతని మాటలకు చేతలకు ఎంతగానో సంతోషిస్తున్నట్లు ముఖం పెట్టి గొంతు సవరించుకున్నాడు వృద్ధుడు. కాని మాటలు అతని పెదవులు దాటకముందే ఇసుక గుట్టకు ఆవలివైపున చెలరేగింది దారుణమైన ఒక గందరగోళం.

చెట్లతోపులో వుండవలసిన వృద్ధుడి బలగం అంతా కట్టకట్టుకుని అతనికోసం వచ్చేస్తున్నారేమోనన్న అనుమానంతో పది అంగల్లో గుట్ట మీదికి పోయి, అవతలివైపుకు తొంగిచూశాడు షాడో.

కనిపించిన దృశ్యం అతని శరీరాన్ని ఝల్లుమనేటట్లు చేసింది.

కట్ట కట్టుకుని తమ నాయకుడి కోసం రావటం లేదు చెట్లతోపులో వుండవలసిన వృద్ధుడి అనుయాయులు.

చర్మపు కొరడాలు పట్టుకున్న బ్రహ్మరాక్షసుల వంటి కొందరు దృఢకాయుల బారినుంచి తప్పించుకోవటానికి గగ్గోలుగా అరుస్తూ పారిపోయి వస్తున్నారు.

"పట్టుకోండి... ఒక్కళ్లని కూడా వదిలిపెట్టకుండా పట్టుకోండి... ఎదురు తిరగటానికి ప్రయత్నిస్తే ఎముకలు విరగగొట్టేయండి..." ఉరుములాంటి కంఠంతో హెచ్చరికలు అందజేస్తున్నాడు బకాసురుడి మాదిరి భయం కొలిపే విధంగా వున్న దృఢకాయుల నాయకుడు.

అతనెవరో, అతని ఆజ్ఞలను అక్షరాలా అమలు పరిచేటందుకు ప్రయత్నించే ఆ ఆగంతకులు ఎవరో షాడోకి తెలియదు. అభం శుభం తెలియని ఆడవాళ్ళని, ఆఖరికి చిన్న పిల్లల్ని కూడా వదిలిపెట్టకుండా ఎందుకు అలా వెంటాడుతున్నారో అంతకన్నా తెలియదు.

తనకు ఏవిధంగాను సంబంధం లేని ఆ గందరగోళంలో వేలు పెట్టటం తన ఆరోగ్యానికి ఎంత మాత్రమూ మంచిది కాదని అనిపిస్తున్నా, ఆగలేకపోయాడు... ఆగ్రహాన్ని అణుచుకోలేక పోయాడు.

"ఆగండి బే... ఆగండి.. దమ్ము అంటూవుంటే నాతో కలబడండి బే... రండి... రండి... " అని టాప్ పిచ్‌లో అరిచి చుట్టూ చూశాడు.

ఆయుధాల వంటివి ఏవీ అగుపించక పోయే సరికి, పది అడుగుల దూరంలో వున్న కొన్ని పలుకురాయి ముక్కల్ని గమనించి గబగబా చేతుల్లోకి తీసుకున్నాడు.

చర్మపు కొరడాను గాలిలో ఝుళిపిస్తూ ఒక మధ్య వయస్కురాలి జుట్టును పట్టుకోబోతున్నాడు దృఢకాయుల నాయకుడు.

గింగిరాలు తిరుగుతూ పోయి అతని తల మీద పడ్డాయి షాడో విసిరిన పలుకురాయి ముక్కలు.

కీచుగా అరిచి మధ్యవయస్కురాలిని వదిలేశాడతను. కొరడాని కూడా క్రింద పడవేసి తలను తడుముకున్నాడు. తల చిల్లుపడి ఎర్రటి రక్తం చేతివేళ్ళకు అంటుకునే సరికి భూనభోంతరాలు ఏకమయ్యేలా పొలికేక పెట్టి ఒక గుట్టకేసి తిరిగాడతను.

"రండి బే... అందరూ రండి... దమ్ము వుంటే వచ్చి నన్ను పట్టుకోండి..." చేతుల్లోకి తీసుకున్న మరో రెండు రాతి ముక్కల్ని క్రిందికి విసిరేసి, పెద్ద వస్తాదు మాదిరి తొడ చరుస్తూ రెచ్చగొట్టాడు షాడో...

ములుకుల మాదిరి పొడుచుకున్నాయి కాబోలు అతని మాటలు, దిక్కులు పిక్కటిల్లేలా మరో పొలికేక పెట్టి గుట్ట మీదికి బయలు దేరాడు ఆ పెద్దమనిషి.

వృద్ధుడి అనుయాయుల్ని తరిమి కొట్టటాన్ని వాయిదా వేసుకొని అతన్ని అనుసరించారు మిగిలిన దృఢకాయులు.

పదిక్షణాల పాటు కదలకుండా నిలబడి గిరుక్కున వెనుతిరిగాడు షాడో. పెద్దపులులు, సింహాలు తన వెంటబడి తరుముతున్నట్లు గుట్ట క్రిందికి వచ్చేశాడు.

"పారిపో మై ఫ్రండ్... పారిపోయి ఎక్కడయినా తలదాచుకో... దిక్కులు చూస్తూ ఇక్కడే నిలబడితే ఖతమైపోతుంది నీ బ్రతుకు..." అని వృద్ధుడిని హెచ్చరిస్తూ, అతని చేతుల్ని పట్టి వుంచిన బంధనాల్ని కూడా వూడదేసేశాడు.

ఇసుక గుట్ట అవతలి గోలకు కారణం ఏమిటో, అందుకు కారకులు ఎవరో తనకు బాగా తెలిసినట్లు ఛెంగున ప్రక్కకు దూకాడు వృద్ధుడు. రెండే రెండు క్షణాల్లో సముద్రతీరం వైపు పారిపోయాడు.

క్రింద పడవేసిన షర్టును అందుకున్నాడు షాడో... ఇసుకలో ఆరబెట్టిన సిగెట్లని, లైటర్‌ని పాంటుజేబులోకి నెట్టుకున్నాడు.

ఆ కాస్త వ్యవధిలోను గుట్ట మీదికి వచ్చేశాడు దృఢకాయుల నాయకుడు. గుండెలు జలదరించేలా కేకలు పెడుతూ, పాంటు బెల్టుకు వ్రేలాడుతున్న ఐరన్‌పైప్ వంటి లాటీకర్ర నొకదాన్ని బలంగా క్రిందికి విసిరాడు.

గింగిరాలు తిరుగుతూ వచ్చిపడిన ఆ ఆయుధాన్నించి తేలికగానే తప్పించుకోగలిగాడు షాడో. అయితే ఆ లాటీకర్ర వెనుకగా గాలిలో రౌండ్లు కొడుతూ వచ్చిన లావుపాటి చర్మపు తాడును మాత్రం గమనించలేకపోయాడు.

యమపాశంలా వచ్చి అతని మెడను చుట్టుకుంది ఆ తాడు... వెనక్కి లాగి వెల్లకిలా పడిపోయేటట్లు చేసింది.

పడిన వెంటనే పైకి లేచి పరుగు అందుకునే అవకాశం లభించలేదతనికి. పెద్దపులులు సింహాల మాదిరిగానే వచ్చి అతన్ని కమ్ముకున్నారు దృఢకాయులు.

పది దెబ్బలు పడేటంతవరకూ ఏదో ఒక విధంగా వారిని ఎదిరించటానికే ప్రయత్నించాడతను.... అందరికంటె ఆఖర్న వచ్చిన దృఢకాయుల నాయకుడు అరచేతులతో మెడమీద చరిచేసరికి కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరి పడ్డాడు. తనకు తెలియకుండానే స్పృహను కోల్పోయి క్రిందికి జారాడు.

## 6

ఎలుగుబంటి తల, మనిషి శరీరం కలిగివున్న వింత మృగం ఒకటి తన గొంతును పట్టుకోబోతున్నట్లు కలగన్నాడు షాడో.

తప్పించుకోవటం కోసం చేతుల్ని ఎత్తి ఆ వింత మృగం ముఖంమీద బలంగా కొట్టటానికి ప్రయత్నించాడు.

"కాళ్ళు చేతుల్ని కట్టి పడవేసినా వీడి పొగరు కొంచెంగా కూడా తగ్గలేదు... తగిలించండి నాలుగు చురకల్ని.... అరిచి కేకలు పట్టినా వదలకండి..." ఖంగు మంటున్న కంఠంతో ఆజ్ఞలు జారీ చేసింది మృగం.

ఛళ్ ఛళ్ మని శబ్దాలు చేస్తూ గాలిలోకి లేచాయి రెండు చర్మపు కొరడాలు.... రివ్వు రివ్వున వచ్చి వంటి మీద వాలేసరికి వదిలి పోయింది షాడోని ఆవరించుకునివున్న మగత.

కనులు తెరిచిన మరుక్షణం కనిపించాడతనికి నడుము మీద చేతులు వేసుకొని ఠీవిగా నిలుచుని వున్న దృఢకాయుల నాయకుడు.

చర్మపు కొరడాలని చేతికొద్దీ విసురుతూ అతనికి కాస్తంత ఇవతలగా అగుపించిన అతని అనుచరులు ఇద్దర్ని గమనించే సరికి తనను తాను కంట్రోల్ చేసుకోలేక పోయాడు.

పళ్ళు పటపటలాడిస్తూ పిడికిళ్ళు బిగించి వారి మీద కలబడాలనే కోరిక కలిగింది గాని - ఉన్నచోటినుంచి ఒక్క అంగుళంకూడా కదలలేదు అతని పాదాలు. పిడికిళ్ళు బిగించటం వరకే చేతనయింది... పిసరంత కూడా ముందుకు జాచలేక పోయాడు చేతుల్ని.

ఎదుటవున్న ఆ దుర్మార్గుల్ని చీల్చి చెండాడేసేటంత ఆగ్రహం కాస్తా విపరీతమైన ఆశ్చర్యంగా మారుతుండగా తలను వంచి తన శరీరం వంక చూసుకున్నాడు.

బలమైన చర్మపు తాళ్ళతో బంధింపబడి వున్నాయి అతని చేతులు... పొడుగాటి ఇనుప గొలుసులతో బిగించబడివున్నాయి పాదాలు.

ఇసుక గుట్ట దగ్గిర ఎదురు తిరిగి వెక్కిరింపు మాటలు మాట్లాడినందుకు వళ్ళు హూనం చేసి వదిలేయకుండా, తననలా బంధించటం దేనికో అర్థం కాలేదు షాడోకి.

ఆ రహస్యం ఏమిటో తెలుసుకోకుండా అనవసరమైన ఫీలింగ్స్‌ని ప్రదర్శిస్తే వళ్ళు చెడటం తప్ప మరో ప్రయోజనం అంటూ ఏదీ వుండదని మాత్రం క్లియర్ కట్‌గా తెలిసివచ్చింది.

వెంటనే గొంతును విప్పాడతను.... చెవులు చిల్లులు పడిపోయే స్థాయిలో అరిచి కేకలు పెట్టటం స్టార్ట్ చేశాడు.

దెబ్బల వేగం పెరిగిన కొద్దీ అతని అరుపులు స్థాయికూడా అధికం అవుతూండటంతో చటుక్కున చేతిని ఎత్తి సైగ చేశాడు దృఢకాయుల నాయకుడు.

చర్మపు కొరడాలను క్రిందికి దించి వెనక్కి తగ్గారు అతని అనుచరులు. చిన్న మట్టిముంత నిండా నీళ్ళను నింపి షాడో ముఖం మీదికి వెదజల్లారు.

"బుద్ధి గడ్డితిని మీ జోలికి వచ్చాను.... ఈ ఒక్కసారికి క్షమించి వదిలేశారంటే ఇంకెప్పుడూ మీ దారికి అడ్డురాను... ఇంటి దగ్గర నా భార్యా బిడ్డలు నా కోసం ఎదురు చూస్తూవుంటారు. వదిలేయండయ్యా... దయచేసి నన్ను వదిలేయండి..." ముఖం మీద పడిన నీటికి తన కన్నీళ్ళను కూడా కలుపుతూ దీనంగా బ్రతిమాలుకున్నాడు షాడో.

పరుషమైన పదాలేవైనా అతని నోటినుండి వస్తే పెదవులు పగలగొట్టటానికి పిడికిళ్ళు బిగిస్తున్నాడు దృఢకాయుల నాయకుడు. అతని బేల మాటలకు ఫక్కున నవ్వి ముఖం మీద అరిచేత్తో చరిచాడు.

"ఇసుక గుట్ట దగ్గిర వీడి ఫోజును చూసి కొమ్ములు తిరిగిన ధైర్యశాలి అనుకున్నాం... వంటి మీద దెబ్బపడిన మరుక్షణం ఆడదాని కంటె హీనంగా ఏడ్చి రాగాలు తీస్తాడని అనుకోలేదు."

చర్మపు కొరడాని ఉపయోగించాల్సిన అవసరం ఇక ఉండదని అనుకున్నాడు కాబోలు. చుట్టలుగా చుట్టి పాంటు బెల్టుకు తగిలించుకుంటూ కామెంట్ చేశాడు అతని అనుచరుల్లో ఒకతను.

"ఆడదాని మాదిరిగా రాగాలు తీసినందువల్ల మనకి వచ్చే నష్టం ఏమీ వుండదు. తేరగా వచ్చిన తిండి ఏదో తెగ తిని గజలీ మృగం మాదిరి కండలు తెగపెంచాడు. ఈ కండల్ని చూపించి సొమ్ము దండుకుందాం..." షాడో భుజపు కండరాల్ని నొక్కి నొక్కి చూస్తూ అన్నాడు వారి నాయకుడు.

అదను చూసుకుని మరోసారి ఆరున్నొక్కరాగాన్ని ఆలపించి, తనెందుకు పనికిరాని వాడి మాదిరి ఇంప్రెషన్ కలుగచేయాలని అనుకుంటున్న షాడో గుండెల మీద పది టన్నుల బరువుండే కొండరాయి పడినట్లయింది.

తన కండల్ని చూపించి సొమ్ము దండుకుంటారా?

అంటే వీళ్ళు మామూలు మనుష్యులు కాదు!! అన్నెం పున్నెం ఎరుగని అమాయకులు ఏమరి పాటుగా వున్న అదను చూసి పిశాచాల మాదిరి దాడి చేసే స్లేవ్ ట్రేడర్స్!!!

బందీలుగా చిక్కిన వారిని రెండో కంటివాడికి తెలియకుండా అవతలికి తీసుకు పోయి బానిసలుగా అమ్మేసే నరరూపరాక్షసులు వాళ్ళు!!

మధ్యధరా సముద్రపు రెండో తీరాన్ని అనుకుని వుండే కొన్ని దేశాల్లో రెండు మూడు వందల సంవత్సరాల క్రితం వరకు ఆచరణలో

వుండేదని అందరూ అనుకునే బానిసల వ్యాపారం, ఇప్పుడు కూడా కంటిన్యూ అవుతూనే వుంటుందని తెలిసికూడా ముందుగానే గ్రహించలేక పోయిన తన మందబుద్ధిని తలుచుకునే సరికి షాడోని ఆవరించుకున్నది విపరీతమైన సిగ్గు.

'సిగ్గు పడినందువల్లా, జరిగిన పొరపాటుకు నిన్ను నువ్వు నిందించుకున్నందువల్లా ప్రస్తుతం వున్న పరిస్థితుల్లో మార్పు ఏదీ వుండబోదు మిస్టర్ షాడో.... ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని ఇక్కడినించి బయట పడే మార్గాన్ని వెతుక్కో. ఆలస్యం చేశావంటే నువ్వు బతికినంత కాలం బానిసగా పని చేయవలసి వస్తుంది. చర్మం చిట్లిపోయేటట్లు ప్రతిరోజు కొరడాదెబ్బలు తింటూ కాలక్షేపం చేయవలసిన దుర్గతి ఎదురవుతుంది...' అంతవరకూ మౌనంగా వున్న అంతరాత్మ ఒక్కసారిగా గొంతువిప్పి హితబోధలు చేయటం మొదలు పెట్టటంతో తల విదిలించి, నిటారుగా నిలబడ్డాడు.

అక్కడి నుంచి బయట పడే మార్గాన్ని వెతుక్కునే ఆలోచన మాత్రం వెంటనే చేయలేక పోయాడతను.

భుజపు కండరాల్ని పరీక్షగా చూసినట్టే చూసి, ఫెడీమని అతని ముఖం మీద కొట్టాడు దృఢకాయుల నాయకుడు. జుట్టు పట్టుకుని తలను గోడకేసి బాదాడు.

నల్లటి సిల్కుపరదా ఒకటి కనులకు అడ్డంగా ప్రత్యక్షమవుతున్న సెన్సేషన్ కలుగుతుండగా స్పృహ తప్పి తల వాల్చేశాడు షాడో.

తిరిగి తెలివి తెలిసేసరికి చీకట్లు దట్టంగా ముసురుకుని వున్నట్లు అర్థం అయింది. కొండరాతి గోడ దగ్గర్నించి ఒక రెల్లుదుబ్బల పాకలోకి ట్రాన్స్ఫర్ చేయబడినట్లుగా కూడా అవగతం అయింది.

అంతకు ముందు మాదిరి వంటరిగా లేకుండా, తన మాదిరిగానే బలవంతంగా తీసుకురాబడిన బంధితులు అనేక మంది తనతోపాటు ఆ పాకలో వున్నట్లు తెలిసేసరికి పూర్తిగా వదిలిపోయింది అతని మెదడును ఆవరించుకుని వున్న మత్తు.

* * * * *

పాదాలను పట్టివుంచిన ఇనుపగొలుసులు శబ్దం చేయకుండా జాగ్రత్తపడుతూ, పాకలో వున్న వారందరిలోకి కాస్తంత పెద్దవాడిమాదిరిగా అగుపిస్తున్న ఒక వ్యకి దగ్గిరికి చేరుకున్నాడు షాడో.

"ఎక్కడినించి తీసుకువచ్చారు భాయీ నిన్ను? ఎంతకాలం క్రితం తీసుకువచ్చారు??" నోరు మూసుకుని మౌనంగా వుండటం చేతకాక పోవటం వల్ల మెల్లిగా అడిగాడు.

ఎంతో ధైర్యంగా వున్నట్లు కనిపించిన ఆ వ్యక్తి ముఖంలో ఒక్కసారిగా వచ్చేసింది విపరీతమైన మార్పు. షాడో ప్రశ్నకు సమాధానం

చెప్పకపోగా, కొంపలు నిలువుగా అంటుకుపోతున్నట్లు ఏడుపును లంకించుకున్నాడు ఒక్కసారిగా.

రెల్లు దుబ్బుల్లో నిప్పురవ్వ పడినట్లు శరవేగంతో వ్యాపించింది అతని నిర్వేదం. పాకలో వున్న వారందర్నీ అలుముకున్నది.

అంతవరకూ ఎంతో నిశబ్దంగా వున్న ఆ ప్రదేశం కాస్తా భరించరానటువంటి రోదన ధ్వనులతో నిండిపోయింది.

అదిరిపడి తన ముందున్న వ్యక్తి నోటిని బలవంతంగా అదమటానికి ప్రయత్నించాడు షాడో. చర్మపు తాళ్ళతో గట్టిగా బంధించబడి వుండటం వల్ల ఆ పని చేయలేక, గబగబా వెనక్కి జరిగి తన స్థానంలోకి వచ్చేయటానికి ట్రై చేశాడు.

అప్పటికే అయిపోయింది ఆలస్యం.

రోదన ధ్వనులు బయటికి వ్యాపించటం మొదలు పెట్టిన మరుక్షణం పాకలోకి పరిగెత్తుకు వచ్చారు నలుగురు దృఢకాయులు.

వెనక్కి వెనక్కి జరగటానికి ట్రై చేస్తున్న షాడోని గమనించగానే అసలు విషయం అర్థం అయినట్లు, పెద్దపులి మాదిరి భీకరంగా శబ్దం చేశాడు వారిలో ఒకతను.

"కొట్టండి బద్మాష్‌ని... తిరిగి ఇటువంటి పాడుపనులు చేయకుండా బుద్ధి చెప్పండి..." అంటూ అందుకున్నాడు తన కొరడాని.

దెబ్బ తన వంటి మీద పడీ పడకముందే గావురుమని అరిచాడు షాడో. దారుణమైన తిట్లు తిడుతూ పొర్లిగింతలు ప్రారంభించాడు.

వళ్ళు తెలియనంత కోపంతో వణికిపోతూ కొరడా హేండిల్‌ని చురకత్తి మాదిరిగా పట్టుకున్నాడు ఆ వ్యక్తి. షాడో నోటి మీద పొడవబోతుండగా, వెనుకనుంచి అతన్ని పట్టుకున్నారు మిగిలిన వాళ్ళు.

"ముందు వాడినోటిని మూయించండి"... కోపాన్ని అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ అన్నాడతను.

"నా నోటిని మూసుకోను... నా వంటి మీద దెబ్బ పడితే చూస్తూ కూర్చోను. ఇష్టం వచ్చినట్టు తిడతాను." మొండిగా అన్నాడు షాడో.

మరోసారి అతని మీదికి లంఘించబోతున్న తమ సహచరుడిని బలవంతంగా బయటికి లాక్కుపోయారు మిగిలిన దృఢకాయులు.

ఎంతో ప్రయత్నం మీద తెచ్చుకున్న కన్నీటిని భుజాల కేసి అద్దుకుంటూ ముందుకు జరిగాడు షాడో... గోడల మాదిరిగా నిలబెట్టి వున్న రెల్లు దుబ్బుల తడికెలోనుంచి బయటికి తొంగి చూశాడు.

రెల్లు దుబ్బుల పాకకు పాతిక గజాల దూరంలో వున్న వేదిక వంటి మట్టి గుట్ట దగ్గిర, అతనికి కనిపించాడు దృఢకాయుల నాయకుడు. అసహనంగా పచార్లు చేస్తూ, కస్టమర్స్ కోసం కాబోలు ఎదురుచూస్తున్నాడు.

"కొరడా దెబ్బలతో వళ్ళు హూనమైపోతుందని తెలిసికూడా నువ్వు చేసిన ధైర్యం నాకు ఎంతగానో నచ్చింది."

ఉన్నట్లుండి ఒక సన్నపాటి కంఠం ప్రక్కనుంచి వినిపించేసరికి తల తిప్పి చూశాడు షాడో.

అందరి మాదిరిగా ఏడుపు ముఖాలతో తల వంచుకు కూర్చోకుండా అతని మాదిరిగానే చురుకుగా కదులుతూ, బయటికి తొంగి చూస్తోంది ఒక బందీ.

బొద్దుగా ముద్దుగా వున్న ఆమె ముఖంలోకి చూస్తూ అప్పటికప్పుడు ఒక ఉపాయాన్ని ఆలోచించాడు షాడో. దగ్గిరికి రమ్మని సైగచేసి, ఆమె చెవిలో చెప్పాడు.

"కస్టమర్స్ వచ్చిరాగానే మన పాదాలకు బిగించిన గొలుసుల్ని తొలగించేస్తారు వీళ్ళు. వరుసల్లో తీసుకుపోయి వేదిక మీద నిలబెడతారు. ధైర్యం వున్న వాళ్ళు తప్పించుకోగలిగిన సమయం అదే...

కాస్తంత కష్టపడితే మిగిలిన వాళ్ళను కూడా రక్షించే అవకాశం వుంటుంది."

రెండు నిముషాల పాటు దీర్ఘంగా ఆలోచించి తల వూపింది ఆమె...

ఉత్సాహాన్ని ఆపుకోలేక ముందుకు వంగి ఆమె బుగ్గని ముద్దాడబోయాడు షాడో.

అంతలోనే పాక బయట చెలరేగింది ఒక కలకలం...

"కస్టమర్స్ వచ్చేస్తున్నారు... బందీలను బయటికి తీసుకురండి..." పెద్దగా వినిపించింది దృఢకాయుల నాయకుడి కంఠం.

తన నూతన స్నేహితురాలిని అక్కడే వదిలి పాక వెనుక భాగంలోకి జరిగాడు షాడో. అందరికీ దూరంగా వంటరిగా కూర్చున్నాడు.

పది క్షణాల తరువాత లోపలికి వచ్చారు నలుగురు దృఢకాయులు. షాడో చెప్పినట్లే బందీల పాదాల్ని విడిపించి, బయటికి నెట్టటం మొదలుపెట్టారు.

మూడొంతుల మంది అవతలికి పోయేదాకా ఆగి, మెల్లిగా వరుసలో కలిసింది షాడో ఫ్రెండ్... పాక బయటికి అడుగు పెట్టీ పెట్టగానే, కాలు మెలికపడినట్లు ముందుకు తూలింది.

చటుక్కున ఆమె చేయి పట్టుకుని పైకి లాగబోయాడు ఒక దృఢకాయుడు.

పటపటమని పళ్ళు కొరుకుతూ అతని చేతుల్ని విదిలించి కొట్టిందామె.

"ఒంటరిగా దొరికానని నా చేతిని పట్టుకుంటావా? నీ గుడ్లు పీకేస్తాను. నీ పళ్ళు రాలగొట్టేస్తాను..." అని అరుస్తూ అతని మీద కలబడింది.

అనుకోని విధంగా మొదలైన ఆ గోలకు కాస్తంత కంగు తిన్నాడా వ్యక్తి. ఆమె నోటిని గట్టిగా అదమటానికి ప్రయత్నించాడు.

ఆడ చిరుతలా ఆవేశపడిపోతూ ఆ ప్రయత్నాన్ని కూడా వమ్ము చేసిందామె. మరింత బిగ్గరగా కేకలు పెడుతూ బందీల మధ్యకు పరుగు తీసింది.

ఆమె మూలకంగా తమకు కూడా దెబ్బలు తగులుతాయన్న భయంతో చిందర వందర అయ్యారు బందీలందరూ.... వరుసను వదిలేసి తలా ఒక ప్రక్కకి చెదిరిపోవటం మొదలుపెట్టారు.

చూస్తూ నిలబడితే వారిని కంట్రోల్ చేయటం కష్టం అవుతుందనే అనుమానంతో గాలిలో ఝళిపిస్తూ అటుకేసి పరిగెత్తారు పాకలోకి వచ్చిన వారిలో ముగ్గురు దృఢకాయులు.

అందరికీ దూరంగా ఒక మూలగా కూర్చున్న షాడో పాదాల్ని వదిలిస్తున్నాడు నాలుగో వ్యక్తి... బయట చెలరేగిన గోలను ఆలకించటానికి తలను కాస్తంత ప్రక్కకు తిప్పాడు.

చెప్పిన పనిని చెప్పినట్లుగానే చేసి చూపిస్తున్న తన ఫ్రెండ్ తెలివి తేటలకు మురిసిపోతూ వేగంగా కదిలాడు షాడో... చర్మపు తాళ్ళు కట్టి వున్న చేతుల్ని పూలదండ మాదిరి అతని మెడలో వేసి తనకేసి లాగాడు.

అదిరిపడి వెనక్కి దూకటానికి ప్రయత్నించాడా వ్యక్తి.

గుండెల నిండా వూపిరి పీల్చుకుంటూ తలను బలంగా విసిరాడు షాడో.

కుంగ్ ఫూ పాట్రన్స్‌ని ప్రాక్టీస్ చేసే సమయంలో అడుగు మందం, అడుగు కైవరం కలిగివున్న మంచు దిమ్మల్ని ఢీ కొట్టి కొట్టి బండబారిపోయిన నుదురు అతనిది.

మంచు దిమ్మ మాదిరిగానే పగిలిపోయిందా వ్యక్తి ముఖం. రెల్లు దుబ్బుల పాక దద్దరిల్లి పోయేటట్లు అరవటానికి ప్రయత్నం చేస్తూ వుండగానే స్పృహ తప్పి క్రిందికి జారిపోయాడు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన చేతుల్ని వెనక్కి తీసుకుని అతని దుస్తుల్ని తడిమాడు షాడో.

రివాల్వర్ వంటి ఆయుధం ఏది అగుపించలేదుగాని, పదునైన కైజారు కనిపించింది... రెండు వందల దీనారాల విలువ చేసే కరెన్సీ నోట్లున్న చిన్న మనీ పర్స్ లభించింది.

కైజారును కాలివేళ్ళమధ్య నిలబెట్టి ముందుగా తన చేతులకున్న బంధనాల్ని వదిలించుకున్నాడు... పాంటు జేబులోనుంచి సిగరెట్ లైటర్‌ని తీశాడు.

పట్టుబడగానే అతన్ని బంధించి కొరడాలతో హింసించటానికి చూశారేగాని, దోపిడీ దొంగల మాదిరి అతని జేబుల్ని చెక్ చేయలేదు ఆ దృఢకాయులు. వారి తెలివి తక్కువ తనానికి ఎంతగానో సంతోషిస్తూ, లైటర్ బటన్‌ని ప్రెస్ చేశాడతను. బుస్సుమని శబ్దం చేస్తూ బయటికి వచ్చిన మంటతో పాక నాలుగు మూలలకు నిప్పు ముట్టించాడు.

తాచుపాములు ప్రయాణం చేసినట్లు వేగంగా కదిలి పాక మొత్తాన్ని అలుముకున్నాయి అగ్నిజ్వాలలు. ఒకటి నుండి పది అంకెలు లెక్క పెట్టేలోగా పైకప్పు మీదికి పోయి నిట్టనిలువుగా ఆకాశంలోకి లేచాయి.

తొక్కిసలాడుకుంటున్న బందీలను చెదరగొట్టి వారి మధ్యలో దూరిన షాడో ఫ్రెండ్‌ని బలవంతంగా ఇవతలికి లాగారు పాక దగ్గిర్నించి పరిగెత్తిన దృఢకాయులు.... క్రిందికి నెట్టి తలా ఒక దెబ్బ వేయటానికి రెడీ అవుతుండగా ఫటేల్మని శబ్దం చేస్తూ పగిలాయి పాక పైకప్పుకు

ఉపయోగించిన వెదురుగడలు. తారాజువ్వల మాదిరి నిప్పురవ్వల్ని వెదజల్లుతూ పోయి బందీల మీద పడ్డాయి వాటిలో రెండు.

వెంటనే వచ్చేసింది షాడో ఎదురు చూస్తున్న ఎఫెక్ట్.

ప్రాణభయంతో బెంబేలెత్తి పోతూ చట్రాతి మీద కొట్టిన చిల్ల పెంకుల్లా చెల్లాచెదరు అయ్యారు వాళ్ళు. అడ్డుగా నిలబడివున్న దృఢకాయుల్ని తలలతో కుమ్మి , తలా ఒక ప్రక్కకీ పారిపోవటం మొదలు పెట్టారు.

పిచ్చి పట్టిన వాడిలా రంకెలు వేస్తూ వస్తున్న దృఢకాయుల నాయకుడిని గమనించి, పాక ఎంట్రన్స్‌లోనుంచి బయటికి దూకాడు - అప్పటివరకూ ముఖం పగిలిన దృఢకాయుడిని కౌగలించి పట్టుకొని, పళ్ళబిగువున మంటల వేడిమిని భరిస్తున్న షాడో.

పాక మీద స్వైరవిహారం చేస్తున్న మంటల వెలుగు పడి తళతళ లాడిపోతోంది అతని చేతిలోని కైజారు... ఒకే ఒక పోటుతో నాయకుడి ప్రాణాల్ని అనంత విశ్వంలోకి పంపించేయాలన్న కచ్చతో రగులుకుపోతోంది అతని గుండె.

అదే సమయంలో ఉరుములు ఉరిమినట్లు మరోసారి భీకరమైన శబ్దాల్ని వెలువరించాయి పాక మీది వెదురుగడలు.

మరఫిరంగులలోనుంచి వెలువడినట్లు వేగంగా గాలిలోకి లేచాయి ఇంకో నాలుగు గడలు.

కైజారును దృఢకాయుడి గుండెలకు గురిచూసే ఆలోచనను అర్జంటుగా విరమించేసుకొని, హడావుడిగా అవతలికి జంప్ చేశాడు షాడో.

రెండు క్షణాలు ఆలస్యంగా గమనించాడు దృఢకాయుల నాయకుడు ముంచుకు వస్తున్న ఆ ప్రమాదాన్ని.

రెండు అడుగులు కూడా అవతలికి వేయకముందే ఏటవాలుగా క్రిందికి వచ్చేసింది నిప్పు రవ్వల్ని వెదజల్లుతున్న గడ ఒకటి... పదునైన బరిశె మాదిరి అతని వెన్నుమీద దిగబడి ముందు భాగంలోనుంచి బయటికి పొడుచుకు వచ్చింది.

ఆకాశం బ్రద్దలైపోయేటట్లు అరిచాడతను... క్రింద పడి గిలగిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలేశాడు.

ఆ దృశ్యాన్ని చూసి అన్‌స్టడీ అయిపోతున్న కస్టమర్స్ మధ్యలోకి పరుగు తీశాడు షాడో. కైజారును గిరగిరా తిప్పుతూ అందిన వాళ్ళను అందినట్లు నాలుగు పోట్లు పొడిచాడు.

అక్కడితో అంతా అయిపోయింది కస్టమర్స్ అసందిగ్ధ పరిస్థితి. అక్కడే నిలబడి వుంటే రాక్షసుడి మాదిరి చెలరేగిపోతున్న ఆ

బందీ చేతిలో ప్రాణాలు పోగొట్టుకోవటం తప్పనిసరి అని అర్థమై, కూడబలుక్కున్నట్లు ఒకేసారి వెనుతిరిగారు వారందరూ.

వారిని మాత్రమే కాదు - అక్కడక్కడా తటస్థపడిన దృఢకాయుడి అనుచరుల్ని కూడా వెన్నంటి, చెమటలు కక్కించేశాడు షాడో.

"మీ కాళ్ళకి చేతులకి ఇనుపగొలుసులు తగిలించి గాజానగరంలో కంచర గాడిదల్ని అమ్మినట్లు అమ్మకపోతే మారుపేరు పెట్టుకుంటాను. ఆగండి బే... ఆగండి" అని ... పొలికేకలు పెడుతూ ఆ చుట్టుపట్ల ఎక్కడా కనిపించకుండా తరిమి తరిమి కొట్టాడు.

"ఏ జన్మలోనో మేము చేసుకున్న పుణ్యం మూలకంగా నువ్వు మాతో పాటు బంధించబడటం జరిగింది. నువ్వు లేకపోయినట్లయితే సర్వనాశనం అయిపోయేవాళ్ళం మేము. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావటం లేదు." ఇసుక గుట్టల చాటునా, కలబంద పొదల మాటునా తల దాచుకున్న బందీల మధ్యలో నుంచి ముందుకు వస్తూ ఆర్ద్రంగా అన్నాడు ఒక మధ్యవయస్కుడు.

వట్టిగా అనటంతో ఆగలేదతను. షాడో చేతిలోని కైజారు సాయంతో తన చేతులకున్న బంధనాలను వదిలించుకుని, అతన్ని గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. పెద్ద శబ్దం వచ్చేటట్లు బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు.

మిగిలిన బందీలు కూడా అదే మాదిరి ప్రవర్తిస్తారన్న భయంతో, కైజారును అతని చేతిలో పెట్టి, గబగబా వెనక్కి జరిగాడు షాడో.

"నువ్వు ఎక్కడికి పోవాలి బేటా?" అతను అప్పచెప్పిన పనిని పూర్తి చేసి కైజారును రిటన్ చేస్తూ అడిగాడు మధ్యవయస్కుడు.

"ఇస్తాఫ్ నగరానికి పోవాలి"... చుట్టూ వున్న ఇసుక దిబ్బల్ని పరిశీలనగా చూస్తూ యధాలాపంగా అన్నాడు షాడో.

చేతిని జాచి ఒక మూలకి చూపించాడు మధ్యవయస్కుడు. నాలుగు ఫర్లాంగులు నడిస్తే అగుపించే ఒక తారు రోడ్డును గురించి చెప్పాడు.

"దోపిడీ దొంగలు సంచరిస్తూ వుండే ప్రదేశం అది. జాగ్రత్తగా వుండకపోతే నిన్ను కూడా దొంగగానే భావించి అపకారం తలపెట్టవచ్చు ఆ రోడ్డు మీద ప్రయాణం చేసే ప్రయాణీకులు...." అనికూడా అన్నాడు.

అందమైన అరబ్బీ భాషలో అతనికి కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు షాడో.... అక్కడి నుంచి అవతలికి పోయే ప్రయత్నం మాత్రం చేయలేదు.

"ఇంకేం కావాలి బేటా నీకు? ఎవరికోసమైనా ఎదురు చూస్తున్నావా?" బందీలందర్ని వెంటబెట్టుకుని తమ దారిన తాము పోవటానికి సిద్ధపడుతూ, అతన్ని ప్రశ్నించాడు మధ్యవయస్కుడు.

తను వేసిన పథకం సూపర్ సక్సెస్ కావటానికి కారకురాలైన తన ఫ్రెండ్ కోసం చూస్తున్నాడు షాడో....

"పట్టుబడిన దగ్గర్నించీ ఏదో ఒక విధంగా పారిపోవటానికే ప్రయత్నిస్తూ వచ్చింది ఆ పిల్ల... అయాచితంగా వచ్చిన అవకాశాన్ని ఎలా వదులుకుంటుంది? ఈ పాటికి నాలుగు మైళ్ళు దూరం వెళ్ళిపోయినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు." రెండు క్షణాల తరువాత అసలు విషయాన్ని అర్థం చేసుకుని, తనలో తను నవ్వుకుంటూ అన్నాడు మధ్యవయస్కుడు.

తన ఫ్రెండ్ తప్పించుకు పారిపోగలిగినందుకు సంతోషంగానే వున్నా, ఎందుకనో ఒక విధమైన నిరుత్సాహానికి గురి అయింది షాడో అంతరంగం.

గాఢంగా నిట్టూర్చి, ఆమెకు సంబంధించిన ఆలోచనల్ని మనసులో నుంచి తుడిచి వేసుకున్నాడతను... కైజారును పాంటు బెల్టు వెనుక దాచుకుంటూ వేదిక దగ్గిరికి బయలు దేరాడు.

జారిపోయిన ధైర్యాలను కూడగట్టుకుని, దృఢకాయుడి అనుచరులెవరైనా మరోసారి తమను అప్పగించటానికి ప్రయత్నిస్తే, ఎదురు తిరిగి యుద్ధం చేయటానికి నిశ్చయించుకొంటూ ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టారు మధ్యవయస్కుడి నాయకత్వంలో ఏకమైన బందీలు.

దృష్టి పథం నుంచి వారందరూ దూరమయ్యేదాకా ఆగి, దృఢకాయుల నాయకుడి దగ్గిరికి పోయాడు షాడో. వేదిక సమీపంలో దొరికిన కొన్ని చర్మపు తాళ్ళను అతని పాదాలకు తగిలించి, ముళ్ళకంపను ఈడ్చినట్లు ఈడ్చుకుంటూ బయలుదేరాడు.

నాలుగు ఫర్లాంగులు కూడా పూర్తిగా పోకముందే ఎదురయిందతనికి మధ్యవయస్కుడు సూచించిన తారు రోడ్డు.

మంచిగా వున్న ఒక మలుపును ఎంచుకొని నాయకుడి శరీరాన్ని రోడ్డు మధ్యలో వదిలేశాడతను. రోడ్డుకు ఆవలి ప్రక్కన వున్న ఒక ఇసుక దిబ్బ చాటుకు పోయి మోకరించి కూర్చున్నాడు.

అరగంట తరువాత అటుగా వచ్చింది హెవీ లోడ్‌ని మోస్తున్న ఒక లారీ... మలుపు తిరిగీ తిరగగానే అగుపించిన మానవ శరీరాన్ని చూసి, ఖంగారుగా బ్రేకుల మీద కాలు వేశాడు డ్రయివర్.

క్షణం ఆలస్యం చేయకుండా లేచాడు షాడో... కన్ను మూసి కన్ను తెరిచేటంతలో లారీ వెనుకభాగంలోకి చేరుకున్నాడు. క్రిందికి

వ్రేలాడుతున్న టార్పాలిన్ అంచుల్ని పట్టుకుని అదే స్పీడుతో పైకి ఎగబ్రాకాడు.

## 7

"రండిసాబ్... రండి.... రండి... అందరూ రండి..."

సత్తురేకుతో చేయబడిన బూరా వంటి గొట్టాన్ని మైక్ మాదిరిగా నోటిదగ్గర పెట్టుకుని బిగ్గిరిగా అరిచాడు ఇస్తాఫ్ నగరం హోతిం వీధిలోని సెకండ్ హేండ్ దుస్తుల్ని అమ్మే షాపు ఓనర్.

"అందమైన రజాయిలు - సున్నితమైన షేర్వాణీలు, ముద్దు ముద్దు కుర్తాలు - ముఖమల్ పావడాలు... రండి సాబ్... వచ్చి చూడండి... చూసి ఖరీదు చేయండి." వీధిలో నడుస్తున్న ఆడమగ అందర్నీ తన వాక్చాతుర్యంతో ఆకట్టుకోవటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాడతను.

పాంటు జేబులో వున్న మనీ పర్సును తీసి పది దీనారాలు విలువచేసే కరెన్సీనోట్లను చేతులో పెట్టుకున్నాడు షాడో.... ఠీవిగా అడుగులు వేస్తూ దుకాణంలోకి పోయాడు.

రెల్లుదుబ్బుల పాక దగ్గిర చేసిన ఎడ్వెంచర్ కారణంగా పూర్తిగా పాడయిపోయాయి అతని దుస్తులు. లారీ వెనుక భాగంలో

ప్రయాణం చేయటం వల్ల ఇస్తాఫ్ నగరంలో శానిటరీ పనులు చేసే వర్కర్స్ కంటె దారుణంగా మారిపోయి వుంది అతని అవతారం.

"పోటుగాడి మాదిరి ఫోజు పెట్టి లోపలికి రాగానే సరిపోదు... డబ్బులు వున్నాయా నీ దగ్గర?" క్రిందినించి పైదాకా పట్టి పట్టి చూసి, అసహ్యకరంగా నొసలు విరుస్తూ అడిగాడు, అరుపుల్ని ఆపి లోపలికి వచ్చిన షాపు ఓనర్.

లాగిపెట్టి నోటి మీద ఒకటి ఇచ్చుకోవాలన్న కోరికను బలవంతంగా అదుముకుంటూ, చేతిలో వున్న నోట్లను చూపించాడు షాడో.

అయిష్టంగానే కదిలి, ఒక గోడకు వ్రేలాడుతున్న పాంటు షర్టుల్ని తీసి అతని ముందు పడవేశాడు షాపు ఓనర్... అతని చేతుల్లో వున్న నోట్లను తీసేసుకుని దుకాణం వెలుపలికి వెళ్ళిపోయాడు.

నాలుగు అడుగుల దూరంలో ఇంకో గోడకు వ్రేలాడుతున్న ఖరీదయిన దుస్తుల జతను గమనించాడు షాడో.... హస్తలాఘవం చూపించి వాటిని కూడా స్వంతం చేసుకుంటే బాగుంటుందని అనిపించింది అతనికి...

పట్టుబడటం అంటూ జరిగితే అనవసరమైన చిక్కుల్లో ఇరుక్కోవటం జరుగుతుందని, బలవంతంగా అదుముకున్నాడు ఆ కోరికని...

మురికి పట్టి, దుర్వాసన వెదజల్లటం ప్రారంభించిన దుస్తుల్ని అక్కడే వదిలేసి షాపు ఓనర్ తన పాదాల దగ్గర పడవేసిన పాంటు షర్టుల్ని ధరించాడతను. కైజారు బయటికి కనిపించకుండా బెల్టు వెనుక భద్రపరుచుకుంటూ వీధిలోకి వచ్చాడు.

వెంటనే అతని నాసికాలకు సోకింది ఒక సువాసన.

దుస్తుల దుకాణానికి పది అడుగులు అవతలగా, వీధికి రెండో వైపున వున్న తినుబండారాల షాపులోనుంచి వస్తోంది అది...

సరైన ఆహారం తీసుకుని ఎన్ని రోజులయిందో గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ అటుకేసి అడుగులు వేశాడు షాడో... ఖాళీగా కనిపించిన ఒక కుర్చీలో కూర్చుని తేనెతో తడిపిన రొట్టెలకు ఆర్డర్ ఇచ్చాడు.

"ఇరవై రెండు దీనారాలు అవుతాయి... డబ్బులు వున్నాయా?" వెంటనే అడిగాడతన్ని ఆర్డర్ తీసుకోవటానికి వచ్చిన వెయిటర్.

డబ్బు చూపిస్తే గాని ఆ సిటీలో ఏ పనీ జరగదేమోనన్న అనుమానం వెంటనే అడుగుపెట్టింది షాడో హృదయంలోకి. ఆర్గ్యుమెంట్ పెట్టుకుని అనుమాన నివృత్తి చేసుకోవాలని కూడా అనిపించింది గాని, కస్టమర్స్ దగ్గిర్నుంచి కేష్ వసూలు చేసే టేబిల్ దగ్గిర నిలబడి వున్న నలుగురు ఆజానుబాహుల్ని చూడగానే ఆ ఆలోచనకి బ్రేకులు పడిపోయాయి.

రుచికరమైన పదార్థాల్ని ఆరగించిన ఆనందంలో, కస్టమర్స్ ఎవరైనా గొడవ పెట్టుకోవటానికి ప్రయత్నిస్తే, వెంటనే రంగంలోకి దిగేందుకు నియమించబడిన బౌన్సర్స్ వాళ్ళు... వీపు విమానం మోత మ్రోగేటట్లు విరగబాది వీధిలోకి నెట్టటం వారి స్పెషాలిటీ....

తన మనసులోని ఆలోచనలన్నిటినీ తనలోనే అదుముకుని మళ్ళీ మనీ పర్సును బయటికి తీశాడు షాడో. వెయిటర్ సూచించిన మొత్తాన్ని టేబిల్ మీద పెట్టి ప్రశ్నార్థకంగా కనుబొమ్మలు ఎగురవేశాడు.

రెండోమాట మాట్లాడకుండా నాలుగు రొట్టెల్ని తెచ్చి అతని ముందు పెట్టాడు వెయిటర్... పావులీటరు తేనెనుకూడా తీసుకువచ్చి ఆ రొట్టెల మీద కుమ్మరించాడు.

వంచిన తల ఎత్తకుండా మూడు రొట్టెల్ని ఆరగించాడు షాడో. నాలుగో రొట్టె మీద చేయి వేయబోతుండగా కనిపించింది - కేష్ కౌంటర్

దగ్గర వున్న బౌన్సర్స్ పెద్ద పెద్ద అడుగులు వేస్తూ షాపు వెనుక భాగములోకి పోవటం.

వారు కదలటానికి కారకులైన కస్టమర్స్ ఎవరో చూడాలని అనిపించినా, బలవంతంగా ఆ కోరికను దిగమ్రింగుకుని, దృష్టిని ఎదుట వున్న రొట్టె మీదే కేంద్రీకరించాడు షాడో.

అంతలోనే అతని చెవికి చేరింది ఆ కంఠం.

"నాలుగు దీనారాలు విలువచేసే ఎండు రొట్టెల మీద బెల్లపు పాకాన్ని కుమ్మరించి ఇరవై రెండు దీనారాలు వసూలు చేస్తారా! ఎదురు తిరిగి అడిగితే, జనాల్ని తీసుకువచ్చి ఉసికొల్పుతారా? వళ్ళు ఎలా వుంది మీకు? చిమ చిమ లాడిపోతోందా??"

గోరు వెచ్చటి నీటిలో గొంతువరకు నిలబడిన సుఖకరమైన సెన్సేషన్ ఒకటి వెంటనే అలుముకుంది షాడోని. అతనికి తెలియకుండానే కాస్తంత వేగంగా కొట్టుకోవడం మొదలు పెట్టాయి గుండెలు.

చేతిలోకి తీసుకున్న రొట్టెను తిరిగి ప్లేటు మీద పడేస్తూ వెనుతిరిగి చూశాడతను.

అతని కంటె చాలా ముందుగా నగరంలోకి వచ్చింది కాబోలు - జగన్మోహిని మాదిరిగా డ్రసప్ అయింది బొద్దుగా ముద్దుగా వుండే అతని దోస్త్.

తలారా స్నానం చేసి, సాంబ్రాణి ధూపం వేయటం వల్ల బిగువు సడలి ముఖం మీదికి వాలుతున్న ముంగురుల్ని ఎడమ చేత్తో వెనక్కి నెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ, వాదులాడుతోంది, తన టేబిల్ ముందున్న వెయిటర్‌తో.

చూస్తూ చూస్తూ వుండగానే మాటల స్థాయిని దాటిపోయింది ఆ తగాదా.

ఉన్నట్లుండి ముందుకు వంగి, ఆమె చేతిని పట్టుకున్నాడు వెయిటర్. బలంగా ఇవతలికి లాగి ప్రక్కనే వున్న గోడ కేసి కొట్టాడు.

"తీసుకుపొండి.... తీసుకుపోయి వీధిలోకి నెట్టండి... మర్యాదస్తులు తప్ప మరెవ్వరూ అడుగు పెట్టని నా దుకాణంలోకి వచ్చి గలాటా చేసినందుకు శిక్ష అనుభవించాల్సిందే... తీసుకుపొండి..." కేష్ కౌంటర్ వెనుకనుంచి బిగ్గరిగా అరిచాడు షాపు ఓనర్.

తన దోస్త్‌కి జరుగుతున్న అవమానం తనకు జరుగుతున్నట్లే ఫీల్ అయిపోతూ కుర్చీలోనుంచి లేచాడు షాడో.

"అందమైన ఆడపిల్ల తెలిసో తెలియకో ఏదో ఒక్కమాట అన్నందుకు బాగ్దాద్ నగరంలోని న్యాయాధికారి మాదిరిగా శిక్షలు విధిస్తావా? నువ్వెంత నీ బతుకెంత?" అంటూ రెండు అంగల్లో కేష్ కౌంటర్‌ని చేరుకున్నాడు.

జల్తారు పని చేయబడిన ఓనర్ అంగీని గట్టిగా పట్టుకుని బలంగా ముందుకు లాగాడు. పిడికిలితో నాలుగు పోట్లు వెన్ను మీద పొడిచి క్రిందికి నెట్టాడు.

"రండిరోయ్ రండి... వచ్చి వీడి అంతు చూడండిరోయ్..." భరించరాని బాధతో విలవిలలాడిపోతూ, దుకాణం దద్దరిల్లి పోయేటట్లు అరిచాడు ఓనర్.

షాడో స్నేహితురాలిని వదిలేసి వెనక్కి పరిగెత్తుకు వచ్చారు పోయినోళ్ళ మాదిరి అటుకేసి పోయిన బౌన్సర్స్.

అంతకు ముందే ఆరగించిన తేనె రొట్టెలు తన జవసత్వాల్ని అధికం చేస్తున్నట్లు అనుభూతిని పొందుతూ తొడ చరిచాడు షాడో... ఎడమపాదంతో దుకాణం ఫ్లోరింగ్‌ని తన్ని సింహనాదం చేశాడు.

అక్కడితో అంతమయిపోయింది అక్కడ నెలకొని వున్న ప్రశాంత వాతావరణం. గావుకేకలు పెడుతూ కుర్చీలలోనుంచి లేచారు మిగిలిన కస్టమర్స్. తమ ముందున్న ప్లేట్లను చేతుల్లో పట్టుకుని దుకాణం బయటికి పరుగులు తీయటం మొదలు పెట్టారు.

అడ్డు వచ్చిన నాలుగు టేబిల్స్‌ని విరగదన్నాడు షాడో... మూడు కుర్చీలను గోడల కేసి విసిరాడు. రెండే రెండు దెబ్బలతో ఇద్దరు బౌన్సర్స్‌ని అడ్డు తొలగించుకుని, మూడోవ్యక్తి ముఖం పగిలిపోయేటట్లు,

పిడిగుద్దులు ప్రసాదించాడు. అదిరిపడి వెనుకంజ వేయబోయిన నాలుగో మనిషిని అమాంతంగా గాలిలోకి ఎత్తి కేష్ కౌంటర్ మీదికి విసిరాడు.

వరుసల్లో పేర్చి వున్నాయి అక్కడ అందమైన పింగాణీ ప్లేట్లు... గలగల మని మ్రోతలు చేస్తూ క్రింద పడి ముక్కలు ముక్కలైపోయాయి.

ఎంతో అపురూపంగా చూసుకునే తన దుకాణం తన కళ్ళముందే సర్వనాశనం అయిపోతూ వుండటాన్ని భరించలేక జుట్టు పీక్కున్నాడు ఓనర్... జలతారు అంగీని చింపుకుంటూ వీధిలోకి పరుగుతీశాడు.

పట్టెడు పట్టెడు లావున్న కట్టె పేళ్ళను పట్టుకుని కిచెన్‌లో నుంచి బయటికి రాబోతున్న నలుగురు వంటవాళ్ళను గమనించి, అటుకేసి పోబోతున్న షాడోని వెంటనే ఆపేసింది అతని ఫ్రండ్.

"పోలీసుల్ని తీసుకు రావటానికి పోయివుంటాడు ఓనర్... వాళ్ళు వస్తే పరిస్థితి చాలా ప్రమాదకరంగా మారుతుంది" అని హెచ్చరించింది.

హెచ్చరిక ఆమె పెదవుల్ని దాటుతూ వుండగానే వినవచ్చాయి నాలుగు పోలీస్ విజిల్స్...

దగ్గర్లో వున్న మరో రెండు టేబిల్స్‌ని కసిదీరా తన్ని, తన ఫ్రెండ్ చేయి పట్టుకున్నాడు షాడో... కిచెన్‌కి పక్కభాగంలో అగుపించిన ఒక సందువంటి ఎంట్రన్స్‌లో నుంచి బయటికి పరుగుతీశాడు.

"వెయ్యి దీనారాలు ఇస్తాను... ఆ సైతాన్ని పోలీసులకు పట్టిచ్చిన వాళ్ళకి రెండు నెలలపాటు తేనె రొట్టెల్ని ఉచితంగా పెట్టిస్తాను... కదలండి అందరూ... కదిలి వాడిని పట్టివ్వండి." నలుగురు కానిస్టేబిల్స్‌ని వెంట బెట్టుకుని, నాలుగు క్షణాలు ఆలస్యంగా అక్కడికి వచ్చిన షాపు ఓనర్ గొంతు చించుకుని అరిచాడు.

వంటావార్పుల్ని వదిలేసి కట్టెపేళ్ళను పట్టుకున్నారు కిచెన్‌లో పనిచేసే అతని వాళ్ళందరూ... తమకు తగిలిన దెబ్బలకు ట్రీట్‌మెంట్ కూడా తీసుకోకుండా వీధిలోకి వచ్చారు బౌన్సర్స్.

నాలుగే నాలుగు నిముషాల్లో పోగయింది పెద్ద గుంపు... ఎదురైన ప్రతి పౌరుడికి షాడో పోలికల్ని వివరించి చెపుతూ గాలింపు కార్యక్రమాన్ని స్టార్ట్ చేశారు అందరూ.

* * * * *

"నా మర్యాదను కాపాడటం కోసం చాలా పెద్ద రిస్క్‌ని తీసుకున్నావ్ దోస్త్! నిర్భయంగా వీధుల్లో తిరిగే అదృష్టాన్ని దూరం చేసుకున్నావ్..."

ఇస్తాఫ్ నగరం టూ టవున్‌లో ఒక సందు మొగదల నిలబడుతూ లోగొంతుకతో అన్నది షాడో ఫ్రెండ్.

అక్కడికి వందగజాల దూరంలో వున్న మెయిన్ రోడ్డు మీదికి వచ్చేసింది షాడో కోసం గాలిస్తున్న గుంపు... జట్లు జట్లుగా చీలి సందుల్లోకి, గొందుల్లోకి వచ్చేసేటట్లున్నది ఆ గుంపులోని వారి వాలకం.

మనీ పర్సులోనుంచి మరో రెండు దీనారాల్ని బయటికి తీసి దగ్గర్లో వున్న బడ్డీకొట్టు దగ్గిరికి పోయాడు షాడో. అల్జీరియన్ సిగరెట్ పాకెట్‌ని ఖరీదు చేసి సిగరెట్ వెలిగించుకున్నాడు.

"ఇక నువ్వు ఇస్తాఫ్ నగరంలో నిలువ వుండటం మంచిది కాదు మై ఫ్రెండ్... చీకటి పడే దాకా తల దాచుకుని ఇంకెక్కడికయినా వెళ్ళిపోవటం చాలా ఉత్తమం..." అతని ప్రక్కకు వస్తూ మరోసారి తన అభిప్రాయాన్ని వెల్లడించింది అతని స్నేహితురాలు.

చేతిలోని సిగరెట్ వెలువరిస్తున్న పొగల మాదిరిగానే సుడులు తిరుగుతూ పరిభ్రమిస్తున్నాయి షాడో ఆలోచనలు.

ఎక్కడికి పోగలడు తను ఇస్తాఫ్ నగరాన్ని వదిలి??

వచ్చిన పనిని పూర్తి చేయకుండా ఒక్క అడుగు కూడా అవతలికి వేయటం కుదురుతుందా??

"నీ వరస చూస్తుంటే ఏదో పెద్ద పని మీద ఇక్కడికి వచ్చినట్లు నాకు అనిపిస్తోంది అవునా??" తన మాటలకు అతని వద్ద నుంచి ఎటువంటి సమాధానము రాకపోవటంతో మళ్ళీ తనే మాటలు ప్రారంభించింది అతని ఫ్రండ్.

మెయిన్ రోడ్డు మీది గుంపును కనుచివరలనుంచి గమనించుకుంటూ సందు మధ్యభాగంలో వున్న పెద్ద పింగాణీ పాత్రల దుకాణం దగ్గిరికి పోయాడు షాడో.... పాత్రల్ని బేరం చేస్తున్నట్లుగా ఒక చివర మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

"ఇస్తాఫ్ నగరమంతా నాకు కొట్టిన పిండి... నువ్వు వచ్చిన పనేమిటో నాకు చెపితే క్షణాల మీద పూర్తి అయ్యే ఏర్పాట్లు చేస్తాను... చెప్పు దోస్త్... నువ్వు వచ్చిన పనేమిటో... చెప్పు" వాటర్‌లిల్లీలను పెంచటానికి ఉపయోగపడే ఫ్లవర్‌వాజ్‌ని చేతుల్లోకి తీసుకుంటూ రెట్టించి అడిగింది అతని ఫ్రండ్.

అలా చేయటంలోని సాధక బాధకాలను గురించి వితర్కించుకున్నాడు షాడో.

సముద్రపు వడ్డునుంచి పారిపోయి వచ్చిన టొయోటా సుందరి జాడలు తెలియాలి తనకి. తనెందుకు ఆమెను తరుముకు వస్తున్నాడో తన ఫ్రండ్‌కి తెలియచేయవలసిన అవసరం లేదు.

చేతిలోని సిగరెట్ చివరికంటా కాలి, చేతి వేళ్ళను చురుక్కుమనిపించే సమయానికి పూర్తి అయింది అతని ఆలోచన. కూర్చున్న చోటినుంచి లేచి, అక్కడికి పది గజాల దూరంలో కనిపించిన ఇంకో సందుకేసి బయలుదేరాడు.

"నా దుకాణంలో వున్న సామగ్రినంతా ఖరీదు చేసే వాళ్ళ మాదిరి ఫోజుగా వచ్చి నిలబడ్డారు... వట్టిగా చేతులు వూపుకుంటూ వెళ్ళిపోతున్నారా?? మీకసలు బుద్ధి వున్నదా??" సందు మొదటి దాకా వచ్చి చేతులు వూపుతూ అరిచాడు ఆ దుకాణం యజమాని.

పిడికిళ్ళు బిగించి వెనుతిరగబోయిన షాడో చేతిని గట్టిగా పట్టుకుని ముందుకు తీసుకుపోయింది అతని ఫ్రెండ్. రెండు నిముషాల తరువాత లోగొంతుకతో అతను చెప్పింది విని సాలోచనగా తల వూపింది.

## 8

"....కాలు లేని కుంటివాడిమీద కనికరం చూపించండి... అందరి మాదిరిగా కష్టపడి పని చేసుకునే అర్హత లేని ఈ దురదృష్టవంతుడికి ధర్మం చేయండి..."

మధ్యకు తెగిపోయినట్లున్న ఎడమ కాలిని ఊతకర్రకు తన్ని పెట్టి, కుడికాలి మీద గంతులు వేస్తూ కమ్మని కంఠంతో యాచించాడు ఇస్తాంబుల్ నగరం ముఖ ద్వారం దగ్గిర సంచరిస్తూ వుండే కుంటి ఖలీఫా.

తన మాటలకు కరిగిపోయి ధర్మం చేసిన వారిని మెచ్చుకుంటున్నాడు. తలలు తిప్పుకుని వెళ్ళిపోతున్నవారిని ఇష్టం వచ్చినట్లు తిట్టిపోస్తున్నాడు.

"పందుల మధ్య, ఎడారి నక్కల మధ్య పెరిగిన వాళ్ళు వీళ్ళు. తమ కడుపులు నింపుకోవటమేగాని, నాలాంటి వాళ్ళని గురించి పట్టించుకోరు..."

తనకేసి చూడనుకూడా చూడకుండా పోతున్న ఇద్దరు పౌరుల్ని గురించి కామెంట్ చేశాడతను ఒక వీధి దగ్గిర నిలబడి వున్న షాడో స్నేహితురాలితో.

తమ మాటలు ఆలకించే ఓపిక, తీరిక ఆ ప్రదేశంలో సంచరిస్తున్న పౌరులకు లేవని నిశ్చయం చేసుకుంటున్నది ఆమె. సానుభూతిగా తల వూపి, రెండు దీనారాల్ని తీసి అతని చేతిలో పెట్టింది.

"నాకు చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి... తృప్తికరంగా సమాధానం ఇస్తే ఇంతకింత బహుమానంగా ఇస్తాను" అంటూ మరో నాలుగు దీనారాల్ని అతనికి చూపించింది

వెంటనే మాయమైపోయింది కుంటి ఖలీఫా ముఖం మీద ప్లెజెంట్‌నెస్.

"నువ్వు పోలీసుల మనిషివా?" కనుబొమ్మలు లేపి చూస్తూ అడిగాడు.

కాదని తల అడ్డం తిప్పింది షాడో ఫ్రండ్.

"ముష్టి వేసినట్లు నాలుగు నాణేలు నాముఖం మీద పడేస్తే సరిపోతుందా? ఈ కుంటి ఖలీఫా పెదవులు విప్పి మాట్లాడాలంటే చాలా ఖర్చవుతుంది... కనీసం యాభై దీనారాలైనా ఇచ్చితీరాలి..." ఖరాఖండీగా చెప్పి తన దారిన తాను పోవటానికి సిద్ధమైనాడతను.

ముంచుకు వస్తున్న అసహనాన్ని అతి ప్రయత్నం మీద అదుముకుంటూ దుస్తులలోనుంచి యాభై దీనారాలు విలువ చేసే కరెన్సీ నోటును బయటికి తీసింది షాడో ఫ్రండ్.

పెట్రోమాక్స్ లైటు మాదిరి గుప్పున వెలిగింది కుంటి ఖలీఫా ముఖం.

"అడుగు... నీకేం కావాలో త్వరగా అడుగు" ఆమె చేతుల్లోని నోటును గభాలున లాక్కుని దుస్తుల్లో దాచుకుంటూ తొందర పెట్టాడు.

షాడో తనకు చెప్పిన మాటల్ని యధాతథంగా అతనికి వినిపించింది ఆమె... టొయోటా సుందరి పోలికల్ని, ఆమె డ్రయివ్ చేసుకుంటూ వచ్చిన జీప్‌ని సవివరంగా వర్ణించి చెప్పింది.

"ఆ పిల్ల ఈ నగరంలో ఎక్కడ బస చేసిందో ఎవరిని కలుసుకున్నదో నాకు తెలియాలి... ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తే ఇంకో పది దీనారాలు ఇమ్మన్నా ఇస్తాను" అని ఇంకా కొంచెం ఆశపెట్టింది.

కుంటి కాలిని ఊపుతూ ఛెంగున రెండు చిందులు వేసి, తన సంతోషాన్ని ప్రకటించాల్సిన కుంటి ఖలీఫాలో వెంటనే వచ్చింది విపరీతమైన మార్పు. చిందులు వేయక పోగా ఎడారి భూతాన్ని చూసినట్లు బెదురు చూపులు చూస్తూ వెనక్కి జరిగాడతను. అంతకు ముందే ఆమె ఇచ్చిన కరెన్సీ నోటును దీనారాల కాయిన్స్‌ని ఆమె మీదికి విసిరి హడావుడిగా వెనుతిరిగాడు.

"అడిగింది చెపుతానని మాట ఇచ్చావ్... బయానాకూడా తీసుకున్నావ్... మాట తప్పి వెళ్ళిపోవటం మంచిది కాదు..." నాలుగు అంగల్లో అతన్ని కలుసుకుంటూ కోపంగా అన్నది షాడో ఫ్రండ్.

"నీ బయానాకీ నీకు నాలుగు సలాంలు చేస్తాను. నోరు మూసుకుని నీ దారిన నువ్వు పోవటం చాలా మంచిది. నీకు నాకు ఎటువంటి సంబంధము లేదు..." ఆందోళనను కప్పి పెట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ ఒక్క క్షణం కూడా ఆగకుండా గబగబా అక్కడినుంచి దూరంగా వెళ్ళిపోయాడు.

"మనకు కావల్సిన ఇన్ఫర్మేషన్ వీడి దగ్గిర వున్నది. అందులో సందేహం లేదు." రోడ్డుకు ఆవలివైపున వున్న కాకా హోటల్‌లో

కూర్చుని చాయ్ తాగుతున్న షాడో దగ్గిరికి వస్తూ లోగొంతుకతో అన్నది అతని ఫ్రండ్.

"ఎవరూ చూడకుండా అవతలికి తీసుకుపోయి వీపు సాపు చేసేద్దాం." అన్నాడు షాడో.

"ఈ చుట్టుపట్ల సంచరించే బిచ్చగాళ్ళందరికీ తెలిస్తే కందిరీగల మాదిరి కమ్ముకుంటారు మనల్ని.... పోలీసుల దాకా పోయిందంటే ఇంకా ఇంకా బదనామ్ అయిపోతాం" క్రింది పెదవిని మునిపళ్ళతో నొక్కుకుంటూ అన్నదామె.

ముందుకు వంగి ఆ పెదవుల్ని ముద్దాడాలన్న కోరిక వెంటనే కలిగింది షాడోకి. కాకా హోటల్లోని వారందరూ తమ వంకే చూస్తూవుండటం వల్ల ఆ పని చేయలేక పోయాడతను.

ఉన్నట్లుండి పెద్దగా చిటికె వేసింది అతని ఫ్రండ్.

"నీ దగ్గర చిల్లర ఏమైనా వుందా?" కుర్చీలో నుంచి లేస్తూ అడిగింది.

అయిష్టంగానే మనీ పర్సును బయటికి తీసి, పాతిక దీనారాల విలువ చేసే నోట్లను అందించాడు.

వెయిటర్ తీసుకువచ్చి టేబిల్ మీద పెట్టిన చాయ్ కప్పుని రెండు గుక్కల్లో ఖాళీ చేసి బయటికి వెళ్ళిపోయిందామె. అరగంట తరువాత తిరిగివచ్చి, అతన్ని బయటికి రమ్మని సైగ చేసింది.

తాగిన చాయ్‌లకు బిల్లు చెల్లించి మెల్లిగా రోడ్డు మీదికి పోయాడు షాడో. ఆమె ఖరీదు చేసి తీసుకు వచ్చిన సామగ్రిని చూసేసరికి మతి పోయినంత పని అయింది అతనికి.

నడి వీధిలో నృత్యాలు చేసి పొట్టపోసుకునే ఎడారి మనుష్యులు ధరించే అంగీ ఒకటి వున్నది ఆ సామగ్రిలో. రిథమ్ కోసం వాళ్ళు ఉపయోగించే ఢమరుకం వంటి చిన్న డప్పు కూడా వున్నది.

అయోమయంగా చూస్తున్న షాడోకి ఆ అంగీని తొడగబెట్టి, ఆ వీధి చివర కనిపించిన ఖాళీ స్థలంలోకి లాక్కుపోయింది అతని ఫ్రెండ్.

"రండి బాబూ రండి... అమోఘమైన మా పనితనాన్ని చూడటానికి రండి... మా నేర్పరితనాన్ని చూసి మెచ్చుకోవటానికి రండి... రండి... రండి...'' రాగయుక్తంగా మాటలు మొదలు పెట్టి, గుండెలు ఝల్లు ఝల్లు మనేటట్లు డప్పుని మ్రోగించటం ప్రారంభించింది.

చూస్తూ వుండగానే పోగయ్యారు జనం.... అతని ఫ్రెండ్ వంకా, అతని వంకా వింతగా చూస్తూ ముందుకు ముందుకు వచ్చేయసాగారు.

"వెదురు దుబ్బుల పాక దగ్గిర నీ శక్తి ఏమిటో స్వయంగా చూశాను నేను.... వీళ్ళ మనసుల్ని రంజింప చేయటానికి ఏదయినా గలాటా ప్రారంభించు దోస్త్... సర్కస్ వాలా మాదిరి ఏవైనా ఫీట్లు చేయి..." డప్పుని ఢమ ఢమ లాడించటం ఆపకుండా పెదవుల చివర్లనుంచి హెచ్చరించిందామె.

తన ఆలోచన ఏమిటో విడమర్చి చెప్పకుండా జనాన్ని పోగుచేసి ఇరకాటంలో పెట్టినందుకు పళ్ళు పటపటమని కొరకబోయి, చుట్టూ వున్న జనాన్ని చూసి ఆగిపోయాడు షాడో.

"ఆలస్యం చేయకు దోస్త్.... ఆలస్యం చేసి పాదరక్షలు విసిరించుకునే పరిస్థితిని కల్పించబోకు...." రిథమిక్‌గా ఊగుతూ ఇంకోసారి హెచ్చరించింది అతని ఫ్రండ్.

తన ముఖంలోని కచ్చ ముఖంలో ప్రతిఫలించకుండా జాగ్రత్త పడుతూ చేతులు జాచి జనానికందరికీ సలాం చేశాడు షాడో... ఉన్నవాడు ఉన్నట్లుగా గాలిలోకి ఎగిరాడు.

పాదాలు నేలకు ఆనేలోపుగా నాలుగు పల్టీలు కొట్టింది అతని అథ్లెటిక్ బాడీ... తిరిగి నిట్టనిలువుగా గాలిలోకి లేచి బొంగరం మాదిరి గిర్రున తిరిగింది.

సముద్రపు హోరును మించి చెలరేగాయి చప్పట్లు. మెచ్చుకోలుగా ఈలలు వేశారు కొందరు... చిల్లర డబ్బుల్ని తీసి అతని మీదికి విసిరారు మరికొందరు.

అప్పుడు... వడగళ్ళ మాదిరి వచ్చి వంటికి తగిలిన చిల్లర నాణేలను చూసినప్పుడు అర్థం అయింది షాడోకి, తన స్నేహితురాలి ఆలోచన ఏమిటో.

పెద్ద శబ్దం వచ్చేటట్లు రెండు సార్లు చప్పట్లు కొట్టి, కుడి పాదంతో నేలను బలంగా తన్నాడతను. చెవులు చిల్లులు పడిపోయేటట్లు పొలికేక పెట్టాడు. ఖాళీ స్థలంలో వున్న ఒక పెద్ద కొండరాయిని అమాంతంగా పైకి లేపి అందరికీ చూపించాడు.

"కాస్తంత బలం వుంటే ఎవరైనా లేపగలరు ఆ రాయిని. నీ గొప్ప ఏముందని మాకు చూపిస్తున్నావ్?" అందరి కంటే ముందు వరుసలో నిలబడిన వృద్ధుడు ఒకతను వెంటనే అడిగాడతన్ని.

చేతుల్లో వున్న కొండరాయిని కాస్తంత ఎత్తుకు ఎగరేసి గుండెలు జలదరించేటట్లు షాట్ చేశాడు షాడో.... అది నేల మీద పడేలోపుగా గాలిలోకి ఎగిరి ఫెడీమని తన్నాడు.

బరువైన ఇనుప సమ్మెటతో బాదినట్లు విచ్చిపోయిందా రాయి. ముక్కలు ముక్కలై ఖాళీ స్థలమంతా పరుచుకున్నది.

మరోసారి చెలరేగాయి చప్పట్లు.... పది దీనారాల విలువచేసే కాయిన్స్‌ని తీసి షాడో తల మీద కుమ్మరించాడు అతని నేర్పుని శంకించిన వృద్ధుడు.

"కర్రలు తెప్పించండి బాబులారా... బలమైన రెండు కర్రల్ని వెంటనే తెప్పించండి... కనీ, వినీ ఎరుగని బల ప్రదర్శనని మీ కనులారా చూడటం కోసం వెంటనే కదలండి..." రెట్టించిన ఉత్సాహంతో పౌరుల్ని ఉద్దేశించి అన్నది షాడో ఫ్రెండ్.

కొత్త ఆలోచన ఏదో చేసి తన కొంప ముంచబోతున్నదని అర్థమై, వారించటానికి ప్రయత్నించాడు షాడో. చప్పట్లు పెద్దగా కొట్టి ఆమె మాటలు జనాల చెవులకు చేరకుండా అడ్డుకోవటానికి ప్రయత్నించాడు.

అయినా సరే ఉపయోగం ఏదీ లేకుండా పోయింది. అంత శబ్దంలోను ఆమె మాటల్ని ఆలకించి అవతలికి పరుగు తీశారు ఇద్దరు యువకులు.

లావుపాటి బాణాకర్రల్ని తెచ్చి ఆమెకు చూపించారు.

"కొట్టండి అతన్ని... మీ ఆగర్భ శతృవులు ఎవరినయినా అతనిలో ఊహించుకుంటూ విరగబాదండి..." అని ఎంకరేజ్ చేసింది.

ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించుకున్నది ఆ ప్రదేశాన్ని. ఊపిరి బిగపట్టి ఉత్సుకతగా చూడటం మొదలు పెట్టారు జనం.

యువకుల చేతుల్లోనించి ఒక కర్రను తీసుకుని తన ఫ్రండ్ నడుములు విరగిపోయేటట్లు రెండు దెబ్బలు వేయాలన్నంత కోపం షాడోని ఉక్కిరి బిక్కిరి చేసేసింది.

ఆమె కేసి ఉరిమి చూడబోతుండగా, చెమటలు పట్టిన చేతుల్ని దుస్తులకు తుడుచుకుని కర్రల్ని గట్టిగా పట్టుకున్నారా యువకులు.... చెరొక ప్రక్కకు జరిగి అతన్ని విరగబాదే కార్యక్రమాన్ని చేపట్టారు.

తను నేర్చుకున్న పోరాట విద్యలలోని మెలకువలన్నిటినీ గుర్తుకు తెచ్చుకుంటూ ఊపిరి బిగపట్టాడు షాడో...

ఎటువంటి దెబ్బ తగిలినా భరించగల ప్రదేశాలు రెండే రెండు వుంటాయి మానవ శరీరంలో.

భుజపు కండల వెనుక భాగంలో కొట్టినా, పిర్రల మీద లాగిపెట్టి రెండు అంటించినా బాధ అధికంగా కలుగుతుందే గాని, ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఎంత మాత్రము ఎదురు కాదు.

ఎముకల మీద దెబ్బ పడనంత వరకూ వీరాధి వీరుడి మాదిరిగా పోజు పెట్టవచ్చు. తలను, మెడను జాగ్రత్తగా కాపాడుకోగలిగితే, ఎదుటి వాళ్ళ చేతగానితనాన్ని వెక్కిరించను వచ్చు.

చేతుల్ని మడిచి భుజపు కండరాన్ని స్టిఫ్‌గా బిగపట్టాడు షాడో.... నిలుచున్న చోట తిరిగి నిలబడకుండా చిందులు వేస్తూ తన వంటి మీదికి వస్తున్న కర్రలు ఖచ్చితమైన ప్రదేశంలో పడేటట్లు చూసుకున్నాడు.

పదిసార్లు కర్రల్ని విసిరేసరికి ఆయాసం వచ్చేసింది ఆ యువకులకి.... అన్ని దెబ్బల్ని తిని కూడా ఆ ఎడారి మానవుడు అలాగే నిలబడి వుండటాన్ని గమనించే సరికి చుట్టూ వున్న పౌరుల ఆశ్చర్యానికి అంతు అనేది లేకుండా పోయింది.

చప్పట్లు కొట్టటంతోను, ఈలల్ని వేయటంతోను ఆగలేదు వాళ్ళు... ముందుకు వచ్చి షాడో భుజాలు తట్టి అభినందించారు... తమ దగ్గిర వున్న చిల్లర నాణేలన్నిటినీ అతని తల మీద కుమ్మరించారు.

వయ్యారంగా వంగి, అందరికీ సలాంలు చేసింది షాడో ఫ్రండ్.

"రెల్లు దుబ్బుల పాకలో నువ్వు కొరడా దెబ్బలు తినటాన్ని చూసి ఈ ఎత్తు ఎత్తాను దోస్త్... నేను ఊహించిన దానికంటె పదిరెట్లు అధికం నీ స్టామినా.... నువ్వు నిజంగా చాలా గొప్పవాడివి...."

లోగొంతుకతో అతన్ని మెచ్చుకుంటూ క్రిందపడిన చిల్లర నాణేలన్నిటినీ ఏరి పెద్దమూటగా తయారు చేసింది.

దగ్గిర దగ్గిరగా మూడు కిలోల బరువున్న ఆ మూటను భుజాల మీద వేసుకునే సరికి చిమచిమలాడాయి షాడో భుజాలు.

"మరో సెంటర్‌కి పోయి ఇంకో ప్రదర్శన ఇద్దామా?" భుజాల్ని తడుముకుంటూ కచ్చగా అడిగాడతను.

"చెప్పా పెట్టకుండా ఇబ్బందికి గురి చేశానని ఆవేశపడవద్దు దోస్త్... మన శ్రమకు తగిన ఫలితం తప్పకుండా కనిపించి తీరుతుంది..." అంటూ అతని చేయి పట్టుకుని వీధి అవతల వున్న ఒక ప్లాట్‌ఫామ్ మీదికి తీసుకుపోయింది.

నగరం వెలుపలినుంచి కాలినడకన వచ్చే ప్రయాణీకులు విశ్రాంతి తీసుకోవటం కోసం పూర్వకాలంలో ఎవరో ధర్మాత్ముడు కట్టించిన ఆ ప్రదేశాన్ని తను స్వంతం చేసుకున్నాడు కుంటి ఖలీఫా...

తన బంధువులు, స్నేహితులు, తోటి బిచ్చగాళ్ళు చాలా మంది చుట్టుముట్టి వుండగా, వీధికి ఆవలి వైపున జరిగిన బలప్రదర్శనను గురించే మాట్లాడుతున్నాడు.

"నువ్వు నీ అనుచరులు వారం రోజుల పాటు కష్టపడితేగాని లభించని డబ్బును మేము పావుగంటలో సంపాదించుకోగలిగాము... " షాడో భుజం మీది నాణేల మూటను అతని పాదాల ముందు పడవేస్తూ నిర్లక్ష్యంగా అన్నది షాడో ఫ్రెండ్.

"నీ వాళ్ళనందర్నీ పోగుచేసి మమ్మల్ని ఏదో చేయాలని మాత్రం అనుకోకు... మేము ఇచ్చిన ఆఖరి ప్రదర్శనను గురించి ఎవరినైనా అడుగు... బాణా కర్రల దెబ్బల్ని అవలీలగా భరించగల మాకు నీవంటి కుంటివాళ్ళని, గుడ్డివాళ్ళని చెల్లాచెదురు చేయటం ఏమంత కష్టం కాదు..." నడుము మీద చేతులు వేసుకుని మరింత గర్వంగా చెప్పిందామె.

వాళ్ళు ప్రదర్శించిన ఆఖరి ఐటమ్‌ని గురించి అంతకు ముందే వినివున్నట్లున్నాడు కుంటి ఖలీఫా... పాలిపోయిన ముఖంతో ఆమె వంక చూశాడు.

"ఈ మాటలు నాకెందుకు చెపుతున్నావ్?" తడి ఆరిపోయిన కంఠంతో అడిగాడు.

తన ఫ్రెండ్ మాటల వెనుక దాగుకుని వున్న రహస్యం ఏమిటో అతనికి అర్థం అవటం వల్లనే అతనలా తడబడిపోతున్నాడని గ్రహించేసరికి శాంతించింది షాడోని ఆవరించుకుని వున్న చికాకు.

"ఇందాక మనం జరిపిన సంభాషణను ఒకసారి గుర్తు చేసుకో..." ఊపిరి తీసుకోవటానికి వీలు లేని విధంగా మీదిమీదికి వస్తున్న బిచ్చగాళ్ళ నందర్నీ ఒకే ఒక చూపుతో అవతలికి తరుముతూ ఖలీఫాతో అన్నది షాడో ఫ్రెండ్.

"నాకు సరయిన సమాధానం ఇచ్చేటంత వరకూ రోజుకు నాలుగుసార్లు నా దోస్త్‌తో ప్రదర్శనలు ఇప్పిస్తాను. నువ్వు ఎక్కడికి పోతే అక్కడికి వచ్చి నీ నోట్లో దుమ్ము కొడతాను. ఇస్తాఫ్ నగరంలో నీకు చిల్లిగవ్వకూడా పుట్టకుండా జనాల జేబులన్నీ నేనే ఖాళీ చేసేస్తాను..." అని వార్నింగ్ ఇచ్చింది.

కుంటి ఖలీఫాకంటె ముందుగా హాహాకారాలు చేశారు అక్కడ వున్న అతని అనుయాయులు.

"పెళ్ళాం పిల్లలు లేరు కాబట్టి నీకు ఇబ్బంది అనిపించక పోవచ్చు... గంపెడు మందిని పోషించాల్సిన మా వంటి వాళ్ళ గతేమిటి?" అంటూ అతన్ని నిలదీసి అడిగారు.

"ఏ మాత్రం బయటికి పొక్కినా నా మెడమీద తల కనిపించకుండా పోయే ప్రమాదకరమైన విషయాన్ని అడుగుతున్నారు మీరు... చెప్పకపోతే మా నోట్లో మట్టి కొట్టటానికి సిద్ధపడుతున్నారు..." అంటూ చేయెత్తి సైగ చేశాడు కుంటి ఖలీఫా.

అటువంటి సిచ్యుయేషన్స్‌ని గతంలో చాలాసార్లు చూసివున్నట్లు వెంటనే వెనుతిరిగి ఆ చుట్టు పట్ల ఎక్కడా కనిపించకుండా మాయం అయిపోయారు అతని అనుయాయులు.

"నువ్వు అడిగిన పిల్ల మూడు రోజుల క్రితం ఈ నగరంలోకి వచ్చింది. ఎక్కడా ఆగకుండా, ఎవరితోను మాట్లాడకుండా సరాసరి వాసింసాట్ ఎస్టేట్‌లోకి పోయింది." తన మాటలు పరాయి చెవుల్లో పడటం లేదని నిశ్చయం చేసుకోవటానికి చుట్టూ చూస్తూ, లోగొంతుకతో చెప్పాడు అతను.

"ఇస్తాఫ్ నగరంలోని వాసింసాట్ అంటే ఎవరో సామాన్యమైన ధనవంతుడు అని భావించకండి... ఆయనకి కోపం వచ్చిందంటే మబ్బులు పడుతుంది ఆకాశం. ఇసుక తుఫాను తరుముకుంటూ వచ్చేస్తుంది... " అని కూడా వెల్లడించాడు.

అంతకు ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం అతనికి ఇవ్వాల్సిన నోట్లను దుస్తుల్లోనుంచి తీసింది షాడో ఫ్రండ్.

"వాసింసాట్‌కి సంబంధించిన వ్యవహారాల్లో వేళ్ళు పెట్టిన వారెవరిని ప్రాణాలతో వుండటాన్ని నేను చూడలేదు. ఇవ్వాళో రేపో వల్లకాటికి పోబోతున్న మీ డబ్బు నాకు అవసరం లేదు... మీ దగ్గిరే వుంచుకోండి...." అంటూ ఊతకర్రల్ని అందుకుని కుంటికాలిని ఎగరేసుకుంటూ వెళ్ళిపోయాడతను అక్కడినించి.

సగం వరకూ కాలి ఆరిపోయిన సిగరెట్‌ని అవతలికి విసిరేసి, మరో ఫ్రష్ సిగరెట్‌ని బయటికి తీశాడు షాడో. దూరంలో కనిపించిన ఒక గుర్రపు బండీని దగ్గిరికి రమ్మని సైగ చేశాడు.

"వాసింసాబ్ ఎస్టేట్‌ని ఒకసారి చూసొద్దాం..." అంటూ ఛెంగున ఎగిరి బండి ముందు భాగంలో కూర్చున్నాడు.

కష్టపడి సంపాదించిన నాణేల మూటను అతనికి అందించి వెనుకనుంచి పైకి చేరుకున్నది అతని ఫ్రండ్.

## 9

ఇస్తాఫ్ నగరానికి దక్షిణంగా ఎడారి అంచుల మీద వున్నది కుంటి ఖలీఫా చెప్పిన వాసింసాబ్ ఎస్టేట్.

గుర్రపు బండిని సిటీ లిమిట్స్ దగ్గిరే వదిలి కాలినడకన వచ్చాడు షాడో. ఎస్టేట్ ఇంకో మైలు దూరం వున్నదనగా రోడ్డు ప్రక్కన చతికిల పడింది అతని ఫ్రండ్.

"కర్రలతో కొట్టించాననే కక్షను మనసులో పెట్టుకుని నన్నిలా నడిపించి నడిపించి ప్రాణాలు తీస్తున్నావ్..." పాదాలను నొక్కుకుంటూ కంప్లయింట్ చేసింది.

ఆ మాటలు వినబడనట్లే నటిస్తూ, ఆమెను అక్కడే వదిలి ఒంటరిగా ముందుకు సాగాడు షాడో.... తన ఉనికి బట్టబయలు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఎస్టేట్ చుట్టూ ఒక రౌండ్ కొట్టాడు.

కోట గోడల మాదిరి ఎత్తుగా అగుపిస్తున్నాయి ప్రహరీగోడలు. కోటగుమ్మం లాగా భారీగా తయారు చేయబడి వున్నది మెయిన్ గేటు.

పదిమంది ఆజానుబాహులు సెంట్రీ డ్యూటీ చేస్తున్నారక్కడ... వెనుక భాగాన్ని, మిగిలిన గోడల్ని కవర్ చేస్తున్నారు మరో పాతికమంది.

"ఏమయింది దోస్త్? లోపలికి పోయేటందుకు మార్గం ఏదైనా కనిపించిందా?" రెండు గంటల తర్వాత కాళ్ళు ఈడ్చుకుంటూ వెనక్కి వచ్చిన అతన్ని చూసి వెంటనే ప్రశ్నించింది అతని ఫ్రండ్.

"వాసింసాబ్ అనుమతి లేనిదే లోపలికి పోవటం ఇంపాజిబుల్... కాదు కూడదని మొండిగా ప్రవర్తిస్తే ప్రాణాలు పోగొట్టుకోవటం డెఫినిట్...." పాంటు జేబులో నుంచి సిగరెట్‌ని తీసి వెలిగించుకుంటూ అన్నాడు షాడో.

"పిచ్చి పట్టిన వాడిలా అలా సిగరెట్ మీద సిగరెట్ తగలవేస్తూ నిలుచోకపోతే, అనుమతి తీసుకుని లోపలికి పోయే మార్గం ఆలోచించవచ్చుకదా?" రెండు క్షణాలు ఆగి తన అభిప్రాయాన్ని వెల్లడించింది అతని దోస్త్.

అదే విషయాన్ని గురించి మెదడు చింపుకుంటున్నాడు షాడో.

ఎస్టేట్‌ని చూడాలనో, వాసింసాబ్ గొప్పతనాన్ని వినటంవల్ల అతని దర్శనం చేసుకోవటానికి వచ్చామనో ఏదో ఒక కుంటిసాకుతో

లోపలికి పోవటం ఏమంత కష్టం కాదు... టొయోటా సుందరి అక్కడే వుండి, తన ముఖాన్ని పరీక్షగా చూసిన మరుక్షణం రట్టు అయిపోతుంది గుట్టు... తలల్ని తీసేసి ఎడారిలో తిరిగే రాబందులకు ఆహారంగా వేయిస్తాడు వాసింసాట్...

"ఇప్పుడు మనం చేయాల్సిన పనేమిటి దోస్త్? నోళ్ళు మూసుకుని వెనక్కి వెళ్ళిపోవటమేనా??" ఎంతసేపటికి అతనిలో చలనం కనిపించక పోయేసరికి అసహనంగా అడిగింది అతని స్నేహితురాలు.

ఆ మాటలతో ఆలోచనల నుంచి బయట పడి గాఢంగా నిట్టూర్చాడు షాడో.

నోరు మూసుకుని వెనక్కి పోతే సాల్వ్ అయిపోతుందా సమస్య?

"వెనక్కో ముందుకో ఎటో ఒక వైపుకు పోకుండా ఇక్కడే నిలబడినందువల్ల ఏమైనా వుంటుందా ఉపయోగం?" అతని మనసులోని మాటను చాలా తేలికగా కనిపెట్టి వ్యంగ్యంగా అన్నదామె.

"నగరంలోకి పోయి మంచి మంత్రవేత్త ఎవరయినా దొరుకుతారేమో విచారిద్దాం. కంటికి కనిపించకుండా మాయం అయేందుకు తాయెత్తు ఏదైనా ఇస్తాడేమో తీసుకుందాం. అటువంటి పనులు చేస్తే గాని నీ సమస్యకు సమాధానం లభించదు." అని సలహాకూడా ఇచ్చింది.

కరెంట్ షాక్ కొట్టినట్లు జలదరించింది షాడో శరీరం ఆ మాటల్ని వినేసరికి. వెయ్యి కేండిల్స్ బల్బు వెలిగినట్లు ఒక్కసారిగా ఫ్లాష్ అయింది అతని మనసులో ఒక ఆలోచన.

వేగంగా పక్కకు తిరిగి అమాంతంగా చేతుల్లోకి తీసుకున్నాడతను ఆమెని. గాఢంగా కౌగలించుకుని గట్టిగా చుంబించాడు పెదవుల్ని.

"నీకు పిచ్చి పట్టింది దోస్త్... కట్టుకుపోయేటన్ని సౌకర్యాలు వున్న నగరంలో ఉలుకు పలుకు లేకుండా వూరుకుని నిలుచోవటానికి కూడా సరయిన నీడ లేని ఈ ఎడారిలో ముద్దు ముచ్చట్లు మొదలుపెట్టడం ఖచ్చితంగా పిచ్చి పట్టిందనటానికి నిదర్శనం." బలవంతంగా అతని చేతుల్లో నుంచి బయట పడి దూరంగా జరుగుతూ కోపంగా అన్నదామె.

కొంచెంగా కూడా పట్టించుకోలేదు షాడో ఆ మాటల్ని.

"కమాన్ మై ఫ్రండ్... వాసిం సాబ్ కోటకి కన్నం వేసే మార్గం దొరికింది... సిటీలోకి పోయి అందుకు కావల్సిన సామగ్రిని పర్చేజ్ చేయాలి... కమాన్" అంటూ ఆమె చేయి పట్టుకుని పరుగులాంటి నడకతో వెనక్కి బయలుదేరాడు.

అంతకు ముందు నడిపించి నడిపించి ప్రాణాలు తీయటమే కాకుండా, ఇపుడు పరుగెత్తించి పరిగెత్తించి చంపుతున్నందుకు విసుక్కుంటూ అతన్ని అనుసరించిందామె.

* * * * *

అర్ధరాత్రి దాటిన అరగంటకు వాసింసాట్ ఎస్టేట్ ముందు ప్రత్యక్షం అయ్యాయి రెండు ఆకారాలు.

కళ్ళమీదికి వస్తున్న కునికిపాట్లు దూరమై పోతుండగా, పూర్తిగా ఎలర్ట్ అయ్యారు మెయిన్ గేటుకు కాపలా కాస్తున్న ఆజానుబాహులు. అధునాతనమైన తమ ఆయుధాల్ని రెడీగా పట్టుకుంటూ కనులు చిట్లించి చూశారు.

మెడల దగ్గర్నించి పాదాల దాకా నీలిరంగు అంగీలు ధరించి వున్నాయి ఆ ఆకారాలు. నూనె జిడ్డుతో నిగనిగలాడుతున్న రకరకాల పాతగుడ్డల్ని పావడాల మాదిరి భుజాల మీద వేసుకుని వున్నాయి... ఆకాశంలో వున్న అర్ధచంద్రుడి వెలుగుపడి తళుక్ తళుక్‌మని మెరుస్తున్నాయి వాటి మెడల్లో వ్రేలాడుతున్న రకరకాల తాయెత్తులు, చిత్రవిచిత్రమైన పూసల దండలు.

గుమ్మడికాయ సైజులో వున్న పెద్ద ఇత్తడి గంటను ఇష్టం వచ్చినట్లు మ్రోగిస్తోంది మొదటి ఆకారం. మధ్యమధ్యలో విచిత్రమైన అరుపులు ఏవో అరుస్తోంది.

భగభగలాడుతున్న నూనె కాగడా నొకదాన్ని ఎత్తి పట్టుకొని నాలుగు అడుగులు వెనుకగా నడుస్తోంది రెండో ఆకారం... మొదటి ఆకారపు అరుపులకు వంత పలుకుతోంది.

"ఆగండి.... అక్కడే ఆగండి... అడుగు ముందుకు వేశారంటే హతమారి పోతారు!" పెద్ద కంఠంతో హెచ్చరించాడు అందరి కంటె ముందున్న ఆజానుబాహుడు.

"అల్లా హో అక్బర్... అల్లా హో అక్బర్..."

గంటను మ్రోగించడం క్షణంసేపు ఆపి చెవులు చిల్లులు పడేస్థాయిలో అరిచింది మొదటి ఆకారం.

తమకు తెలియకుండానే ఆయుధాల్ని క్రిందికి దించేశారు ఆజానుబాహులు అందరూ. రెండు అడుగులు వెనక్కి వేసి విచిత్రంగా చూశారు.

పిల్లా-పాప తల్లీ చెల్లీ

అల్లా హో అక్బర్...

చల్లగ వుండీ దయచూడాలి

అల్లా హో అక్బర్...

మరికాస్త సమీపంలోకి రావటంతోటే ఖంగు మంటున్న కంఠంతో ఒక పాటను ప్రారంభించింది మొదటి ఆకారం.

చీకటి సమయాల్లో వీధుల వెంట తిరుగుతూ, దైవాన్ని గురించి, దైవమహిమల్ని గురించి ప్రచారం చేసే ఫకీర్లు వారని గ్రహించేసరికి మటుమాయం అయిపోయింది మొదటి ఆజానుబాహుడి ముఖం మీది అసహనం.

"అనుమతి లేకుండా రాకూడదు ఇక్కడికి.... మాకు తోచిందేదో మీకు ఇచ్చుకుంటాం. దయచేసి వెళ్ళిపోండి..." అంటూ చేయి పెట్టాడు దుస్తుల్లోకి.

చేతుల్లో వున్న ఇత్తడి గంటను టాంగ్ టాంగ్ మని మ్రోగించి, భూనభోంతరాళాలు దద్దరిల్లి పోయేటట్లు పొలికేక ఒకటి పెట్టాడు మొదటి ఫకీరు.

ధనము తెలివి డాబు దర్పం

అల్లా హో అక్బర్....

ఎన్ని వున్నా ఏమి లాభం

అల్లా హో అక్బర్....

అల్లా దయ అవసరమండీ

అల్లా హో అక్బర్....

లేకుంటే పని ఖతమండీ

అల్లా హో అక్బర్....

పాటలో వున్న మాటల కంటె, ఆ మాటల్ని ఉచ్చరిస్తున్న ఫకీరు పద్ధతిని చూసే సరికి చెమటలు పట్టేశాయి అతన్ని అడ్డుకున్న ఆజానుబాహుడికి.

అది గమనించి మరింతగా రెచ్చిపోయాడు మొదటి ఫకీరు వేషంలో వున్న షాడో.

"గుడ్లు అప్పగించి జీబురుకాకి మాదిరి చూడకు... లోపలికి వెళ్ళి గాజానగరం నుంచి ఘంటా ఫకీరు వచ్చాడని చెప్పు... ఆతిథ్యం ఇచ్చి జన్మను సార్థకపరుచుకోమని విన్నవించు... వెళ్ళు... త్వరగా వెళ్ళు... " గుండెలు జలదరించేటట్లు గంటను మ్రోగిస్తూ, ఊపిరి తీసుకోవటానికి కూడా వీలుపడనంతగా ఊదరపెట్టాడు.

తనంతట తానుగా ఆలోచించుకునే శక్తిని కోల్పోయాడు మొదటి ఆజానుబాహుడు. మెయిన్‌గేటు మధ్యభాగంలో వున్న మరో చిన్న ద్వారంలో నుంచి లోపలికి పరిగెత్తాడు.

తన దోస్త్ వైపు తిరిగి సగర్వంగా తల ఎగురవేయాలనే కోరికను బలవంతంగా అదుముకున్నాడు షాడో... నాటకాల్లో ఉపయోగించే పెట్టుడు గడ్డం వూడి క్రింద పడిపోకుండా సవరించుకుంటూ, గేటు ముందు మిగిలిపోయిన నిర్భాగ్యుల్ని అదరగొట్టటంలో బిజీ అయ్యాడు.

ఎంత వేగంతో లోపలికి పోయాడో, అంతకు రెట్టింపు వేగంతో తిరిగి వచ్చి, ద్వారంలోనుంచే చేయి వూపాడు మొదటి ఆజానుబాహుడు.

భగవంతుడి దయను అందమైన పదాలతో కొనియాడుతూ అసిస్టెంట్‌తో సహా లోపలికి పోయాడు షాడో.

"రచ్చచేయటానికి ప్రయత్నిస్తే నచ్చదు నాకు... కాగడాని బయటే వదిలి రండి లోపలికి..." బ్రహ్మాండమైన భవంతి ఒక దాని ముఖద్వారం ముందు నిలబడి, కనుబొమలు ముడిచి సీరియస్‌గా చూస్తూ ఆహ్వానించాడు అతన్ని వాసింసాట్.

తన ఫ్రెండ్‌కి సైగ చేసి కాగడాని భవంతి ముందున్న పూపొదల దగ్గిర పెట్టించాడు షాడో. పూసల పేర్లను తాయెత్తులను సవరించుకుంటూ లోపలికి పోయాడు.

"నా అనుచరుల్ని బెదిరించినట్లు నన్నుకూడా బెదిరించటానికి ప్రయత్నించకుండా నీకు తెలిసిన నాలుగు మంచి మాటలు చెప్పు... విని సంతోషిస్తాను..."

విశాలమైన ఒక గదిలో క్రింద పరచివున్న పట్టు పరుపుల మీద అశీనుడౌతూ తన మనసులోని మాటను అతనికి చెప్పాడు వాసింసాట్.

పొట్ట నింపుకోవటానికి ఫకీరు వేషం వేసిందీ లేనిదీ తెలుసుకోవటానికి అతనలా అడిగాడని గ్రహించేసరికి చెమటలు పట్టేశాయి షాడో అరిచేతులు.

అవాకులు చెవాకులు పేలితే అందరి మాదిరిగా చెదిరి పోడతను... సర్వెంట్స్‌ని పిలిచి వళ్లు హూనం చేయిస్తాడు... తల్లక్రిందులుగా మెయిన్ గేటుకు వ్రేలాడదీయిస్తాడు.

"ఆలోచనలో పడ్డారేమిటి ఫకీర్ సాబ్? మంచి మాటలు ఒక్కటి కూడా మనసులోకి రావటం లేదా?" వెక్కిరింపుగా చూస్తూ వాసింసాబ్ మరోసారి మాట్లాడేసరికి తన సంధిగ్ధపరిస్థితిలోనుంచి బయట పడ్డాడు షాడో.

రకరకాల ఎస్సైన్‌మెంట్స్ మీద తను అరబ్‌దేశాల్లో సంచరిస్తున్నప్పుడు ఆలకించిన ఫకీర్ల మాటలు పాటలు అర్జంటుగా గుర్తు చేసుకుంటూ, ఉపదేశముద్ర పట్టాడతను... చిరునవ్వులు చిలికిస్తూ మానవ దేహాన్ని గురించి అతనికి బోధన ప్రారంభించాడు.

తకతికలాడే తోలుబొమ్మ ఇది
బహుకోపం తాపం కూడియున్నది...
క్రూర కర్మలు చేయ మరిగినది
పాపపు రొంపిలో పొర్లుచున్నది...

వెక్కిరింపుగా చూడటాన్ని వెంటనే మానుకుని, గది గోడలు దద్దరిల్లి పోయేటట్లు చప్పట్లు కొట్టాడు వాసింసాబ్. "ఇంకో రెండు మాటలు చెప్పండి..." అని ప్రోత్సహించాడు.

అహంకారం మనిషికి శత్రువు

కాముకత్వం కనిపించని పాము

అంటూ మనిషి చేయకూడని పనుల్ని గురించి అతనికి చెప్పాడు షాడో.

దానం ధర్మం సత్యం శౌచం

మరిచిపోతే తప్పదు నరకం...

జగతిని దేవుడు ఒకడే ఒకడే

జీవుల కాద్యుడు అతడే అతడే...

పూర్తిగా సంతోషించినట్లు తల వూపుతూ పట్టు పరుపుల మీదినించి లేచాడు వాసిం సాబ్... దగ్గిరికి వచ్చి ఏదో అనబోతుండగా, హడావుడిగా ఆ గదిలోకి ఎంటర్ అయ్యాడు అతని అనుచరుడు ఒకడు.

ఏదో మాట చెప్పబోయి ఆఖరి క్షణంలో ఆగిపోయాడు.

"ఆలస్యం అయిపోయిందని భరించకుండా ఈ పూటకి నా ఆతిథ్యం స్వీకరించండి... పొద్దు పొడవగానే మీకు కానుకలు

సమర్పించుకుంటాను..." అంటూ కొందరు సర్వెంట్స్‌ని పిలిచి ఫకీర్ సాబ్‌ని వారికి అప్పగించాడు వాసిం సాబ్.

అక్కడే వుండి అతను తన అనుచరుడితో మాట్లాడే మాటల్ని ఆలకించాలని ఎంతగానో అనిపించింది షాడోకి.

వెంటపడి ముందుకు నెడుతున్నట్లు వేగంగా అతన్ని, అతని అసిస్టెంట్‌ని బ్రహ్మాండమైన డైనింగ్ రూమ్‌లోకి తీసుకుపోయారు సర్వెంట్స్... వద్దు వద్దన్న కొద్ది రకరకాల ఆహారపదార్థాల్ని ఆరగింప చేసి, భవంతికి దూరంగా వున్న చిన్న అవుట్ హౌస్‌లోకి ప్రవేశపెట్టారు.

"మీకు ఏదైనా అవసరం అయితే కాలింగ్ బెల్ మోగించండి... మీ అంతట మీరు బయటికి మాత్రం రావద్దు" ఖచ్చితమైన ఆర్డర్స్‌ని వినిపించి వెళ్ళిపోయారు.

రెండు వందల యాభై గజాల దూరంలో వున్న పికిలిపిట్టను సైతం ఒకే ఒక తూటాతో పడగొట్టగల హంటింగ్ రైఫిల్‌ని పట్టుకొని, ఒక సర్వెంట్ అవుట్ హౌస్ ముందు బైఠాయించటాన్ని కిటికీలోనుంచి చూశాడు షాడో.

"తొందర పడవద్దు దోస్త్! తొందర పడినందువల్ల ఫలితం ఏదీ వుండకపోగా, ప్రాణాలు పోయే అవకాశం వున్నది!!" అతని కదలికల్లోని ఆత్రుతను గమనించి జంకు నిండిన కంఠంతో అన్నది అతని ఫ్రెండ్.

అవుట్‌హౌస్‌లో ఒక మూలగ కనిపించిన ఈతాకుల చాపని గుమ్మానికి అడ్డంగా పరిచాడు షాడో. వెల్లకిలా పడుకుని, సన్నపాటి కంఠంతో మానవ శరీరాన్ని గురించిన పద్యాలు కొన్నింటిని పాడాడు... పది క్షణాలు ఇంటర్వెల్ ఇచ్చి చెవులు చిల్లులు పడేటట్లు గురకలు మొదలు పెట్టాడు.

ఆ శబ్దాన్ని భరించటం అసాధ్యం అయిపోయినట్లు, కూర్చున్న చోటినుంచి కాస్తంత అవతలికి జరిగాడు గుమ్మం ముందు కాపలా వున్న సర్వెంట్.

గురకల కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించే బాధ్యతను తన ఫ్రెండ్‌కి అప్పగించి, చాపమీదనించి లేచాడు షాడో... ఫకీరు వేషాన్ని తీసి పదిలంగా ఒక ప్రక్కన పెట్టాడు. పిల్లిలా అడుగులు వేస్తూ వెనుక గుమ్మంలోనుంచి బయటికి జారుకున్నాడు.

## 10

భవంతి వెనుక భాగంలో వున్న పెద్ద ఖాళీస్థలం దగ్గిర షాడోకి కనిపించాడు వాసింసాబ్. ముందుగదిలో వుండగా హడావుడిగా వచ్చి గానాబజానా కార్యక్రమాన్ని చెడగొట్టిన అనుచరుడితో మాట్లాడుతూ ఒక ప్రక్కగా నిలబడి వున్నాడు.

రెండో ప్రక్కన వున్న గోడవున్స్ వంటి రేకు కట్టడాలలోనుంచి పెద్ద పెద్ద ఉడెన్ క్రేట్స్‌ని, చెక్కతో చేయబడిన పీపాల్ని బయటికి తీసుకు వస్తున్నారు అతని అనుచరులు కొందరు.

"పట్టపగలు బయలుదేరితే పదిమంది కళ్ళల్లోను పడతారు. పొద్దు పొడవకముందే వెళ్ళిపోవాలి అవతలికి. త్వరగా కానీయండి... త్వరగా..." అని వారిని హెచ్చరిస్తూ ఎందుకో తల తిప్పి ప్రక్కకు చూశాడు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకొని, చటుక్కున క్రిందికి వాలిపోయాడు ఒక గోడచాటున నిలబడిన షాడో..... పాములా మోచేతుల మీద పాకుతూ దట్టంగా వున్న ఒక కాక్టస్ పొద వెనక్కి వెళ్ళిపోయాడు.

కాక్టస్ పొదకు పాతిక గజాల దూరంలో నిలబెట్టి వున్నాయి పాతిక సంఖ్యకు పైగానే వున్న ఒంటెలు కొన్ని.

వాసిం సాబ్‌కి అగుపించని షాడో కదలికల్ని వెంటనే పసికట్టాయి వాటిలో కొన్ని. పాముల మాదిరి బుసలు కొడుతూ ముందుకు రాబోయాయి.

గుట్టు రట్టు అవనే అయిందన్న భయంతో, అమాంతంగా పైకి లేచి పిక్కబలం చూపించటానికి సిద్ధపడబోయాడు షాడో....

"అర్ధరాత్రి సమయంలో ప్రయాణానికి రెడీ చేయటం వల్ల వీటికి కోపం వచ్చేసింది. అజాగ్రత్తగా వుంటే అవతలికి గంతులు వేస్తాయి... భవంతి చుట్టూ గిరికీలు కొట్టి మన ప్రాణాలు తీస్తాయి..." పరుగులాంటి నడకతో వాటికి ఎదురుపోయి, ముకుతాళ్లను గట్టిగా పట్టుకుంటూ అన్నాడు వాసింసాబ్ ప్రక్కనే నిలుచున్న వ్యక్తి.

బిగపట్టిన ఊపిరిని తేలికగా బయటికి వదులుతూ అతని తెలివితేటల్ని మెచ్చుకున్నాడు షాడో... ఎందుకైనా మంచిదనే ఉద్దేశ్యంతో, పారిపోయేటందుకు మార్గాన్ని ఒకసారి కనులతో చూచుకుని, వాసింసాబ్ అనుచరుల వైపు కేంద్రీకరించాడు దృష్టిని.

చీకటి మాటున తప్ప పట్టపగలు బయటికి తీసుకుపోకూడని ఆ పెట్టెల్లోను, పీపాల్లోను ఎటువంటి సరుకు పాక్ చేయబడి వున్నదో తెలుసుకోవాలన్న కోరిక క్షణాలు గడిచిన కొద్దీ అధికమై పోసాగింది అతనిలో.

అల్జీరియన్ ప్రభుత్వపు కళ్ళు కప్పి స్మగ్లింగ్ కార్యక్రమాలు ఏవైనా చేపడుతున్నాడా ఈ వాసిం సాబ్?

"అతను ఏ విధమైన కార్యక్రమాలు చేపడితే నీకెందుకు మిస్టర్ షాడో? నువ్వు వచ్చిన పనేమిటి? చేస్తున్న దేమిటి?" వెంటనే అతన్ని ఎత్తిపొడిచింది అంతవరకూ మౌనంగా వున్న అతని అంతరాత్మ.

ఆ మాటలకు సమాధానం చెప్పుకోవటం సాధ్యపడక, తల వంచుకుని, ముఖంమీద ప్రత్యక్షం అయిన చెమట బిందువుల్ని షర్టు భుజానికి తుడుచుకున్నాడు షాడో.

సముద్రపు వడ్డునుంచి పారిపోయి వచ్చిన టొయోటా సుందరికీ, ఈ వాసింసాబ్‌కీ వున్న కనెక్షన్ ఏమిటో తెలుసుకోవాలన్న కోరికతో వచ్చాడు తను అక్కడికి... హడావుడి పడితే అయ్యేపని కాదు అది... ఏదో ఒక విధంగా మాటల్లో పెట్టాలి వాసింసాబ్‌ని... అతని నోటివెంటే ఆ విషయాన్ని తెలుసుకోవాలి...

ఒంటెలు నిలబడివున్న ప్రదేశానికి కొద్దిగా అవతల గుట్టలు గుట్టలుగా పేరుకుంటున్న సామగ్రిని చూసేసరికి, అతనికి తెలియకుండానే డైవర్ట్ అయ్యాయి ఆలోచనలు... ఆ పెట్టెల్లోను, పీపాల్లోను ఏముందో తెలుసుకోవాలన్న తపన తిరిగి ప్రారంభం అయింది.

"అయితే ఆలస్యం దేనికి మిస్టర్ షాడో? వాసింసాబ్ దగ్గిరికి పోయి సూటిగా అడిగేయ్..." తన ఎత్తిపొడుపుల్ని అతను లక్ష్యపెట్టటం లేదన్న కక్షతో వ్యంగ్యంగా సలహా ఇచ్చింది అంతరాత్మ.

ఆ పని చేస్తే జరిగేది ఏమిటో తలుచుకునే సరికి షాడో పెదవుల మీదికి పరిగెత్తుకు వచ్చింది ఒక చిరుదరహాసం.

తన రహస్యం బట్టబయలు కాకుండా అనుకున్న పనిని సాధించే మార్గం కోసం అన్వేషిస్తూ, తల ప్రక్కకి తిప్పిన అతనికి, వెంటనే అగుపించింది మిసమిసలాడే పరువంలో వున్న ఆ ఆడ ఒంటె.

వాసింసాట్ అనుచరుడు తన ముకుత్రాళ్ళని బిగించి పట్టుకుని వున్నా ఆగటం లేదది... షాడో వున్న కాక్టస్ పొదకేసి చూడటం మానుకోలేదు.

"నీ ఎలర్ట్‌నెస్‌కి నా జోహార్లు బేబీ.... నేను అనుకుంటున్న పనిని పూర్తిచేసి పెట్టే పొగరు, నిగరు నీ దగ్గిర కనిపిస్తున్నాయి." అనుకుంటూ రెండు గజాలు వెనక్కి జరిగాడు షాడో....

ఎడారి ప్రదేశమని ఉదాసీనతను చూపించకుండా, విపరీతంగా వాటరింగ్ చేయటం వల్ల నవనవలాడిపోతున్నాయి ఆ ప్రదేశంలో వున్న పొదలు, పూలచెట్లు.

వాటిని చాటు చేసుకుంటూ ముందుకు సాగాడు షాడో... దుస్తుల్లో వున్న కైజారును తీసి, తన కదలికల్ని కనులతోనే ఫాలో కావటానికి ప్రయత్నిస్తున్న ఒంటె బేబీ ఎడమతొడకేసి బలంగా విసిరాడు.

ఆఖరి క్షణంలో చేతిని స్లయిట్‌గా క్రిందికి వంచటం వల్ల, బలంగా దిగబడే మూమెంటమ్‌ని కోల్పోయిందా ఆయుధం.... అరంగుళం లోతుండే గాయాన్ని సృష్టించి, తనంతట తనే క్రిందికి జారిపోయింది.

చెవులు చిల్లులు పడే శబ్దం చేస్తూ, నిలుచున్న పొళాన గాలిలోకి ఎగిరింది ఒంటె బేబీ... వేగంగా తలను వంచి వాసింసాబ్ అనుచరుడి గుండెల మీద పొడిచింది.

జరిగింది ఏమిటో అర్థం చేసుకొనే వ్యవధి అతనికి లభించలేదు... కీచుగా అరిచి వెల్లకిలా పడిపోయాడు....

అతని మీదినించి అవతలికి జంప్ చేసింది ఒంటె బేబీ.... దారికి అడ్డువచ్చిన తన సహచరురాళ్ళని, సహచరుల్ని ఎగిరెగిరి తన్నుతూ, గోడవున్‌లోనుంచి సామానుల్ని బయటికి తీస్తున్న వారికేసి పరిగెత్తింది.

"పట్టుకోండి... దాన్ని అర్జంటుగా పట్టుకోండి...." ఖంగారుగా అరుస్తూ తన అనుచరుల్ని హెచ్చరించాడు వాసింసాబ్.

పట్టుకోవటానికి ప్రయత్నించిన ఇద్దరు అనుచరుల్ని వెనుక పాదాలతో మర్దించింది ఒంటె బేబీ... ఆ దృశ్యాన్ని చూసి దూరంగా జరగబోతున్న మరో ఇద్దరి మీదికి పెద్దపులిలా లంఘించింది.

తలల మీద వున్న ఉడెన్ క్రేట్స్‌ని తటాలున క్రిందికి వదిలి గోడవున్‌లోకి పారిపోయారు వారిద్దరూ....

కనులు చిట్లించుకుని తదేక దీక్షగా చూస్తున్నాడు షాడో అటుకేసి. క్రిందపడిన ఉడెన్ క్రేట్స్ మధ్యకు విచ్చుకొని వాటిలోనుంచి

బయటికి చెదిరిన సామగ్రిని గమనించే సరికి, చలిజ్వరం వచ్చేసినంత పని అయింది అతనికి.

అల్జీరియన్ ప్రభుత్వపు కనులు కప్పి స్మగ్లింగ్ కార్యక్రమాల వంటి చిన్న చిన్న పనులు ఏవీ చేయటం లేదు వాసింసాబ్...

సర్గోసాతో చేతులు కలిపి చాలా పెద్ద ఎత్తులో విద్రోహకర చర్యలు చేపడుతున్నాడు.

ఆటమిక్ వార్‌హెడ్స్ బిగించబడిన ఇంటర్ కాంటినెంటల్ బలాస్టిక్ మిస్సయిల్స్‌ని ప్రయోగించేందుకు మామూలు ఏర్పాట్లు సరిపోవు... రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలు అవసరం అవుతాయి... అధునాతనమైన కంప్యూటర్స్ కావల్సివస్తాయి.

మధ్యకు విచ్చుకున్న ఉడెన్ క్రేట్స్‌లోనుంచి బయట దొర్లిన సామగ్రిలో చాలా భాగం ఉపయోగపడేది అటువంటి పనులకే...

ఒంటె టేబీ చేస్తున్న స్వైర విహారాన్ని అడ్డుకోవటం కోసం కలిసికట్టుగా కదులుతున్న వాసింసాబ్ అనుచరుల్ని చూస్తూ, ముందుకు ముందుకు జరిగాడు షాడో... రక్తసిక్తమై క్రింద పడిన తన ఖైజారును చల్లగా అందుకొని దుస్తుల్లో దాచుకుంటూ వెనుతిరిగాడు.

అగ్ని పర్వతాల మాదిరి ఉడుకుతున్న ఆలోచనల మూలకంగా అతన్ని ఆవరించుకున్నది ఒక విధమైన అయోమయావస్థ!

ఎగిరి గంతులు వేస్తున్న ఒంటె బేబిని ఏదో ఒక విధంగా శాంతింపచేసిన వెంటనే ప్రారంభం అవుతాయి ప్రయాణసన్నాహాలు.

వారిని అనుసరించగలిగితే, సర్‌గోసా తలదాచుకున్న ప్రదేశానికి చాలా తేలికగా చేరుకోవచ్చు... వచ్చిన పనిని పూర్తి చేసుకొని హాయిగా ఇంటి దారి పట్టవచ్చు.

పొద్దు పొడిచిన తర్వాతగాని తనను వదిలిపెట్టడం జరగదని చెప్పివున్నాడు వాసింసాబ్... అతిథి మర్యాదలు చేసి, కానుకలు ఇచ్చిన తర్వాతగాని కదలనీయడు.

అతని అనుమతి లేకుండా ఎస్టేట్‌లోనుంచి బయటికి పోయే ప్రయత్నం చేయటం చేచేతులారా ప్రాణాలు తీసుకోవటంతో సమానం...

ఏదో ఒకటి చేసి వెంటనే బయలు దేరకపోతే, దూరంగా వెళ్ళిపోతుంది ఒంటెల కారవాన్. అయాచితంగా లభించిన అపూర్వమైన అవకాశం చేయి జారిపోతుంది.

భవంతిలో సంచరిస్తున్న సర్వెంట్స్‌కి తన కదలికలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అవుట్ హౌస్ వైపు జరుగుతున్న షాడో ఆలోచనలు అర్ధంతరంగా ఆగిపోయాయి - నాశికా రంధ్రాలకు ఒక ఘాటయిన సువాసన తగలటంతో...

సముద్రపు వడ్డునుంచి పారిపోయి వచ్చిన టొయోటా సుందరి ఉపయోగించే పెర్ఫ్యూమ్‌కి సంబంధించిన వాసన అది అని వెంటనే స్ఫ్రయికవటంతో ఝల్లుమన్నాయి అతని గుండెలు.

ముంగిస జాడల్ని పసికట్టిన తాచుపాము మాదిరి చర్రున ప్రక్కకు తిరిగి, దగ్గర్లో వున్న ఒక పూపొద మధ్యకు జంప్ చేయబోతుండగా, "ఆగు... అక్కడే ఆగు..." ఖంగుమంటూ వినవచ్చింది టొయోటా సుందరి కంఠం.

దుస్తుల్లో వున్న కైజారును అందుకోవాలని అనుకున్నాడు షాడో. అండర్‌హేండ్ త్రోలో అటుకేసి విసరాలని కూడా ఆశపడ్డాడు.

అతని ఆలోచనలు కార్యరూపంలోకి రాకముందే నిగనిగలాడుతున్న రివాల్వర్‌ని బిగించి పట్టుకుంటూ నాలుగు అంగల్లో అతని ముందుకు వచ్చేసిందామె.

"వాసింపాట్‌కి తెలియకుండా ఒక్క పురుగు కూడా అడుగు పెట్టకూడని ఈ తోటలోకి ఎలా వచ్చావ్? ఎవరు నువ్వు?" కనులు చిట్లించి అతని ముఖంలోకి చూస్తూ అడగబోయి - ఆఖరి క్షణంలో అదిరిపడిందామె.

"మైగాడ్! షాడోవి నువ్వు!! షాడోవి!!!" అంటూ ఎగిరి దూకింది వెనక్కి. రెండంటే రెండు అంశాలు షాడోని రక్షించాయి ఆ సమయంలో.

చోటు కాని చోటులో కనిపించటం వల్ల, దూరంలో వుండగా అతన్ని గుర్తు పట్టలేక పోయిందామె. గుర్తు పట్టిన తర్వాత ఏం చేయాలో వెంటనే స్ఫురించక పోవటం వల్ల, చేతిలోని ఆయుధాన్ని ఉపయోగించటం మరిచిపోయింది.

అనుకోని విధంగా లభించిన ఆ అవకాశాన్ని వెంటనే సద్వినియాగపరుచుకున్నాడు షాడో.

కంటికి కనిపించనంత వేగంతో కైజారును బయటికి తీసి బలంగా దూశాడు గాలిలోకి.

రెండు అంగుళాల లోతు ప్రత్యక్షమైంది టొయోటా సుందరి కంఠం మీద పెద్దగాయం.

వెల్లువలా వెలుపలికి రావటం మొదలు పెట్టిన రక్తపు ధారలతో పాటుగా, అనంత విశ్వంలోకి ఎగిరిపోబోతున్న ప్రాణవాయువుల్ని క్షణంలో పదోవంతు కాలంపాటు చిక్కబట్టుకున్నదామె.

చేతిలోని రివాల్వర్‌ని కొద్దిగా పైకెత్తి ట్రిగ్గర్‌ని ప్రెస్ చేసింది.

ప్రక్కకు దూకే అవకాశం లేదు. వెనక్కి జంప్ చేసే అవకాశం అంతకన్నా లేదు. నిలుచున్నవాడు నిలుచున్నట్లుగా క్రిందికి పడిపోయాడు షాడో.

అంగుళంలో నాలుగోవంతు తేడాతో తప్పిపోయింది ప్రమాదం... అయితే ఏది జరుగకూడదని అతను ఎంతగా తపించిపోయాడో అది జరుగనే జరిగింది.

రివాల్వర్ శబ్దం చెవుల పడిన మరుక్షణం ఎలర్ట్ అయిపోయింది వాసింసాట్ ఎస్టేట్.

టకటకమంటు వెలగసాగాయి అతని భవంతి చుట్టూ అమర్చివున్న లైట్లు.

"వెళ్ళండి. తోటలోకి వెళ్ళి ఆ శబ్దం ఏమిటో చూడండి..." ఖంగు మంటున్న వాసింసాట్ కంఠం గాలివాలున వచ్చి షాడో చెవులకు చేరింది.

రక్తంతో మలినమైన కైజారును నేలలో గుచ్చి శుభ్రం చేసుకున్నాడతను. మొదలు నరికిన చెట్టు మాదిరి విరుచుకు పడిపోయిన టొయోటా సుందరి శరీరాన్ని ఒక పూపొద చాటుకు నెట్టాడు. వేటకుక్కలు వెంటబడిన తోడేలు మాదిరి అతి వేగంగా పరుగు తీసి అవుట్ హౌస్ వెనుక భాగాన్ని చేరుకున్నాడు.

అప్పగించిన పనిని అతి సమర్ధవంతంగా నిర్వహిస్తోంది అతని ఫ్రెండ్.... మెయిన్ డోర్ దగ్గిర వున్న సర్వెంట్‌కి ఎటువంటి అనుమానము రాకుండా మేనేజ్ చేస్తోంది.

జరిగిన దేమిటో ముక్తసరి మాటలతో ఆమెకు చెపుతూ, తన సరంజామానంతా సర్దుకున్నాడు షాడో.

"అటుతిరిగి ఇటు తిరిగి అనుమానం మన మీదికి వచ్చేయటం డెఫినిట్. నిజం ఏమిటో తెలియక పోయినా మనల్ని మెయిన్ హౌస్‌లోకి తీసుకుపోయి ఇంటరాగేషన్ చేయటం ఖాయం... ఈ లోపల ఎస్టేట్‌ని దాటి అవతలికి వెళ్ళిపోతుంది ఒంటెల కారవాన్..." పిల్లిలా తోటలోకి అడుగులు వేస్తూ అన్నాడు.

అతను ఊహించినట్లు అదిరిపోయి నోరు తెరవలేదు అతని ఫ్రెండ్.

"అయితే ఆలస్యం దేనికి దోస్త్? వాసింసాబ్ అనుచరులు మనకోసం వచ్చేలోపుగా మాయం అయిపోదాం" అంటూ అతనితో పాటు పొదల్లోకి అడుగుపెట్టింది.

తనెవరో, తను చేసేపని ఏమిటో తెలుసుకోవటానికి ఒక్కసారికూడా ప్రయత్నించకుండా, పీకల దాకా ప్రమాదంలో

కూరుకుపోవటానికి సిద్ధపడుతున్న ఆ ముగ్ధమూర్తిని కనుచివరల నుంచి చూస్తూ పరుగు ప్రారంభించాడు షాడో.

వేట కుక్కల మాదిరిగానే తోటలోకి వచ్చేశారు వాసింసాబ్ అనుచరులు. పొదల చాటుకు దొర్లించబడిన టొయోటా సుందరి శరీరాన్ని గమనించగానే గొంతులు చినిగి పోయేటట్లు అరిచారు.

ఆ సందడి మధ్య చల్లగా అవతలకి జంప్ చేశాడు షాడో... ఖాళీస్థలాన్ని చేరుకొని ఒక ఖర్జూర చెట్టు క్రింద మోకరించి కూర్చున్నాడు.

"ఈ పని చేసిన దుర్మార్గులు ఈ చుట్టుపట్ల ఎక్కడో వుండి వుంటారు. గాలించండి... తోటనంతా గాలించండి..." ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞలు జారీచేశాడు అందరికంటె ఆఖర్న ఆ ప్రదేశానికి చేరుకున్న వాసింసాబ్.

అంతటితో ఆగలేదతను.

"అవుట్‌హౌస్‌లో వున్న ఫకీర్‌ని, అతని అసిస్టెంట్‌ని వెంటనే నా ముందుకు తీసుకురండి." అని కూడా ఆర్డర్ ఇచ్చాడు.

ఖాళీ స్థలం మధ్యలో గుట్టలు గుట్టలుగా పడవేసి వున్న చెక్కపీపాల్ని , ఉడెన్ క్రేట్స్‌ని చూస్తూ గాఢంగా నిట్టూర్చాడు షాడో.

డూ ఆర్ డై సిచ్యుయేషన్ వచ్చేసింది!

ఒంటెల కారవాన్‌ని అనుసరించటం, అనుసరించక పోవటం కాదు ఇప్పుడు ముఖ్యం. అవుట్ హౌస్‌లో వుండాల్సిన ఫకీర్ కోసం ఎస్టేటంతా గాలించి గాలించి ఆ ఖాళీస్థలం దగ్గిరికే వస్తారు అందరూ....

ఆ లోపల అక్కడినించి మాయం కాలేకపోతే అక్కడే భూస్థాపితం అయిపోవడం తప్పదు...

ముంచుకు రాబోతున్న ప్రమాద పరిస్థితిని గురించి కొంచెంగా కూడా ఊహలు చేయకుండా స్థిమితంగా తన ప్రక్కన కూర్చున్న తన ఫ్రండ్ నిశ్చలత్వానికి అచ్చెరువందుతూ, ఖర్జూర చెట్టు క్రిందినించి లేచాడు షాడో.

భుజాల మీద వేసుకున్న పాతగుడ్డల్ని, బొంత సంచుల్ని చేతుల్లోకి తీసుకుంటూ ముందుకు అడుగు వేశాడు.

## 11

షాడో ఊహించినట్లే అరగంట తరువాత ఖాళీ స్థలం దగ్గిరికి వచ్చేశారు వాసింసాబ్ అనుచరులు అందరూ...

"చీకటి మాటున మనల్ని వెన్నుపోటు పొడిచిన ఆ దుర్మార్గులు ఈ ఎస్టేట్ గోడల్ని దాటి ఎక్కడికీ పోలేరు... తూర్పు దిక్కు తెల్లబడిన తరువాత వారిని పట్టి బంధించటం చాలా తేలిక. ఈ లోపల

ఒంటెల్ని సిద్ధం చేయండి... ముందు అనుకున్న ప్రకారం ప్రయాణం ప్రారంభించండి...." ఖాళీ స్థలం చుట్టూవున్న పొదల్నికూడా గాలించి, వట్టి చేతులతో వెనక్కి వచ్చిన వారిని చూస్తూ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు వాసింసాబ్.

ఒక్క అడుగుకూడా అవతలికి వేయకుండా దగ్గిర వుండి పాకింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాడతను.... ఒంటెలు మెయిన్ గేటును దాటి ఎడారివైపు వెళ్ళేదాకా వెన్నంటి నడిచాడు.

ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసి సాయం సమయం అవుతుండగా ఒక నీటి గుంట దగ్గిర ఆగింది కారవాన్.

ఆ రోజుకు ప్రయాణాన్ని ఆపుచేసుకున్నారు వాసింసాబ్ అనుచరులు. వెంట తెచ్చుకున్న రొట్టెల్ని ఆరగించి, నీటి గుంటలోని నీటితో దాహం తీర్చుకున్నారు.

బరువైన రైఫిల్స్ పట్టుకొని వంద గజాల దూరంలో వున్న పెద్ద పెద్ద ఇసుక గుట్టల మీదికి పోయారు వారిలో కొందరు... ఒంటెలకు దూరంగా ఒక పల్లపు ప్రదేశంలో మేనులు వాల్చారు మిగిలినవారు.

అర్ధరాత్రి సమయం దాటిన అరగంట తరువాత, నీటి గుంటకు దగ్గిరగా పడుకున్న ఒక ఒంటెలో వచ్చింది కొద్దిపాటి చలనం.... తన మూపురానికి అటూ ఇటూ వేలాడదీసివున్న చెక్కపీపాలు

కదులుతున్నట్లు అనిపించింది కాబోలు, తల ప్రక్కకు తిప్పి ఆశ్చర్యంగా చూసింది వాటివంక.

క్రైజారు మొనతో పీపా మూతను మెల్లిగా పైకెత్తి బయటికి తొంగిచూశాడు ఒక పీపాలో కూర్చునివున్న షాడో.

మృదువైన శబ్దాలు చేస్తూ బయటికి వచ్చి, ఒంటె ముఖాన్ని అరిచేతులతో మెత్తగా వత్తాడు.

"దాహంతో నాలుక పిరగలాక్కుపోతోంది దోస్త్... త్వరగా బయటికి లాగి కాసిని నీళ్ళు నా ముఖంమీద పోయకపోతే ప్రాణాలు వదిలేస్తాను..." అతని కదలికల్ని పసికట్టి రెండో పీపాలోనుంచి హెచ్చరించింది అతని ఫ్రెండ్.

తనలో తను నవ్వుకుంటూ అటుకేసి జరిగి, ఆమెనుకూడా బయటికి లాగాడు షాడో. తన దుస్తుల్లో నుండి ఎండిపోయిన మొక్కజొన్న గింజల్ని, గట్టిగా వున్న రెండు బంగాళాదుంపల్ని తీసి ఆమెకు అందించాడు.

వాసింపాట్ అనుచరులు ఖాళీ స్థలంలోకి వచ్చేలోపుగా అతను చేసిన ఘనకార్యం అది. ఆహార పదార్థాలు పాక్ చేయబడిన ఆ పీపాల్ని అర్జంటుగా ఖాళీ చేసాడు. వాటిలోని పదార్థాలన్నింటిని పాత గుడ్డల్లోను, తన బొంత సంచుల్లోను నింపి, కొన్ని రకిసపొదల మధ్య

దాచి పెట్టాడు. తన దోస్త్‌ని ఒక పీపాలోకి నెట్టి తను రెండవదానిలో సెటిల్ అయ్యాడు. మిగిలిన సామగ్రినంతటికీ దూరంగా వుంచటం వల్ల ఒకే ఒంటె మీదికి ఎక్కించబడ్డాయి అవిరెండూ.

పలుకురాతి ముక్కల మాదిరిగా వున్న మొక్కజొన్న గింజల్ని , ఎండిపోవటానికి సిద్ధంగా వున్న బంగాళా దుంపల్ని ఆరగించి, నీటిగుంట దగ్గిరికి పోయి దాహం తీర్చుకున్నది అతని ఫ్రండ్.

ఆలస్యం చేసిన కొద్ది తమ కదలికలు ఇసుక గుట్టల మీదివారికి అగుపిస్తాయన్న భయంతో బలవంతంగా ఆమెను పీపాలోకి నెట్టాడు షాడో. తన అవసరాలను కూడా తీర్చుకుని వెనక్కి వస్తుండగా, గొల్లున వినవచ్చాయి అరుపులు.

"శత్రువులు... శత్రువులు మనల్ని చుట్టుముట్టారు..." అని కేకలు పెడుతూ తుపాకుల్ని గాలిలోకి ఎత్తి గుండెలు జలదరించేటట్లు కాల్పులు ప్రారంభించారు వాసింసాబ్ అనుచరులు.

తనను చూడటం వల్లనే అలా గోల చేస్తున్నారేమోనన్న అనుమానంతో బలవంతంగా పీపాలోకి నెట్టిన తన ఫ్రండ్‌ని తిరిగి బయటికి లాగబోయాడు షాడో. ఆ ప్రదేశానికి దూరంగా పారిపోయి ప్రాణాలు దక్కించుకోవాలని అతని ఉద్దేశ్యం.

అతని ఆలోచనలు కార్యరూపంలోకి రాకముందే పిశాచాల మాదిరి ప్రత్యక్షమయ్యారు కొందరు ఆగంతుకులు.

ఎండ వేడిమికి నల్లగా మారిపోయిన శరీరాలపై, ఎర్రటి వస్త్రాలను ధరించి వున్నారు వాళ్ళు.... పొడుగాటి బరిశెల్ని, బరువైన రైఫిల్స్‌ని పట్టుకుని వున్నారు.

ఇసుక గుట్టల మీది సెంట్రీలను, పల్లపు ప్రదేశంలో నుంచి ఇవతలకు రాబోతున్న వారిని ఎదిరించారు వారిలో కొందరు. ఒంటెల దగ్గిరికి వచ్చి వాటిని బెదరగొట్టే ప్రయత్నాలను ప్రారంభించారు మరికొందరు.

పది అడుగుల దూరంలోకి వచ్చిన ఒక ఆగంతకుడిని పరీక్షగా చూసిన షాడోకి వెంటనే కలిగింది నూటనాలుగు డిగ్రీల జ్వరం వచ్చిన అనుభూతి.

అల్జీరియా సరిహద్దుల్లో సంచరిస్తూ వుండే డంకాలీ జాతికి చెందిన ఎడారి దొంగలు వాళ్ళు... ఏమరి పాటుగా వున్న ప్రయాణీకుల మీద దాడిచేసి ప్రాణాలు తీయటం, చేతికి అందిన సొత్తుతో పరారు కావటం వారి వృత్తి.

వాసింసాబ్ అనుచరులు వారి ధాటికి ఆగలేక చెల్లాచెదరైపోయినా, వారి కారవాన్‌లోని ఒంటెలు డంకాలీ దొంగల చేతికి

దొరికిపోయినా, అంత వరకూ తనుపడిన కష్టమంతా మట్టిగొట్టుకు పోతుందని అర్థమై, అమాంతంగా గాలిలోకి ఎగిరాడు షాడో. దుస్తుల్లో దాచుకున్న కైజారును బయటికి లాగి, ఎదుటికి వచ్చిన ఆ దొంగను ఎడాపెడా పొడిచాడు రెండు పోట్లు.

చెవులు చిల్లులు పడి పోయేటట్లు అరిచి వెల్లికిలా పడిపోయాడా దొంగ... చేతిలోని రైఫిల్‌ని వదిలి తలను వ్రేలాడేశాడు.

ఆ ఆయుధాన్ని తను స్వాధీనం చేసుకుని నిర్దాక్షిణ్యంగా కాల్పులు ప్రారంభించాడు షాడో. రెండే రెండు నిముషాల్లో అంతం అయింది ఆ పోరాటం. అతని ధాటిని తట్టుకోవడం అసాధ్యమై వెనక్కి పారిపోయారు దొంగలు.

ఇసుక గుట్టల్ని చుట్టుముట్టిన వారు కూడా వెనుతిరుగుతూ వుండటాన్ని గమనించి చేతుల్లోని రైఫిల్‌ని అవతలకు విసిరేశాడు షాడో... నాలుగే నాలుగు అంగల్లో తన పీపాను సమీపించి లోపలికి జంప్ చేశాడు.

పది నిముషాల తరువాత పరుగు పరుగున ఒంటెల దగ్గిరికి వచ్చారు వాసింసాబ్ అనుచరులు.

"పారిపోయిన డంకాలీ రాక్షసులు తమ అనుయాయుల నందర్ని పోగుచేసుకుని వచ్చేస్తారు. మరోసారి మన మీద దాడి చేసి కక్ష తీర్చుకునే ప్రయత్నం చేస్తారు... ఆ పని జరగక ముందే వెళ్ళిపోవాలి

మనం..." అని తమలో తాము అనుకుంటూ అప్పటికప్పుడు ప్రయాణాన్ని ప్రారంభించారు.

పీపామూతను స్వల్పంగా పైకెత్తి వారి చర్యల్ని గమనిస్తున్న షాడో నోరు చేదుగా తయారయింది ఆ మాటల్ని వినేసరికి.

కక్ష కట్టటంలో తాచుపాముల్ని మించిన వారని అంటారు ఆ డంకాలి జాతికి చెందిన వారిని...

ఒంటెల కారవాన్ సర్గోసా స్థావరాన్ని చేరుకోకముందే ఇంకో సారి అటాక్ చేస్తే తమ గతి ఏమిటి??

తాము పీపాల్లో వుండగా అటువంటి ప్రమాదం సంభవిస్తే తప్పించుకోవటం సాధ్యపడుతుందా??

అతని అనుమానాలకు సరైన సమాధానం లభించకముందే ఇసుక గుట్టల్ని అధిగమించాయి ఒంటెలు.... పరుగులాంటి నడకతో ఉత్తరదిశకు బయలు దేరాయి.

ఆయుధాల్ని సిద్ధంగా పట్టుకుని వాటిని అనుసరించారు వాసింసాబ్ అనుచరులు. తూర్పుదిక్కు తెల్లబడిన తరువాత కూడా ఆగలేదు వాళ్ళు... మధ్యాహ్న సమయంలో కూడా ఒంటెల్ని నిలువనీయలేదు....

చీకట్లు చుట్టు ముట్టబోతున్న సమయంలో వారి దారికి అడ్డుగా ప్రత్యక్షం అయ్యాయి కొన్ని కొండగుట్టలు... అన్నిటికంటె ఎత్తైన గుట్టచాటునుంచి ఇవతలికి వచ్చి, చేతులు వూపుతూ వారికి స్వాగతం పలికారు వారి మాదిరిగానే దుస్తులు ధరించివున్న మేజర్ జనరల్ సర్గోసా అనుచరులు అనేకమంది.

## 12

".... వాసింసాబ్ ఎస్టేట్ ఎలా వుంటుందో నాకు తెలుసు... కంచుకోటవంటి ఆ ప్రదేశంలోకి అడుగు పెట్టి నా మనిషిని హతమార్చిన వాళ్ళు వెంటనే పట్టుబడకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది..."

సన్నగా పొడవుగా వున్న సిగార్ని పంటిక్రింద నొక్కిపడుతూ సాలోచనగా అన్నాడు మేజర్ జనరల్ సర్గోసా.

కొండ గుట్టచాటున వున్న కొన్ని మట్టి కట్టడాల ముందు తమ ఒంటెల్ని నిలబెట్టారు వాసింసాబ్ అనుచరులు.

నరమాంసం తినటానికి అలవాటు పడిన ఎడారి నక్కల వంటి డంకాలీ దొంగల బారిన పడి ఒంటెల మీది సామగ్రినంతా కోల్పోకుండా సురక్షితంగా రాగలిగినందుకు మెచ్చుకోవలసింది పోయి, ఇంటరాగేషన్ చేస్తున్నట్లు ప్రశ్నలు వేస్తున్నందుకు కొద్దిగా హర్ట్ అయ్యారు.

"చీకటి మాటున ఎస్టేట్‌లో వున్న పొదల చాటున తలదాచుకుని వుంటారు ఆ దొంగలు, తెల్లవారిన మరుక్షణం పట్టుబడి వుంటారు. సందేహం లేదు." స్టిఫ్‌గా నిలబడి కాస్తంత దురుసుగానే సమాధానం ఇచ్చాడు ఒక అనుచరుడు.

పంటి క్రింద నొక్కి వుంచిన సిగరెట్‌ని చేతుల్లోకి తీసుకుంటూ ప్రక్కకు చూశాడు సర్‌గోసా.

"ఇంతకు ముందే ఒక వైర్‌లెస్ మెస్సేజి వచ్చింది ఎస్టేట్ దగ్గర్నించి. తెల్లవారిన తర్వాత మాత్రమే కాదు - ఇంతవరకూ పట్టుబడలేదట ఆ దుర్మార్గులు. పాత గుడ్డల్లో మూటకట్టబడిన ఆహారపదార్థాలు మాత్రం కొన్ని రక్కిస పొదలమధ్య అగుపించాయట...." వెంటనే అందుకున్నాడు సర్‌గోసా అనుచరుడు ఒకతను.

సర్‌గోసా ప్రవర్తన మీద అయిష్టాన్ని పెంచుకుంటున్న వాసింసాట్ అనుచరులకు కరెంట్‌షాక్ కొట్టినట్లు అయింది.

పాతగుడ్డల్లో మూటలు కట్టిన ఆహార పదార్థాలు కనిపించాయంటే - అర్థం ఏమిటి ఆ మాటలకు?

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు వాళ్ళు.... తమ ఒంటెల మీది చెక్కపీపాలకేసి కూడా చూశారు.

"యువ్వార్ కరెక్ట్ జంటిల్మెన్... మీరు తీసుకురావల్సిన ఆహారపదార్థాలకు బదులు ఆ దుర్మార్గుల్ని ఇక్కడికి మోసుకువచ్చి వుంటారు... ఒక్కక్షణం వెయిట్ చేస్తే మీకే అర్థం అవుతుంది..." అంటూ ముందుకు అడుగు వేశాడు సర్గోసా.

పీపాల్లో కూర్చుని సర్గోసా స్థావరాన్ని చేరుకోవాలనే ఆలోచన చేసినందుకు తనను తేనే నిందించుకున్నాడు, చెవులు రిక్కించి ఆ సంభాషణను వింటున్న షాడో. స్థావరంలోకి రాకముందే పీపాల్లోనుంచి బయటపడే ప్రయత్నం చేయనందుకు ఎంతగానో బాధపడుతూ, దుస్తుల్లో వున్న కైజారును చేతుల్లోకి తీసుకున్నాడు.

"మా సంభాషణ మొత్తం నీ చెవులకు చేరి వుంటుందనే ఆశిస్తున్నాను.... ప్లీజ్ కమౌట్ మిస్టర్ షాడో.... అనవసరమైన ఆలోచనలు చేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టకుండా వెంటనే బయటికి వస్తావని నా ఆశ..." ఒంటెలకు దగ్గిరగా నిలబడుతూ పెద్ద కంఠంతో పిలిచాడు సర్గోసా.

ఆ మాటలు తనకు వినబడనట్లు నటిద్దామని అనుకున్నాడు షాడో.... చుట్టు ముడుతున్న చీకట్లను ఆసరాగా తీసుకుని కొండగుట్టల్లోకి పరుగులు తీద్దామని కూడా అనుకున్నాడు.

అవతలి పీపాలో వున్న తన ఫ్రెండ్ని తలుచుకునేసరికి అంతం అయిపోయాయి అతని ఆలోచనలు.

తన మాదిరిగా బయటికి దూకే ప్రయత్నం చేయలేక పోతే, పట్టుబడిపోతుంది వారికి.... తన మీది కక్షనంతా ఆమె మీద ప్రదర్శించేందుకు అవకాశాన్ని చేచేతులారా సర్‌గోసాకి ఇచ్చినట్లే అవుతుంది.

"తెలివితేటల్లో, తెంపరితనంలో నిన్ను మించిన వారు మరొకరు లేరని నేను విన్నమాటలకు విరుద్ధంగా ప్రవర్తించవచ్చు మిస్టర్ షాడో... మొండితనాన్ని ప్రదర్శించి మా ఆగ్రహానికి గురి కావద్దు..." ఉన్నట్లుండి సీరియస్‌గా హెచ్చరించాడు సర్‌గోసా.

రెండో ఆలోచన లేకుండా పీపా మూతను పైకెత్తి బయటికి తొంగి చూచాడు షాడో.

కనులు చిట్లించి చూస్తున్న సర్‌గోసా పెదవుల మీద వెంటనే ప్రత్యక్షమయిందొక చిరునవ్వు.

నీటి గుంటల దగ్గిర సంచరిస్తాయని ఎడారి వాసులందరూ చెప్పుకునే జలభూతాన్ని చూసినట్లు అదిరి పడ్డారు వాసింసాట్ అనుచరులు.

"చంపండి.... ఆ దుర్మార్గుడిని నరికి ముక్కలు చేయండి..." అని కేకలు పెడుతూ ఒకేసారి కదిలారు.

కైజారును బిగించి పట్టుకొని పీపాలోనుంచి క్రిందికి దూకాడు షాడో.... సమీపంలోకి వచ్చిన ఒక వ్యక్తి గుండెలమీద బలంగా గుద్ది, ఆయుధాన్ని గాలిలోకి ఎత్తబోతుండగా, వెనుకనుంచి అతని చేతుల్ని వడిసి పట్టుకున్నారు సర్‌గోసా అనుచరులు.

"ఎన్నో సంవత్సరాలుగా నేను వేస్తున్న పథకాలను నాశనం చేసేటందుకు నువ్వు బయలు దేరుతున్నావని తెలిసిన క్షణంనుంచీ నిన్ను మట్టుబెట్టి మట్టిలో కలిపేయాలని ప్రయత్నాలు చేశాను... నా ప్రయత్నాలన్నిటినీ విఫలం చేయటమే కాకుండా, రెండో కంటి వాడికి తెలియదని అనుకున్న నా స్థావర రహస్యాన్ని బట్టబయలు చేసేశావు... నీ పట్టుదలకు నా జోహార్లు మిస్టర్ షాడో..." క్రిందినించి పైదాకా పట్టి పట్టి చూస్తూ అన్నాడు సర్‌గోసా.

ఆ మెచ్చుకోలుకు పొంగి పోతున్నట్లుగా ముఖం పెట్టాడు షాడో... కనుచివరల నుంచి చుట్టూ వున్న కట్టడాలను పరిశీలించడంలో మునిగిపోయాడు.

మట్టి కట్టడాల మధ్యగా నిర్మించబడివుంది ఎత్తైన కాంక్రీట్ వేదిక ఒకటి.... మిస్సయిల్స్‌ని ప్రయోగించటానికి అటువంటి వేదికల్నే ఉపయోగిస్తారు....

తన ఆయుధాల్ని అక్కడే వుంచాడా అతను?? ఇంకెక్కడయినా దాచి సరయిన అదనుకోసం వేచి చూస్తున్నాడా?

షాడో మనస్సులోని ఆలోచనల్ని తేలికగా అర్థం చేసుకోగలిగినట్లు ఫక్కున నవ్వి తల విదిలించాడు సర్గోసా...

"శత్రువుల చేతికి చిక్కి ఏదో ఒక క్షణంలో ప్రాణాలు పోగొట్టుకోవటం తప్పని సరి అని అర్థం అవుతున్న సమయంలో కూడా వచ్చిన పనిని మరిచిపోని నీ కార్యదీక్షకు తల వంచి అభివాదం చేస్తున్నాను మిస్టర్ షాడో... నువ్వు ఇంత శక్తిమంతుడివి కాబట్టే నన్ను ట్రేస్ చేసే బాధ్యతను పూర్తిగా నీ మీద పెట్టి చేతులు దులుపుకున్నది స్పానిష్ సీక్రెట్ సొసైటీ..." అంటూ తన అనుచరులకు సైగ చేశాడు.

షాడో చేతిలోని కైజారును వశపరుచుకున్నారు వాళ్ళు. బలవంతంగా ఒక మట్టి కట్టడం వైపు అడుగులు వేయించారు.

ఉన్నట్లుండి మరోసారి సైగచేసి వారిని ఆపాడు సర్గోసా.

"బైదిబై మిస్టర్ షాడో... వేరీజ్ యువర్ అసిస్టెంట్? నీతోపాటు ఇత్తడి గంటలు మ్రోగిస్తూ ఎస్టేట్‌లోకి వచ్చిన అసిస్టెంట్‌ని ఎక్కడ దాచిపెట్టావ్?" అని షాడోని అడిగాడు.

తనను బంధించగలిగానన్న ఆనందంలో తన ఫ్రెండ్‌ని గురించి అతను ప్రశ్నించటం జరగదని ఆశిస్తున్నాడు షాడో.... ఆమె ఫ్రీగా వున్నంత వరకూ తను భయపడవలసిన అవసరం లేదని కూడా అనుకుంటున్నాడు.

ఎదురు చూడని విధంగా ఆమె ప్రసక్తి వచ్చేసరికి, విధిలేక తల తిప్పాడు, రెండో పీపాను కనులతోనే చూపించాడు.

"యువ్వార్ ఎ నాటీ బాయ్ మిస్టర్ షాడో... ఇంత జరిగిన తర్వాత కూడా ఇంకా ఎత్తులకు పై ఎత్తులు వేద్దామని అనుకోవటం ఎంత మాత్రము బాగోలేదు." అంటూ ఆ పీపాని క్రిందికి దింపించాడు సర్గోసా.

అతని పిలుపులతో నిమిత్తం లేకుండానే బయటికి వచ్చేసింది షాడో ఫ్రండ్. వారందర్ని చూసి భయపడిపోతున్నట్లు కీచుగా అరిచి షాడో దగ్గిరికి జరిగింది.

ఒంటెల మీది సరంజామాను మట్టి కట్టడంలోకి ట్రాన్స్ఫర్ చేసేందుకు అనుజ్ఞ ఇచ్చి షాడోని అనుసరించాడు సర్గోసా.

"అవసరమైతే బలప్రయోగం చేసి శత్రువుల నందర్ని లొంగతీసుకునే శక్తి వుండి కూడా చేతకాని వారి మాదిరిగా శాంతి వచనాలు పలుకుతూ వుంటారు మా దేశాన్ని పరిపాలించే నాయకులు... మధ్యధరా సముద్ర ప్రాంతాన్నంతా జయించి ఒకే పతాకం క్రిందికి తీసుకురావాలని నా కోరిక..." ఆఫీస్రూమ్ వంటి కట్టడంలో ఒక టేబిల్ ముందు కూర్చుంటూ తన ఆశయాలను వివరించాడతను.

అతని అనుమతితో నిమిత్తం లేకుండానే ఆ టేబిల్ మీద కనిపించిన ఒక సిగరెట్ని సొంతం చేసుకున్నాడు షాడో... రింగులు

రింగులుగా పొగల్ని సీలింగ్ మీదికి వదులుతూ శిలా విగ్రహంలా నిలబడ్డాడు.

"నీ శక్తి సామర్థ్యాల మీద విపరీతమైన నమ్మకం పెంచుకున్నందువల్ల కాబోలు నా డిమాండును నిర్మొహమాటంగా నిరాకరించారు వాళ్ళు... అందుకు ఫలితం అనుభవించబోతున్నారు." అంటూ కుర్చీలో నుంచి లేచి, ఆ కట్టడం మధ్యలో వ్రేలాడుతున్న తెరను తొలగించాడు సర్గోసా...

లావుపాటి పలుకురాయి ఒకటి గొంతుకు అడ్డం పడిన సెన్సేషన్ వెంటనే ఆవరించుకున్నది షాడోని.

కట్టడంలో అమర్చివున్న గాస్ లైటు వెలుగులో తళతళ మెరుస్తూ కనిపించాయి బయటికి చేరవేసేందుకు సిద్ధంగా వున్న మిస్సయిల్స్.

"వీటిని వేదిక మీదికి తీసుకుపోవటం, కంప్యూటర్స్‌కి ఎటాచ్ చేసి గాలిలోకి వదలటం... ఇరవై రెండు నిముషాల వ్యవధిలో పూర్తి అయిపోతుంది... రేపు ఉదయం ఆరుగంటలకు స్పానిష్ తీరాన్ని నాశనం చేసి నా శక్తి ఏమిటో ఒకసారి అందరికీ ప్రత్యక్షంగా చూపిస్తాను..." సగర్వంగా అంటున్న సర్గోసాని చూసి తల విదిలించాడు షాడో.

అత్యంత శక్తివంతమైన ఆ మిస్సయిల్స్‌ని ప్రయోగిస్తే అల్జీరియన్ ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? తమ భూభాగంలోనుంచే అవి బయలు దేరాయని గ్రహించి, వెంటనే కార్యరంగంలోకి దిగకుండా ఆగుతుందా??

ఈసారి కూడా షాడో ఆలోచనల్ని చాలా తేలికగానే అర్థం చేసుకుని, కట్టడం కంపించి పోయేటట్లు నవ్వాడు సర్‌గోసా.

"ఎడారి వాసుల్ని మోసం చేసి, వారి అమాయకత్వం ఆధారంగా కోటీశ్వరుడైన వాసింసాట్ వంటి వారిని నేను మచ్చిక చేసుకున్నది అందుకోసమే మిస్టర్ షాడో.... అల్జీరియన్ ప్రభుత్వం అనవసరమైన కుతూహలాన్ని ప్రదర్శించకుండా వుండటం కోసమే...." అంటూ కర్టెన్‌ని యధాస్థానంలోకి చేర్చి, కుర్చీలో కూర్చున్నాడు.

కుశల ప్రశ్నలు వేయటం, గొప్పతనాన్ని గురించి మాట్లాడుకోవటం పూర్తి అయిపోయిందని గ్రహించి, ఆ తరువాత వినవచ్చే మాటల్ని తట్టుకోవటానికి సిద్ధం అయ్యాడు షాడో.

"చాప క్రింద నీటి మాదిరిగా నా జాడల్ని అన్వేషిస్తూ వచ్చి నా కార్యక్రమాలన్నిటినీ నాశనం చేయబోయిన నిన్ను ప్రాణాలతో వదలటం అసంభవం మిస్టర్ షాడో... నీ వంటి శక్తివంతుడిని నాశనం చేయటం నాకు బాధకరంగానే వున్నది.... అయినా సరే యూ హేవ్ టూ డై మిస్టర్ షాడో... ఏ మిస్సయిల్స్‌ని ప్రయోగించకుండా నన్ను అడ్డుకోవటానికి వచ్చావో అవే

మిస్సయిల్స్ వెలువరించే మంటలకు ఆహుతి అయిపోవాలి నువ్వు..." అంటూ చప్పట్లు చరిచాడు సర్గోసా.

వెంటనే లోనికి వచ్చారు అతని అనుచరులు నలుగురు.

"తీసుకుపోయి కాంక్రీట్ వేదిక దగ్గిర బంధించండి.... మిస్సయిల్స్‌ని ప్రయోగించేటప్పుడు ఆ మంటల మధ్య మాడి మసి అయిపోయే ఏర్పాట్లు చేయండి...." ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞ ఇచ్చాడతను.

చేతుల్ని విరిచి పట్టుకుని వేదిక దగ్గిరికి తీసుకు పోయారు వాళ్ళు షాడోని.... వేదిక ప్రక్కనే వున్న కొన్ని ఇనుప రింగులకు గొలుసులతో బంధించి చేతులు దులుపుకున్నారు.

అరగంట తరువాత చిన్న ట్రాలీ మీద అక్కడికి తీసుకురాబడ్డాయి రెండు మిస్సయిల్స్... వింటినుంచి ఎక్కుపెట్టిన బాణాల మాదిరి ఆ వేదిక మీద నిలబెట్టబడ్డాయి.

"అవి స్టార్ట్ అయిన మరుక్షణం మనం ఖతం అయిపోతాం దోస్త్... వాటిలోనుంచి వెలువడే మంటల్ని తట్టుకోవటం మన వల్లకాదు..." భయంభయంగా చుస్తూ కామెంట్ చేసింది షాడోతో పాటు అక్కడ బంధింపబడిన అతని ఫ్రండ్.

ముక్కు ముఖం తెలియని తనను అనుసరించి వచ్చి, తన ప్రాణాలను పోగొట్టుకోబోతున్న ఆ అమాయకురాలిని చూస్తున్నకొద్దీ బరువెక్కసాగాయి షాడో గుండెలు.

సర్గోసా స్థావరాన్ని చేరుకోగలిగికూడా, ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో చిక్కుపడిపోయినందుకు ఎంతగానో చింతించసాగింది అతని హృదయం.

ఏమీ చేయలేని నిస్సహాయ స్థితా తనది??

చేతుల్ని పట్టి వుంచిన ఇనుపగొలుసుల్ని గట్టిగా లాగి చూసుకుంటున్న అతని కనుల ముందు హఠాత్తుగా ప్రత్యక్షం అయ్యారు తన ధాటికి ఆగలేక వెనుతిరిగిన డంకాలీ దొంగలు.

తగిలిన దెబ్బల్ని మరిచి పోయే మనస్తత్వం కాదు వారిది... తమను ఎదిరించిన వారిని వెంటాడి వెంటాడి దెబ్బకు దెబ్బ తీయందే నిద్రపోని రాక్షసిమూక అని పెద్దపేరు వారికి....

సర్గోసా శక్తి ఎటువంటిదో తెలిసి వెనుకంజ వేస్తున్నారా?? ఒంటెల కారవాన్ ఎటుపోయిందో తెలియక తడుముకుంటున్నారా??

ఇనుపరింగులకు తగిలించిన గొలుసుల్ని లాగిలాగి చూసుకుంటున్న షాడోని గమనించి తమలో తాము నవ్వుకుంటున్నారు కాంక్రీట్ వేదిక దగ్గిర కాపలా నిలబడిన సర్గోసా అనుచరులు ఇద్దరు...

ఉన్నట్లుండి మాయం అయిపోయింది వారి నవ్వు... చటుక్కున క్రిందికి వంగి ఇసుకలో నుంచి ఏదో వస్తువును పైకి తీశాడు వారిలో ఒకతను.

రెండు దీనారాలు విలువచేసే వెండి కాయిన్ అది!

అతని ఆశ్చర్యం అంతం కాకముందే వెర్రిగా అరిచి మరో నాలుగు అడుగులు అవతలికి వేశాడు రెండో వ్యక్తి... ఇంకో వెండి నాణేన్ని ఇసుకలోనుంచి తీసి తన సహచరుడికి చూపించాడు...

పదే పది క్షణాల్లో ఆ ప్రదేశంలో వున్న వారందరికీ అందిపోయిందా వార్త... పవర్‌ఫుల్ టార్చిలైట్లు పట్టుకొని వెతుకులాట ప్రారంభించిన ప్రతి మనిషికీ లభించటం మొదలుపెట్టాయి అటువంటి నాణేలు అనేకం.

"ఆకాశంలోనుంచి పడ్డాయి ఇవి... ఎడారిలో నివశించే భక్తుల మీద దయతో దేవుడు ఈ నాణేల వర్షాన్ని కురిపిస్తూ వుండి వుంటాడు..." చేతినిండా పోగయిన నాణేల వంక చూసుకుంటూ ఆనందంగా అన్నాడు ఒక అనుచరుడు.

తన మనసును కలవర పెడుతున్న ఆలోచనల్ని మరిచిపోయి ఆశ్చర్యంగా చూశాడు షాడో తన ఫ్రెండ్ ముఖంలోకి.

"ఇస్తాఫ్ నగరంలో మనం సంపాదించుకున్న డబ్బు అది... ఎందుకైనా మంచిదని నాతోపాటు తీసుకువచ్చాను... నీటిగుంట దగ్గిర్నించి ఒక్కొక్కటిగా క్రిందికి వదులుతూ, మిగిలిన వాటన్నిటినీ ఇక్కడ వెదజల్లాను..." ముసిముసి నవ్వులు నవ్వుతూ చెప్పిందామె.

ముందుకు వంగి ఆ పెదవుల్ని ముద్దాడే వాడే... చేతులకున్న బంధనాలు వెనక్కి లాగటంతో ఆగిపోయాడు షాడో.

ఎర్రటి ఇసుకలో తెల్లగా మెరిసే ఆ నాణేలు గుడ్డివాడికి కూడా దారి చూపించి తీరతాయి... తమను అనుసరించటానికి ప్రయత్నించే వారిని తప్పకుండా అక్కడికి తీసుకు వచ్చి తీరతాయి...

ఆ మాట అతని మనస్సులో మెదులుతూ వుండగానే, ఆ ప్రదేశమంతా దద్దరిల్లిపోయేటట్లు వినవచ్చింది ఒక శబ్దం.

అదిరి పడి తలతిప్పిన అతనికి వెంటనే అగుపించింది, కొండగుట్టమీదినించి క్రిందికి దొర్లుకు వస్తున్న పెద్ద బండరాయి.

వద్దు వద్దని అనుకుంటూనే గొంతెత్తి బిగ్గిరిగా అరిచాడు షాడో. అరుపు అతని పెదవుల్ని దాటి దాటక ముందే, సూటిగా వచ్చి ఒక మట్టికట్టడం మీద పడిందది.

పది టన్నుల బాంబు ప్రేలిన సవ్వడి... దారుణమైన దుమ్ము, అలవికాని ఆందోళన ఆ ప్రదేశమంతా వ్యాపించాయి....

ఆ సందడి సద్దుమణగకముందే స్టార్ట్ అయినాయి భయంకరమైన తుపాకీ శబ్దాలు.

తమను గురించి ఎడారి వాసులందరూ అనుకునే మాటల్ని నిజంచేశారు డంకాలీ దొంగలు... సకుటుంబ బంధు మిత్ర సపరివార సమేతంగా వచ్చి సర్గోసా స్థావరాన్ని చుట్టుముట్టారు.

పిచ్చికల మాదిరి రివ్వురివ్వున గాలిలోకి ఎగురుతున్న బుల్లెట్లను, కందిరీగల మాదిరి ఝుంకారాలు చేస్తూ దూసుకువస్తున్న బరిశెల్ని చూసేసరికి చెమటలు పట్టాయి షాడో అరిచేతులు.

గురి తప్పి వాటిలో ఏ ఒక్కటయినా తమకు సమీపంలోకి వస్తే??

ఆ పని జరిగేలోపల తాము తప్పించుకోగల అవకాశం ఏదయినా వున్నదా?

మణికట్లు వరుసుకుపోయి గాయ పడుతున్నా లెక్క చేయకుండా గొలుసుల్ని తెంచుకునే ప్రయత్నం చేస్తున్న అతన్ని గమనించి వికటాట్టహాసం చేశాడు తన అనుచరుల్ని హెచ్చరించి డంకాలీ దొంగల మీదికి పంపుతున్న సర్గోసా...

"ఇది కూడా నీ పనే అయి వుంటుంది... నీ మూలకంగానే ఈ ఎడారి నక్కలు నా స్థావరం మీదికి దాడి చేయటానికి నిశ్చయించుకొని

వుంటారు... నిన్ను అడ్డు తొలగించుకోనిదే నా పనులు సాఫీగా ముందుకు సాగవు..." అంటూ కట్టడంలోకి పరుగుతీశాడు.

వేదిక మీదికి చేర్చబడిన మిస్సయిల్స్‌ని స్టార్ట్ చేయటం కోసమే అతనలా వెనుతిరిగాడని అర్థం అయ్యేసరికి చెమటలతో తడిసి పోయింది షాడో శరీరం...

మిస్సయిల్స్‌ని స్టార్ట్ చేయటానికి ఎంత సమయం అవసరమవుతుంది? నిముషమా? రెండు నిముషాలా??

ముఖం మీదినించి జారి కనులలో పడుతున్న చెమట బిందువుల్ని షర్టు భుజానికి అద్దుకుంటూ తన ప్రయత్నాల్ని తీవ్రతరం చేయబోతుండగా, వెనుక నుంచి అతని భుజం మీద పడ్డాయి సున్నితమైన చేతులు రెండు.

అదిరి పడి తల తిప్పిన అతనికి వెంటనే అగుపించింది ఫియన్నా...

ఒంటరిగా రాలేదామె... వెంటనే వున్నాడు రాబర్ట్... మర్రి మొదళ్ళవంటి తన చేతుల్ని జాచి ఇనుపగొలుసుల్ని పట్టుకున్నాడు... పురికొసల్ని తెంపినట్లు పుటుక్కున తెంపి అతన్ని బంధ విముక్తుడిని చేశాడు.

చోటుగాని చోటులోకి వారెలా వచ్చారో అర్థం కాలేదు షాడోకి... అర్థం చేసుకునే వ్యవధి కూడా అతనికి లభించలేదు.

ఉన్నట్లుండి తెల్లటి పొగల్ని వెలువరించటం మొదలు పెట్టింది వేదిక మీది మిస్సయిల్స్‌లో మొదటిది.

"నా దోస్త్‌ని కూడా బంధ విముక్తురాలిని చేయండి... క్విక్..." అని వారిని హెచ్చరిస్తూ ఛెంగున గాలిలోకి ఎగిరి వేదిక మీదికి ఎక్కాడతను. జెండాస్తంభాలవంటి ప్రొజెక్షన్స్‌కి బిగించబడి పొగలు వెలువరుస్తున్న మిస్సయిల్‌కి భుజాన్ని ఆనించి ప్రక్కకు నెట్టాడు.

అతను చేస్తునదేమిటో అర్థమై, తనుకూడా అదేపని చేశాడు రాబర్టో... రెండవ మిస్సయిల్‌ని క్రిందికి నెట్టి వేదిక మీదినించి దూకేసాడు.

అదే సమయంలో ఆరంజ్ కలర్ మంటల్ని వెలువరించాయి ఆ ఆయుధాలు... వెయ్యి స్టీమ్ ఇంజన్లు చేసే శబ్దాల్ని తాము వెలువరిస్తూ బాణాల మాదిరి ముందుకు కదిలాయి.

చెవుల్ని గట్టిగా మూసుకుని సాధ్యమైనంత దూరం పరిగెత్తారు షాడో, అతని బృందం.... నడుమెత్తున వున్న ఒక కొండరాయి చాటుకు పోయి, ఇసుకలో బోర్లా పడుకున్నారు.

నిట్టనిలువుగా గాలిలోకి లేవాల్సిన ఆ భయంకర ఆయుధాలు, నేలబారుగా నడిచి అడ్డువచ్చిన మట్టి కట్టడాల్ని ధ్వంసం చేస్తూ, కొండగుట్ట మీదికి ఎగబ్రాకాయి.... తాచు పాముల మాదిరి అవతలి వైపుకు దిగి, దారుణమైన శబ్దంతో బ్రద్దలైపోయాయి.

రెండు వందల అడుగుల ఎత్తుకు లేచింది బ్రహ్మాండమైన ఫైర్‌బాల్... నిట్టనిలువుగా గాలిలోకి ఎగశాయి నల్లటి ధూమస్తంభాలు...

కళ్ళకు కనిపించని రాక్షసులు పెద్దపెద్ద ఇనుపసమ్మెటలతో కొట్టినట్లు ముక్కలు ముక్కలై పోయింది కొండగుట్ట... ఫుట్‌బాల్ సైజులో వున్న గ్రనేడ్స్ మాదిరి నాలుగు దిక్కులకు చెదిరి అడ్డంగా వచ్చిన ప్రతి మనిషిని కసితీరా బలితీసుకున్నాయి - కొండరాళ్ళు.

అమితమైన ఆగ్రహానికి గురై, మిస్సయిల్స్ ప్రయోగించటానికి అవసరమైన సాధనాలన్నిటినీ పూర్తిగా ఉపయోగించుకోక పోవటం వల్ల దారుణమైన పద్ధతిలో పెనాల్టీ పే చేశాడు సర్‌గోసా.... తన స్వహస్తాలతోనే తన స్థావరాన్ని సర్వనాశనం చేసుకున్నాడు.

వడగళ్ళు పడినట్లు అదేపనిగా వచ్చిపడుతున్న కొండరాళ్ళ దెబ్బలకు తల పగిలిపోకుండా జాగ్రత్త పడుతూ, ముందుకు తొంగి చూసిన షాడోకి వెంటనే అగుపించింది ఒక పెద్ద రాళ్ళగుట్ట.

సర్గోసా ఆఫీస్ గది వుండవలసిన ప్రదేశంలోనే ఏర్పడిందది...

అతను అపహరించుకు వచ్చిన ఇతర మిస్సయిల్స్‌ని తన క్రింద దాచేసుకున్నది.

* * * * *

".... నీ ప్రక్కనే వుండి నీతోపాటు ఇన్వెస్టిగేషన్స్‌లో పాలు పంచుకోవటం కంటె, దూరం దూరంగా సంచరిస్తూ, నిన్ను అనుసరించటమే మంచిదని మాకు అనిపించింది..."

సూది క్రింద పడినా పెద్దగా వినిపించేటంత నిశబ్దాన్ని పులుముకున్న ఆ ప్రదేశాన్ని పరిశీలనగా చూస్తూ షాడోతో అన్నది ఫియన్నా.

మిస్సయిల్స్ వెలువరించిన ప్రేలుడు అదుటుకు గుండెలు అవిసిపోయాయి కాబోలు, ఆ చుట్టుపట్ల ఎక్కడా కనిపించకుండా మాయం అయ్యారు డంకాలీ దొంగలు...

గుడ్డిగా వారిని ఎదిరించి, సమూలంగా నాశనమై పోయారు సర్గోసా అనుచరులు....

ఒంటెలకు విశ్రాంతి ఇచ్చేందుకు స్థావరానికి దూరంగా తీసుకుపోవడం వల్ల, ప్రాణాలు కాపాడుకోగలిగారు వాసింసాబ్

అనుచరులు కొందరు... జరిగింది ఏమిటో అర్థమైన తరువాత క్షణం కూడా ఆలస్యం చేయలేదు వాళ్ళు... ఒంటెల్ని దారి మళ్ళించి తమ ఎస్టేట్ కేసి పారిపోయారు...

"వాసింసాట్ ఎస్టేట్ దగ్గిర నీ కోసం మాటు వేశాం... ఒంటెల కారవాన్‌ని అనుసరించి వస్తుండగా, ఈ డంకాలీ తెగ మమ్మల్ని కూడా ఎదిరించటం వల్ల కాస్తంత అలస్యమైంది..." అంటూ తమ ప్రయాసల్ని వివరించింది ఫియన్నా...

గుట్టలు గుట్టలుగా పేరుకున్న కొండరాళ్ళ మధ్య అడుగులు వేస్తూ, అక్కడక్కడా అగుపిస్తున్న మానవశరీరాల్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు షాడో...

అందరి మాదిరిగా తనుకూడా ఆ రాళ్ళగుట్టల క్రింద పడి హతమారి పోయివుంటాడా మేజర్ జనరల్ సర్‌గోసా? భయంకరమైన ఆయుధాల్ని ప్రయోగించి ఎందరో అమాయకుల్ని హతమార్చాలని పథకం వేసిన ఆ పెద్దమనిషికి అంత చక్కటి మృతి లభించే అవకాశం వుందా?

ఎంత వెతికినా అతని జాడలు అగుపించక పోవటంతో అసహనంగా తల విదిలించి వెనుతిరగబోతున్న అతని భుజం తట్టింది అతని ఫ్రెండ్.

"ఈ ప్రేలుడు అదటుకు రాడర్ల ద్వారా గమనించి, ఇటుగా రావచ్చు అల్జీరియన్ సైన్యాలు... పెనం మీదినించి నిప్పుల్లో పడినట్లు అవుతుంది మన పరిస్థితి వారికి చిక్కుపడితే..."

అదే నిర్ణయానికి వచ్చాడు షాడో... ఫియన్నాకి సైగ చేసి ఎడారి వైపుకు కదలబోతుండగా - గుండెలు జలదరించేటట్లు శబ్దం చేసిందొక రివాల్వర్.

ఎర్రటి నిప్పుకణం ఎడమ భుజంలోకి దిగబడుతున్నట్లు బాధ కలుగుతుండగా ఎగిరి వెనక్కి పడిపోయాడు అతను...

"నా దారికి అడ్డు వచ్చిన వారిని వదిలిపెట్టే అలవాటు నాకు లేదు... నా ఆశయ సాధనకు అభ్యంతరాలు కల్పించిన నువ్వు ఇంకొక్క క్షణంకూడా బ్రతికి వుండటానికి వీలులేదు..." అంటూ ఒక రాళ్ళగుట్ట చాటునుంచి ఇవతలికి వచ్చాడు సర్గోసా....

కొండరాళ్ళు తగిలి దారుణంగా తయారయింది అతని అవతారం... ఒక కాలు ఒక చెయ్యి విరిగి పోయినట్లుగా క్రిందికి వ్రేలాడుతున్నాయి.

బాగా వున్న చేతితో పెద్ద రివాల్వర్ని పట్టుకున్నాడతను... పళ్ళు పటపటమని కొరుకుతూ ముందుకు అడుగువేశాడు.

క్రిందినించి లేవటానికి ప్రయత్నించాడు షాడో... ప్రక్కనే వున్న ఒక కొండరాయిని అందుకుని అతని మీదికి విసరాలని కూడా అనుకున్నాడు.

అతని కంటె వేగంగా కదిలింది అతని ఫ్రెండ్... ఆడ చిరుత మాదిరి చెవులు చిల్లులు పడిపోయేలా అరుస్తూ అమాంతం గాలిలోకి ఎగిరి సర్గోసా మీదికి దూకుంది...

చేతిలోని రివాల్వర్ని చటుక్కున ఆమెకేసి తిప్పాడు సర్గోసా...

"గెట్డౌన్ మై ఫ్రెండ్... గెట్ డౌన్..." అవేదన నిండిన కంఠంతో గొంతు చించుకుని అరిచాడు షాడో...

శరీరంలోని శక్తినంతా కూడగట్టుకుంటూ పైకి లేచాడు.-

అప్పటికే అయిపోయింది ఆలస్యం.

ఒకదాని తర్వాత ఒకటిగా బారెల్లో నుంచి బయటికి వచ్చాయి రివాల్వర్ బుల్లెట్లు. అతని దోస్త్ గుండెల్లో దిగబడి ఆమెను వెనక్కి నెట్టేశాయి.

కనుల ముందు ఎర్రని సిల్కు పరదాలు ప్రత్యక్షమవుతున్న సెన్సేషన్ ఆవరించుకుంటుండగా, గుడ్డిగా పోయి సర్గోసా గుండెల మీద పొడిచాడు షాడో తలతో.

అతను క్రింద పడగానే చేతికి అందిన కొండరాయితో తలను పచ్చడి చేయటం మొదలుపెట్టాడు.

ఫియన్నా , రాబర్ట్‌లు చెరొకవైపునుంచీ చేతులు పట్టుకుని వెనక్కి లాగటం వరకే అతనికి గుర్తున్నది.... ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు.

* * * * *

పదునైన కత్తితో ఎడమ భుజాన్ని ఎవరో పొడుస్తున్నట్లు, పిడికిళ్ళు బిగించి ఇష్టం వచ్చినట్లు హింసిస్తున్నట్లు అనుభూతి చెందుతూ కనులు విప్పాడు షాడో - ఏడు రోజుల తరువాత.

వెంటనే గుర్తుకు వచ్చింది అతనికి అతని ఫ్రెండ్.. అప్రయత్నంగా నీటితో నిండిపోయాయి కనులు...

తన అజాగ్రత్త మూలకంగానే ప్రాణాలు పోగొట్టుకున్నదామె... తన ఏమరిపాటు మూలకంగానే ఎదురయిందామెకు ఆ దుస్థితి...

బుగ్గల మీదికి జారుతున్న కన్నీటిని ఒక సున్నితమైన చేయి తెల్లటి కర్చీఫ్‌తో అద్దటం మొదలు పెట్టేసరికి కనులు పూర్తిగా తెరిచి చూశాడతను.

"బాధ ఎక్కువగా వున్నదా మిస్టర్ షాడో?" మృదువుగా ప్రశ్నించింది అతని దోస్త్.

భరించరాని ఆవేదన కాస్తా తీవ్రమైన ఆశ్చర్యంగా మారుతుండగా చటుక్కున లేచి కూర్చున్నాడు షాడో.

"ఇంకో పదిరోజుల దాకా నువ్వు కదలకూడదని మా డాక్టర్స్ చెప్పారు మిస్టర్ షాడో... ఇప్పుడు వాళ్ళు ఇక్కడికి రావటం జరిగితే నిన్ను వదిలి నన్ను పట్టుకుంటారు... నీకు ఇవ్వాల్సిన మెడిసిన్స్ అన్నిటినీ నాకు ఇచ్చి శిక్షిస్తారు..." నవ్వుతూ అన్నది ఆమె. సున్నితంగా వెనక్కి నెట్టి, తలగడలు సరిచేసింది.

సర్‌గోసా రివాల్వర్‌లోనుంచి వెలువడిన బుల్లెట్స్ ఆమెకు తగలటం తను కళ్ళారా చూసిన జ్ఞాపకం వున్నది షాడోకి.... మరి ఆమె బ్రతికి బట్టకట్టడం ఎలా సంభవించింది??

అతని ఆలోచనలు తనకు అర్థం అయినట్లు చిన్నగా నవ్వి, తను ధరించిన గౌన్‌ని కొంచెంగా ప్రక్కకు జరిపి తన గుండెల్ని చూపించింది అతని ఫ్రెండ్...

నిగనిగలాడుతోంది ఆ గౌను క్రింద ఆమె ధరించుకున్న బుల్లెట్ ప్రూఫ్ కోటు.

అనుక్షణం ప్రమాదాలతో తలపట్లు పట్టే సైనికుల దగ్గిరా, పోలీసుల దగ్గిరా వుండవలసిన ఆ ఆత్మరక్షణ సాధనం ఆమె దగ్గిరికి ఎలా వచ్చింది??

ఆమె క్షేమంగా వుండటానికి కారణం అర్థమైన వెంటనే షాడో మనసులో వుదయించింది మరో ప్రశ్న.

సరిగ్గా అప్పుడే ఆ గదిలోకి వచ్చింది ఫియన్నా...

"ఇటీజ్ వెరీ సింపుల్ మిస్టర్ షాడో... నీతోపాటు నన్నూ, మా రాబర్ట్‌ని కూడా శత్రువులు ఐడెంటిఫై చేశారని గ్రహించగానే, మా స్ట్రాటజీని కొద్దిగా మార్చుకున్నాం మేము... మా డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ ఏజెంట్‌గా చేరిన రాబర్ట్ చెల్లెలు మిల్లీని రంగంలోకి దింపాం... నీతోపాటు అల్జీరియా వచ్చిందామె... నీతోపాటు బానిస వ్యాపారులకు పట్టుబడింది... నీడవలె నిన్ను అనుక్షణం వెన్నంటి వుండి తన వంతు కర్తవ్యాన్ని తను నెరవేర్చింది!"

"ముక్కు ముఖం తెలియని అమాయకురాలిని అష్టకష్టాల పాలు చేశానని నువ్వు బాధపడాల్సిన అవసరం లేదు... నిన్ను వెన్నంటి వుండి నీకు ఎటువంటి ఆపదా లేకుండా చూసుకోవటం ఆమె డ్యూటీ..." మిల్లీ భుజంమీద చేయి వేసి ఆప్యాయంగా నొక్కుతూ చెప్పిందామె.

అంతవరకూ తన మనసులో మెదులుతున్న అనేకరకాల సందేహాలకు సమాధానాలు లభించటంతో తృప్తిగా నిట్టూర్చి కనులు మూసుకున్నాడు షాడో.

"నువ్వు త్వరగా తేరుకోవాలి దోస్త్... వాసింసాబ్ ఎస్టేట్ దగ్గిర వుండగా నువ్వు చేయబోయిన కొన్ని పనుల్ని వెంటనే పూర్తి చేస్తేగాని ఈ ఎస్సైన్‌మెంట్ పూర్తికాదు..." అతని చెవి దగ్గర నోరు పెట్టి హెచ్చరించింది మిల్లీ.

అదిరిపడి కనులు తెరిచాడు షాడో...


ఎస్సైన్‌మెంట్ పూర్తి కాలేదా?

అటూ ఇటూ చూసి, అతని పెదవుల్ని బలంగా చుంబించింది మిల్లీ...

పకపకా నవ్వి బయటికి వెళ్ళిపోయింది.

ఆమె మాటలకు అర్థం ఏమిటో ఇప్పుడు అవగతమైంది షాడోకి... అతని పెదవుల మీద ప్రత్యక్షమైంది చిన్న నవ్వొకటి.

-: శుభం :-


TASTE FOR DEATH
MADHU BAABU